





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



సామినేని రామారావు దారుణ హత్య కేసు దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం

రామారావు హత్య ఘటనపై సిట్ ఏర్పాటు చేయాలి
రౌండ్ టేబుల్ సమావేశంలో కూనంనేని

03



సంపుటి 09, సంచిక: 39 | మంగళవారం | 06-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## పోలవరం – నల్లమల సాగర్‌పై స్టే ఇవ్వండి

- 200 టిఎంసిలు తరలించుకునేందుకు ఎపి యత్నం
- '480 టిఎంసిలను మించి వాడుకునే ప్లాన్
- సుప్రీంకోర్టులో తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు
- విచారణను ఈనెల 12కు వాయిదా వేసిన అత్యున్నత న్యాయస్థానం

**న్యూఢిల్లీ :** పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎపి ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సిజెఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వి కోరారు. గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఎపి ప్రయత్నిస్తోందని సుప్రీం కోర్టులో తెలంగాణ తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు. ఎపి నిర్మిస్తున్న పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం

తరువాయి 2లో

## పోలవరం- నల్లమలను

# కచ్చితంగా అడ్డుకుంటాం

- ప్రాజెక్టు నిర్మాణాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ఎపి ప్రతిపాదనలు ముమ్మాటికీ గోదావరి జల వివాద ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించడమేనని విమర్శ
- తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు న్యాయవాదులతో కలిసి అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని, ఖచ్చితంగా అడ్డుకుని తీరుతామని రాష్ట్ర సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు ముమ్మాటికీ గోదావరి జల వివాద ట్రిబ్యునల్ 1980 అవార్డ్‌తో పాటు అంతరాష్ట్ర జల నిబంధనలు ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనసభ లాబీల్లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ పోలవరంనల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును ఒక్క తెలంగాణా రాష్ట్రం మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కుడా ఆక్షేపిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంత ప్రయోజనాలను కాపాడడంతో పాటు గట్టి వాదనలు వినిపించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్విని నియమించిందన్నారు. సోమవారం జరగాల్సిన వాదనలు వచ్చే సోమవారం రోజుకు వాయిదా పడ్డాయని రిట్ పిటిషన్‌ను

తరువాయి 2లో

# చట్టసభల్లో ఒక శక్తిగా అడుగుపెడతా



## వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాజకీయ పార్టీగా 'తెలంగాణ జాగృతి'

## కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన

### గన్ పార్క్ వద్ద 'తెలంగాణ అమరవీరుల' స్తూపం వద్ద నివాళులు

ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 'తెలంగాణ జాగృతి' రాజకీయ పార్టీగా ఎదుగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రజల హక్కులను కాపాడి, వారి తరపున పని చేసేందుకు 'తెలంగాణ జాగృతి' ఒక శక్తిగా చట్టసభల్లో తిరిగి అడుగుపెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. లెఫ్ట్‌పార్టీలు, మావోయిస్టు సానుభూతి పరులు, మనుగడ కొనసాగించలేకపోతున్న మావోయిస్టులు, ప్రజాస్వామ్య పద్ధతిలో పని చేసే పార్టీ రావాలనుకుంటున్న వారు ,మహిళలు, విద్యార్థులు ముందుకొచ్చి ఒక ఆడబిడ్డగా తనకు మద్దతునిచ్చి, దీవించాలని కోరారు. హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద 'తెలంగాణ అమరవీరుల' స్తూపానికి కవిత సోమవారం నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసిన లక్షలాది మంది ఉద్యమకారులకు టిఆర్ఎస్ లో ఇసుమంత కూడా గౌరవం దక్కలేదని, వేలాదిగా పోస్టులు ఉన్న సరే వారికి పదవులు ఇవ్వాలని గుర్తుకు రాకపోవడం విచారకరమన్నారు. తనకు అవకాశం వచ్చినప్పటికీ చిత్రహింసలు పెట్టి, నానా విధాలుగా అవమానించి, రాజకీయంగా ఎదగనివ్వకుండా బిఆర్ఎస్ ఏం సాధించిందో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పుట్టింటి నుంచి అవమాన భారంతో అన్ని బంధాలు, బందనాలు తెంచుకుని వస్తున్నానని, అత్యంత అవమానకరంగా తనను బయటికి పంపించారని కంట తడి పెట్టారు. జనవరి 26, ఆగస్టు 15, జూన్ 2న ఒక తామ్రపత్రం మాత్రమే తెలంగాణ ఉద్యమకారులు ఆశించారని కానీ ఆ గుర్తింపు కూడా దక్కలేదని, గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా ఉద్యమకారులను, మహిళలను నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో తెలంగాణ పేరును



తరువాయి 2లో

## నీటిపారుదల శాఖలో లక్షల కోట్ల అవినీతి

- ప్రశ్నించినందుకే బిఆర్ఎస్ నాపై కక్ష కట్టింది
- ఆ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని శాసన మండలిలో భావోద్వేగానికి గురైన కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్

నీటిపారుదల శాఖలో లక్షల కోట్ల రూపాయాల అవినీతి జరిగిందని, అమరజ్యోతి, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణాల్లో కూడా అవినీతి జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని తాను ప్రశ్నించినందుకే నిర్లక్ష్యం చేశారని, బిఆర్ఎస్‌లో తన భావ ప్రకటనను

తరువాయి 2లో

## ఆర్‌టిసి బస్సులో సిఎం ; ప్రసాద్ ల్యాబ్స్‌లో సావిత్రి బాయి పూలే సినిమాను తిలకించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రజాపక్షం/హైదరాబాద్


సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన సినిమాను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు ప్రసాద్ ల్యాబ్స్‌లో తిలకించారు. హిందీలో సినిమాను తెరకెక్కించగా గత ఏడాది ఏప్రిల్ 25న విడుదలైంది. ఈ చిత్రానికి అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, డ్యాన్సింగ్ శివ ఫిలిమ్స్ కింగ్స్ మెన్ ప్రొడక్షన్స్ ఫిలమ్స్ బ్యానర్లపై సినిమాను నిర్మించారు. చిత్రంలో ప్రతీక్ గాంధీ, పత్రలేఖ పాల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కుల నిర్మూలనకు

తరువాయి 12లో



## అందరికీ హెల్త్ కార్డులివ్వాలి

- ప్రభుత్వ ఆస్పత్రులలో డయాలసీస్, వెంటిలేటర్లు, ఎంఆర్ఐ తదితర వైద్యపరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలి
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ప్రభుత్వానికి సిపిఐ శాసనసభా పక్షం నేత కూనంనేని సాంబశివ రావు విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో సాధ్యమైనంత వరకు అందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో డయాలసీస్, వెంటిలేటర్లు, ఎంఆర్ఐ తదితర వైద్యపరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సిపిఐ శాసన సభా పక్షం నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కూనంనేని సాంబశివరావు 'ప్రభుత్వ ఆస్పత్రులకు వెంటిలేటర్లు ఇతర వైద్య పరికరాల ఏర్పాటు' అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో

తరువాయి 2లో

## మాట వినకపోతే మదురో కంటే భారీ మూల్యం తప్పదు



### కొత్త అధ్యక్షురాలు రోడ్రిగ్జ్‌కు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** మాట వినకపోతే మళ్ళీ రెండోసారి కూడా దాడిచేస్తామని వెనిజులా కొత్త అధ్యక్షురాలుగా ప్రమాణ స్వీకారానికి సిద్ధపడిన డెల్సీ రోడ్రిగ్జ్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బరితెగించి భారీ హెచ్చరిక చేశారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై మెరుపుదాడిచేసి ఆగమేఘాలపై అమెరికాకు తరలించి ఖైదీగా మార్చిన ట్రంప్ అంతటితో ఆగకుండా మరింత క్రూరత్వం ప్రదర్శించారు. 'ద అట్లాంటిక్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తాను చెప్పినట్లు వినకపోతే మదురోకంటే చాలా ఎక్కువగా దారుణ పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. "మీరు ప్రభుత్వ మార్పు అనుకోండి, మరేదైనా పేరుతో పిలుచుకోండి, కానీ మీరు చేసేది ఏదైనా ఇంతకుముందు సాగినట్టు ఉండకూడదు, మా భవిష్యత్ ప్రణాళిక, మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించినా, వెనిజులాలో తాను తలపెట్టిన సంస్కరణల దార్శనిక దృక్పథానికి భిన్నంగా వ్యవహరించినాగానీ తీవ్ర మూల్యం చెల్లించాల్సి వస్తుంది'' అని రోడ్రిగ్జ్‌కు హెచ్చరిక చేశారు. వెనిజులాకు అమెరికా ప్రభుత్వమే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తుందని మరోవైపు సోమవారం పత్రికాగోష్ఠిలో మరోసారి ఆయన స్పష్టం చేశారు. వెనిజులా చమురు వనరులు, ఖనిజ వనరులను అమెరికాకు అనుకూలంగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ విధంగా తమకు వెనిజులా సంపదను అనుకూలంగా ఉంచితే దేశాన్ని బాగుచేస్తామని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తామని కుంటి సాకులు పలికారు. అమెరికా జోక్యం చేసుకుందన్న పేరుతో మొండి వైఖరి ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. వెనిజులాపై శనివారం తెల్లవారుజామున చేసిన చట్టవిరుద్ధ దాడిని ఆయన సమర్థించుకున్నారు. వెనిజులాలో అధికారం మారినా లేదా కొత్త పాలన ప్రారంభమైనాగానీ ఆ పాలన మునుపటికంటే మెరుగ్గా ఉండాలన్నారు. ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ దేశాధ్యక్షురాలిరిని తాత్కాలిక అధ్య క్ష బాధ్యతలు చేపట్టాలని వెనిజులా సుప్రీం కోర్టు ఇప్పటికే ఆదేశించింది. దేశ సైనిక వర్గాలు కూడా ఆమెను అధ్యక్షురాలుగా గుర్తించాయి. మదురోను బ్రూక్లిన్‌లోని నిర్బంధ కేంద్రానికి తరలించిన తర్వాత దేశంలో ఏర్పడిన పరిస్థితులను ఆమె సమీక్షించారు. మదురోను ఆయన సతీమణిని తక్షణం విడుదల చేయాలన ఆమె ట్రంప్‌ను డిమాండ్ చేశారు. వెనిజులా సార్వభౌమాధికారాన్ని సంరక్షించేందుకు సహాయం చేయాలని లాటిన్ అమెరికా దేశాలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ట్రంప్ ప్రభుత్వం వెనిజులాపై దాడి చేసి తమ అధ్యక్షుణ్ణి బందీగా తీసుకుపోయి అంతర్జాతీయ నిబంధనలను

తరువాయి 12లో



## న్యూయార్క్ కోర్టులో మదురో

### మొదటిసారి న్యాయస్థానానికి వచ్చిన వెనిజులా అధ్యక్షుడు

**న్యూయార్క్:** ఒక దేశానికి అధ్యక్షుడు ఇప్పుడు మరో బలమైన దేశం న్యాయస్థానం బోనులో దోషిగా నిలబడాల్సి వచ్చింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో మొదటిసారి న్యూయార్క్‌లోని న్యాయస్థానం ముందుకు రావాల్సి వచ్చింది. ఆ యనపై కేవలం స్వార్థ ఆర్థిక ప్రయోజనాలకోసం అనేక ఆరోపణలు చేస్తూ ట్రంప్ పాలనాయంత్రాంగం కోర్టులో నిలబెట్టింది. మదురో ఆయన భార్య సిలియా ఫ్లోరెస్ కోర్టుకు రాకముందునుండే కోర్టు వెలుపల ట్రంప్ వ్యతిరేక ప్రదర్శకులు, అనుకూల ప్రదర్శకులు పెద్ద సంఖ్యలో గుమిగూడి నినాదాలు ఇవ్వడం ప్రారంభించారు. మదురో కోర్టుకు హాజరైన తర్వాత

తరువాయి 12లో

## అమెరికాలో సికింద్రాబాద్ యువతి హత్య

### తమిళనాడులో ప్రియుడి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్



అమెరికాలోని మేరీల్యాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి గోడిశాల నిఖిత (27) హత్యకు గురైంది. ఈ కేసులో ఇంటర్ పోల్ పోలీసులు ఆమె మాజీ ప్రియుడు అర్జున్ శర్మను సోమవారం తమిళనాడులో అరెస్ట్ చేశారు. డిసెంబర్ 31 నుంచి నిఖితరావు కనిపించలేదు. జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో ఆమె మృతదేహాన్ని అక్కడి పోలీసులు గుర్తించారు. కాగా.. ఈ నెల 2న అర్జున్ శర్మ నిఖిత మిస్సింగ్‌పై

తరువాయి 2లో

## నేను సంతోషంగా లేను



- ఈ విషయం భారత ప్రధాని మోదీకి తెలుసు
- ఆదేశానికి కొత్తగా సుంకాలు పెంచుతాం
- రష్యాతో చమురు సంబంధాలపై ట్రంప్ హెచ్చరిక

**న్యూయార్క్/వాషింగ్టన్:** భారత్‌–రష్యా మధ్య ముడి చమురు దిగుమతి సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్ళీ హెచ్చరిక చేశారు. భారత్‌పై కొత్తగా సుంకాలు పెంచుతామని సంకేతాలు ఇచ్చారు. తాము విధించిన ఆంక్షలు రష్యా ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయని ట్రంప్ చెబుతూ భారత్ పేరు ప్రస్తావించారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు రష్యా నుండి చమురు కొనుగోలు చేసే ఖాతాదారులపై కూడా తీవ్రమైన ఒత్తిడి తీకురావాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన వెంట ఉన్న రిపబ్లికన్ సెనేటర్ లిండ్‌స్లే గ్రాహం చెప్పారు. రష్యా నుండి భారత్‌కు ముడి చమురు దిగుమతులు కొనసాగితే మరోసారి భారీగా సుంకాలు పెంచుతామని ట్రంప్ అన్నారు. వెనిజులాపై దాడి, ఆ దేశంలో చమురు క్షేత్రాలను స్వాధీనం చేసుకున్నామన్న కొత్త జోష్‌లో ఉన్న ట్రంప్ భారత్‌కు ఈ తాజా హెచ్చరిక చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే చాలా త్వరగా, సునాయాసంగా భారత్‌పై అమెరికా మరోసారి సుంకాలు విధిస్తుందని అన్నారు. క్రిస్మస్ సెలవులు పూర్తిచేసుకుని ఫ్లోరిడాలోని తన సొంత మార్–ఎ–లాగో ఎస్టేట్ నుండి ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో వాషింగ్టన్‌కు

తరువాయి 12లో

## ఢిల్లీ అల్లర్ల కేసులో ఖాలిద్, ఇమామ్‌లకు సుప్రీం బెయిలు నిరాకరణ

05

12




వెనిజులా అధ్యక్షుడు మధురో, ఆయన భార్యను బందీలుగా పట్టుకుపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన దృశ్యం

## తదుపరి లక్ష్యం

# కొలంబియా, మెక్సికో



### కొలంబియా, మెక్సికో, క్యూబా, గ్రీన్‌లాండ్‌లకు ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్ :** వెనిజులా తర్వాత కొలంబియా, మెక్సికో దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. అదేవిధంగా క్యూబా, గ్రీన్‌లాండ్ దేశాలకు కూడా హెచ్చరికలు చేశారు. వెనిజులా తర్వాత ప్రధానంగా డెన్మార్క్ నుండి ఆర్కిటిక్ ద్వీపం గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి మూడు దశల ప్రటనాళికను సిద్ధం చేశారన్న వార్తలు వస్తున్నాయి. వెనిజులాపై దాడి తర్వాత గ్రీన్‌లాండ్ అంశాన్ని ట్రంప్ ప్రధానంగా తెరమీదకు తెచ్చారు. దీంతో గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నాయకులు తీవ్రస్థాయిలో ట్రంప్‌పై ఎదురుదాడి చేశారు. మరోవైపు ట్రంప్ "మీ వైఖరి మార్చుకోకపోతే వెనిజులాకు పట్టిన గతే పడుతుంది'' అంటూ కొలంబియా, మెక్సికో దేశాలను బెదిరించారు. దీంతో భౌగోళికంగా ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. యావత్ ప్రపంచ భవిష్యత్ సంబంధాలను కలుషితంచేసే అసాధారణ చర్యకు అమెరికా పాల్పడిందని ఒక వైపు తీవ్ర విమర్శలు చెలరేగుతునప్పటికీ ట్రంప్ మాత్రం ఎలాంటి పశ్చాత్తాపం ప్రదర్శించకపోగా 'ఫాక్స్‌న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరింత దూకుడుగా లాటిన్ అమెరికా దేశాలకు తదుపరి తీవ్ర హెచ్చరికలు ప్రారంభించారు. కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మూడు మాదక ద్రవ్యాల కర్మాగారాలకు మద్దతు ఇస్తున్నారని, ఆ దేశంపై సైనిక చర్యలకు అవకాశం ఉందని హెచ్చరించారు. కొలంబియాలో ఉన్న మూడు కొకైన్ కర్మాగారాలలో ఉత్పత్తి చేస్తున్న కొకైన్‌ను అక్రమ మార్గాలలో అమెరికాకు తరలిస్తున్నారని, ఈ చర్యలకు స్వస్తి చెప్పకపోతే కొలంబియా ప్రభుత్వాన్ని తుదముట్టిస్తామని హెచ్చరించారు. కొలంబియా దేశాన్ని ఒక రోగి పరిపాలిస్తున్నాడని విమర్శించారు. ఈ విమర్శలను గుస్తావో పెట్రో తీవ్రంగా ఖండించారు. నాపై బురద జల్లడం ఆపేయండి అని ట్రంప్‌కు హెచ్చరించారు. కాగా, మెక్సికో దేశాన్ని అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పరిపాలించడం లేదని,అక్కడి డ్రగ్ కార్టెల్స్ ముఠాలే మెక్సికో దేశాన్ని పరిపాలిస్తున్నాయని ట్రంప్ మండిపడ్డారు. మెక్సికో ప్రభుత్వం గనుక డ్రగ్ కార్టెల్స్‌ను, ఆ ముఠాల కార్యకలాపాలను అడ్డుకోకపోతే అమెరికా స్వయంగా సైనిక చర్యకు పాల్పడుతుందని హెచ్చరించారు. అమెరికాలోకి భారీ ఎత్తు న మాదక ద్రవ్యాలు ప్రవేశించడానికి మెక్సికో దేశమే ఒక ముఖద్వారంగా మారిందని ట్రంప్ అన్నారు.

**వ్యూహాత్మక భద్రత రీత్యా అమెరికాకు గ్రీన్‌లాండ్ కావాలి**

ఇక ప్రపంచంలోనే అతిపెద్ద దీవి దేశం గ్రీన్స్‌లాండ్ జాతీయ భద్రతా రీత్యా అమెరికా అధీనంలో ఉండాల్సిన అవసరం ఉందని వెనిజులా దురాక్రమణ నేపథ్యంలో ట్రంప్ మరోసారి డిమాండ్ చేశారు. గ్రీన్‌లాండ్స్ అమెరికా అధీనంలోనే ఉండాలన్నారు. ప్రచ్ఛన్నయుద్ధ కాలం (1945–1991)లో గ్రీన్‌లాండ్ అత్యంత కీలకమైన ప్రాంతంగా ప్రాముఖ్యత పొందింది. ఈ ప్రాంతంలో అమెరికాథులే వైమానిక స్థావరాన్ని నడిపింది. రష్యా, చైనా, ఉత్తర కొరియాల నుండి వచ్చే ప్రమాదకరమైన గగనతల క్షిపణులు, ఆయుధాలను అదుపు చేయడానికి వ్యూహాత్మకంగా అమెరికాకు ఇదెంతో ముఖ్యమైన ప్రాంతంగా ట్రంప్ భావిస్తున్నారు. కీలక ఆయుధాలను ఆ ప్రాంతంలో మోహరిస్తామని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా జలాంతర్గాములు డెన్మార్క్, గ్రీన్‌లాండ్స్ ప్రాంతాల్లోనే తచ్చాడుతున్నాయని ఆరోపించారు. అవసరమైతే గ్రీన్‌లాండ్స్ ను ఎంతకైనా కొనుగోలు చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకసార్లు ట్రంప్ ప్రకటనలు చేశారు. వాస్తవానికి గ్రీన్‌లాండ్ ప్రాంతం డెన్మార్క్ దేశం అధీనంలో ఉంది. దీంతో డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ ట్రంప్‌కు విజ్ఞప్తి చేస్తూ గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించాలనే ఆలోచనలు విరమించుకోవాలని, బెదిరింపులు ఆపాలని కోరారు. "గ్రీన్స్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనలో అర్థంలేదు, డెన్మార్క్ రాజ్యంలోని మూడు దేశాలలో దేనిని ఆక్రమించే హక్కు అర్హత ట్రంప్‌కు లేదు'' అని ఫ్రెడరిక్సన్ అన్నారు. భౌగోళికంగా గ్రీన్‌లాండ్ ఉత్తర అమెరికాలో ఉన్నప్పటికీ రాజకీయంగా, సాంస్కృతికంగా దీర్ఘకాలంగా గ్రీన్‌లాండ్ ఐరోపా ఖండంతో గాఢానుబంధాన్ని పెనవేసుకుని ఉంది. ఐతే పశ్చిమార్థగోళం అంతటా తమ పెత్తనమే ఉండాలని ఇప్పుడు ట్రంప్ 'డోన్రో' సిద్ధాంతం లేవదీశారు.

**క్యూబాకు మార్కో రుబియో హెచ్చరిక**

క్యూబా దేశం కూడా కుప్పకూలిపోయే స్థితిలో ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. క్యూబా దేశం ఒక విఫల రాజ్యమని, పరిపాలనాపరంగా ఆ దేశం విఫలమైందని విమర్శించారు. క్యూబా ప్రజలపై తమకు చాలా సానుభూతి ఉందని, వారికి సహాయం చేయాలనుకుంటున్నామన్నారు. ఒకవైపు బెదిరింపులు, మరోవైపు సన్నాయి నొక్కులతో కమ్యూనిస్టు పాలకదేశాలపై ట్రంప్ తన ఒత్తిడిని పెంచారు. మరోవైపు అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా క్యూబా ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. తదుపరి తమ లక్ష్యం క్యూబా కావచ్చునన్నారు. క్యూబా దేశం చాలా ఆర్థిక ఇబ్బందులలో ఉందని అన్నారు. క్యూబాపై భవిష్యత్ దాడులు చేస్తారా? అని ప్రశ్నించగా వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరిస్తూ, వెనిజులాలో మదురో ప్రభుత్వానికి క్యూబా మద్దతు ఇస్తోందని, అందువల్ల తాము క్యూబాకు ఎట్టిపరిస్థితుల్లో కాపాడే ప్రయత్నం చేయబోమన్నారు.

---

# ప్రజాస్వామ్య సంక్షేమ పరిపాలనే బిఎన్‌పి లక్ష్యం

### వామపక్ష కూటమి నేతలతో తారిఖ్ అహ్మద్ వ్యాఖ్య



**ఢాకా:** విముక్తి యుద్ధం (1971) లేకుండా బంగ్లాదేశ్ ఉనికే లేదని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ అన్నారు. ఢాకాలోని గుల్షన్‌లో సోమవారం ఆయన బిఎన్‌పిపార్టీ కార్యాలయంలో వామపక్ష అనుకూల "డెమోక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్'' కూటమి నాయకులతో సమావేశమయ్యారు. బంగ్లదేశ్ సోషలిస్ట్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ఈ కూటమి కేంద్ర నాయకుడు బజ్లుర్ రషీద్ ఫిరోజ్ ఈ సమావేశం వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామ్య సంక్షేమ పరిపాలనను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. ఈ దిశగానే దేశంలో తాము పోరాటం చేస్తామని, పాలనకు పురిగొల్పుతామని అన్నారు. దేశం ఒక ప్రజాస్వామ్య సంక్షేమరాజ్యంగా వెలుగొందాలని, ఈ అంశం కేంద్రంగానే ప్రజలు పాటుపడాలని అన్నారు. ఖలీదాజియాకు నివాళులు అర్పించేందుకు, వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేసే ప్రధాన ఉద్దేశంతో సోమవారం ఉదయం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిఎన్‌పి నాయకులు, డెమోక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు ఉమ్మడిగా దేశంలో నెలకున్న పరిస్థితులను క్షుణ్ణంగా చర్చించారు. రాజకీయ అభిప్రాయాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నారు. గడచిన 17 సంవత్సరాలుగా తారిఖ్ రెహ్మాన్ విదేశాల్లో ఉన్నారని, ఇప్పుడు ఆయన కుటుంబానికి తాజాగా పెద్ద కష్టం వాటిల్లిందని, ఈ విషయంలో సంతాపం తెలియజేయడంకోసం తాము వచ్చామని బజ్లుర్ రషీద్ ఫిరోజ్ పాత్రికేయులకు చెప్పారు. 1971లో జరిగిన విముక్తి యుద్ధమే బంగ్లాదేశ్ స్థాపనకు మూలమని తారిఖ్ చెప్పారన్నారు. తారిఖ్ లండన్ నుండి 17 ఏళ్ళ తర్వాత గత ఏడాది డిసెంబరు 25న బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో ప్రధానమంత్రి పదవికి ఆయన పోటీ పడే అవకాశాలున్నాయి. విముక్తి యుద్ధం లేకుండా అసలు బంగ్లాదేశ్ ఉనికే లేదని ఆయన అన్నారని ఫిరోజ్ చెప్పారు.

---

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే

# 'పిఎం కుసుమ్ పథకం' అమలు కాలేదు

### శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:**పదేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పిఎం కుసుమ్ పథకాన్ని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణలో అమలు కాలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శాసనమండలిలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సూర్యఘర్ పథకం, సోలార్ విలేజ్‌ల ఏర్పాటు అంశంపై అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. అప్పట్లో ప్రతిపాదనలు పంపకపోవడంతో ఇప్పుడు కేంద్రం నిధులు లేవు అని చెబుతోందన్నారు. ఈ పథకం కింద తెలంగాణకు గరిష్టంగా కనెక్షన్లు కేటాయించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తాను కేంద్ర విద్యుత్ శాఖ మంత్రిని కలిసి, నిధుల కోసం లిఖితపూర్వకం గా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. అయితే లీజు రైతులకు పిఎం కుసుమ్ వర్తింపజేయబోమని కేంద్రం స్పష్టం చేయడం అడ్డంకిగా మారిందని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా ఆదాయం రైతులకే చేరుతుందని, అందువల్ల లీజు నిబంధనను సవరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అవసరమైతే రైతుల వాటాను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, కేంద్రం నుంచి పీఎం కుసుమ్ కింద కనెక్షన్లు మంజూరు చేయాలని కోరామని వివరించారు.

**మూడు దశల్లో 94 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు : శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజలకు మరింత సులభమైన, పారదర్శకమైన, అవినీతిరహిత సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వ్యవస్థను పూర్తిగా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు గంటల తరబడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద, చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితికి ముగింపు పలుకుతున్నామని చెప్పా రు. రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వాటిలో 94 అద్దె భవనాల్లో, 50 ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ 94 కార్యాలయాలకు మూడు దశల్లో శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.



మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 39 కార్యాలయాల నుంచే రాష్ట్రానికి 69 శాతం ఆదాయం వస్తోందని చెప్పారు. గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) వద్ద రంగారెడ్డి, గండిపేట్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందన్నారు. ఈ నెలాఖరులోగా మిగిలిన 10 సమీకృత భవనాలకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గిందని, ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కేవలం 18 నుంచి 21 నిమిషాల్లోనే పూర్తవు తోందన్నారు.

గిరిజనులు, గిరిజనేతరుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క– సారలమ్మ మహాజాతరను దృష్టిలో ఉంచుకుని మేడారం ప్రాంతాన్ని సుమారు రూ.200 కోట్లకు పైగా వ్యయంతో ఆధునీకరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనమండలిలో కాంగ్రెస్ సభ్యులు, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం, కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ ఈ పనుల్లో ఇప్పటికే దాదాపు 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కనీసం 200 సంవత్సరాలకు పైగా నిలిచేలా రాతి కట్టడాలతో మేడారం ఆధునీకరణ పనులు చేపట్టామని చెప్పారు. మేడారం పరిసర ప్రాంతాల్లో సుమారు 10 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న మేడారం మహాజాతరకు కుంభమేళాను తలపించేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

**బలహీన వర్గాల అభివృద్ధికి న్యాయం చేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

బలహీన వర్గాల అభివృద్ధికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, బండా ప్రకాష్, అంజిరెడ్డి లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడంతో అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం తరఫున అద్దెలు సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఎంజెపిలలోనే లక్షా 50 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కలిపి సుమారు 10 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు.



బడ్జెట్‌లో బలహీన వర్గాలకు రూ.11 వేల కోట్లు కేటాయించామని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

**బిసిలు కేవలం పన్ను కట్టే బానిసలుగా మారిపోయారా?: తీన్మార్ మల్లన్న**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బిసిలు కేవలం పన్ను కట్టే బానిసలుగా మారిపోయారా? అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తారా? చేయరా? అంటూ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బడ్జెట్‌లో బిసిలకు రూ.11,500 కోట్లు కేటాయించినప్పటికీ ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమేనని తెలిపారు. బిసి విద్యార్థుల స్కాలర్షిప్‌లకు రూ.1,908 కోట్లు కేటాయించి కేవలం రూ.365 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రతి ఏడాది బిసిలకు రూ.20 వేల కోట్లు ఇస్తామని చెప్పి కాంగ్రెస్‌లో చేరామని గుర్తు చేశారు.



---

# శాసనసభలో మరో రెండు కీలక బిల్లులు ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సోమవారం మరో రెండు కీలక బిల్లులను ఆమోదించింది. కొత్తగూడెం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి చట్టబద్ధతను కల్పిస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరుపున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా ప్రవేశపెట్టిన తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026కు సభ ఆమోదం ముద్ర వేసింది. అదేవిధంగా జిఎస్‌టి కౌన్సిల్ సిఫార్సుల మేరకు గత సెప్టెంబర్‌లో ప్రభుత్వ తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు చట్ట బద్ధత కల్పిస్తూ తెలంగాణ వస్తువులు, సేవలపై పన్ను సవరణ చట్టం 2026 బిల్లును ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరుపున పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో ప్రవేశ పెట్టిన బిల్లు ఆమోదం పొందింది. అయితే ఈ బిల్లును ఎంఐఎం పూర్తిగా వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేసింది.

పంచాయతీరాజ్ చట్టంలోని 21వ సెక్షన్‌కు సంబంధించిన సవరణ బిల్లును శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇద్దరు పిల్లలకు మించి సంతానం ఉంటే గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను తొలగిస్తూ ఈ సవరణ తీసుకువచ్చారు. ఈ బిల్లును మంత్రి సీతక్క శాసనమండలిలో ప్రవేశపెట్టారు. ఈ అంశంపై జరిగిన చర్చలో ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్ గౌడ్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. గతంలో దీనికి సంబంధించి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయగా, నిన్న శాసనసభ ఈ బిల్లును ఆమోదించింది.

అనంతరం శాసనమండలిలో కూడా బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించింది. తెలంగాణ ప్రజలను జయ జయహే తెలంగాణ గీతం ద్వారా ఏకంచేసిన కవి, గాయకుడు అందెశ్రీ అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా భావించినట్లు అందెశ్రీ కుమారుడు దత్త సాయికి ఉన్నత విద్యా శాఖ పరిధిలోని డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం కల్పించే బిల్లును ఆయన మండలిలో ప్రవేశపెట్టారు. 2025 నవంబర్ 25న ఆర్డినెన్స్ నంబర్–7 ద్వారా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఆ రోజు శాసనమండలి సమావేశం లేకపోవడంతో, నేడు ఆ ఆర్డినెన్స్‌ను శాసనమండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షణీయమని భట్టి తెలిపారు.

---

# యువతి హత్య

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులను ఆశ్రయించాడు. హోవార్డ్ కౌంటీ పోలీసులకు నిఖిత మిస్సింగ్‌పై కంప్లైంట్ చేశాడు. చివరిగా ఆమెను న్యూ ఇయర్ రోజున చూసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదేరోజున అతను ఇండియాకు వచ్చాడు. దీంతో పోలీసులకు అర్జున్‌పై అనుమానం కలిగింది. అతని అపార్ట్‌మెంట్‌లో తనిఖీ చేయగా 3వ తేదీన నిఖిత మృతదేహం లభ్యమైంది.

ఈ కేసులో అతడిని అనుమానితుడిగా చేర్చారు. ఆపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అయితే.. అర్జున్ అమెరికాలో లేకపోవడంతో అతని ఆచూకీ కోసం యుఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత్ అధికారులను సంప్రదించాయి. ఈ క్రమంలో ఇంటెలిజెన్స్ అధికారుల నుంచి అందిన సమాచారంతో ఇంటర్ పోల్ పోలీసులు తమిళనాడులో అర్జున్‌ను అరెస్ట్ చేశారు.

అతడిని అమెరికా పోలీసులకు అప్పగించేందుకు భారత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. గోడిశాల నిఖిత 2025 ఫిబ్రవరి నుంచి వేదా హెల్త్‌లో డేటా అండ్ స్ట్రాటజీ అనలిస్ట్‌గా పనిచేస్తుంది.

మేరీల్యాండలోని ఎల్లికాట్ సిటీలో స్థిరపడింది. ఇటీవలే ఆమె కంపెనీ నుంచి ఆల్ ఇన్ అవార్డు అందుకున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు.

---

## అందరికీ హెల్త్ కార్డులివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, ఉద్యోగుల వేతనాలు, వైద్య ఉద్యోగుల ఖాళీల భర్తీ, బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అమెరికా లాంటి దేశాల్లో వైద్య రంగం పూర్తిగా ఇన్సూరెన్స్ నియంత్రణలో ఉంటుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇన్సూరెన్స్ అందరికీ వర్తింపజేసే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఏజెన్సీ ఏరియాలో వ్యాధులు ప్రబలినప్పుడు ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, ప్రభుత్వం మరింత అప్రమత్తమై తగిన చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు. డయాలసీస్ బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇంతకు ముందు పెంచిన డయాలసీస్ పరికరాలు సరిపోవడంలేదని, కొత్తగూడెంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, ఏరియా ఆస్పత్రులలో మరిన్ని పెంచాలన్నారు. పాల్వంచ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో వెంటిలేటర్ల కొరతతో అనేక మంది మరణించారని గుర్తు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేయాలని, అందుకు తగిన పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రి నుంచి మొదలు అనేక ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యుల కొరత ఉన్నదని, తద్వారా పేదలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఆస్పత్రులలో మందులు అందడంలేదనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. 104,108 వాహనాలు సమయానికి చేరుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఏరియా ఆస్పత్రికి అంబులెన్సును ఏర్పాటు చేయాలని అన్నారు. ఎఎన్‌ఎంలు, సెకండ్ ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, స్కావెంజర్లు, కాంట్రాక్ట్ శానిటరీ వర్కర్లు, పేషంట్ కేర్ వర్కర్లు, సెక్యూరిటీ కార్మికులకే కేవలం రూ.11 వేల వేతనాన్ని మాత్రమే చెల్లిస్తున్నారని, కనీసం రూ.18 వేల ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయని, వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్‌ఎంపి, పిఎంసిలకు శిక్షణ ఇచ్చి, వారికి గౌరవ ప్రదమైన అవకాశాన్నికల్పించాలన్నారు. నేషనల్ హెల్త్ పాలసీ 2017 సూచనల ప్రకారం వైద్య ఆరోగ్య రంగానికి కేంద్రం జిడిపిలో 6 శాతం బడ్జెట్ ఉండాలని, రాష్ట్రంలో 8 శాతం బడ్జెట్ నిధులను కేటాయించాలని, ప్రతి ఏడాది ఒక్క శాతం పెంచాల్సి ఉన్నదని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య రంగానికి 4.06 శాతం మాత్రమే ఉండడం బాధకరమైనప్పటికీ, గత ఏడాది కంటే 8 శాతం అధికంగా ఉందని వివరించారు. జిడిపిలో వైద్య రంగానికి అమెరికాలో 16.7 శాతం, జర్మనీలో 11.5 శాతం, కెనాడలో 11.3 శాతం, ఇంగ్లండ్‌లో 10.4 శాతం, ఆస్ట్రేలియాలో 10.3 శాతం , ఆసియా, స్విడన్‌లలో 11. 2 శాతం ఉండగా, భారతదేశంలో మాత్రం 1.94 శాతం మాత్రమే బడ్జెట్‌లో నిధులను కేటాయించారని సాంబశివరావు వివరించారు. ప్రతి ఏటా ఒక శాతం పెంచుకుంటూ త్వరిగతిన కేటాయిస్తే, స్టాండర్డ్ కేటగిరీలో వెళ్తుందని, తద్వారా పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వివిధ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ కోటా అయిపోయిందని బాధితులకు పూర్తి స్థాయి చికిత్స అందకముందే బయటికి పంపిస్తు న్నారని, కోటా ముగిసినప్పటికీ పూర్తి స్థాయి వైద్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌ను కేవలం ఉస్మానియా, ఆస్పత్రికి పరిమితం చేశారా? అని ప్రశ్నించారు.

## అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

అణచివేశారని, ప్రశ్నించినందుకే తనపైన కక్షకట్టారని విమర్శించారు. శాసనమండలిలో సోమవారం కవిత మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంట తడిపెట్టారు. బిఆర్‌ఎస్ ఇచ్చిన ఎంఎల్‌సి పదవిలో తాను కొనసాగలేనని, తన రాజీనామాను ఆమోదించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాలో ధర్నా చౌక్ తొలగింపు, రైతుల అరెస్టులు, ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలపై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట, సిరిసిల్లలో నిర్మించిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయని, ఇసుక దందాల కోసమే నేరెళ్ల దళిత బిడ్డలపై దురాగతం జరిగిందని,బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవడం తనకు అవమానంగా మారిందన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల్లో తన పాత్ర లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ కావడంలో తన వంతు కృషి ఉందన్నారు.

కెసిఆర్ దేశ రాజకీయాల్లోకి వెళ్లేందుకు తాను ఒప్పుకోలేదని, తెలంగాణలో ఉన్న సమస్యలను, పనులను పక్కన పెట్టి దేశ రాజకీయాలకు వెళ్లడం ఎందుకని తాను ప్రశ్నించినట్టు కవిత వివరించారు. తెలంగాణ ఉద్యమకారుల మాటలు కెసిఆర్‌కు చేరకుండా అడ్డుకుంటున్నారని, ఉద్యమ ద్రోహులను బిఆర్‌ఎస్ నెత్తిన పెట్టుకుందని ఆరోపించారు.

**నైతికత లేని బిఆర్‌ఎస్‌లో ఉండడం ఇష్టం లేదు...**

నోటీసులు ఇవ్వకుండానే తనను వివరణ అడగకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని, బిఆర్‌ఎస్ రాజ్యాంగం కేవలం ఎనిమిది పేజీలే ఉండటం ఒక జోక్ అని కవిత ఎద్దేవా చేశారు. తన సస్పెన్షన్‌ను లీగల్‌గా ఛాలెంజ్ చేయవచ్చని, కానీ నైతికత లేని బిఆర్‌ఎస్‌లో ఉండడం తనకు ఇష్టం లేదన్నారు. ఈడి, సిబిఐ కేసుల్లో తాను మూడేళ్లు ఒంటరిగా పోరాడినప్పటికీ బిఆర్‌ఎస్ తనకు అండగా నిలువలేదని, బిజెపి తనను జైలుకు పంపినప్పుడు బిఆర్‌ఎస్ నేతలు మౌనంగా ఉన్నారని, తనది ఆస్తుల పంచాయితీ కాదని, ఆత్మగౌరవ పంచాయితీ అని లక్ష్మి నరసింహ స్వామి,తన పిల్లల మీద ఒట్టు వేసి చెప్పారు. తనది పూర్తిగా ఆత్మగౌరవ పోరాటమేనని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను బిఆర్‌ఎస్ పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను సభ నుంచి ఒక వ్యక్తిగా వెళ్తున్నానని, భవిష్యత్‌లో శక్తిగా తిరిగి వస్తానని తెలిపారు. తెలంగాణ కోసం కొత్త రాజకీయ వ్యవస్థను నిర్మిస్తానని, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళల పక్షాన ఉండే విధంగా పార్టీని ఏర్పాటుచేస్తామన్నారు.

## అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

సూట్ పిటిషన్‌గా మార్చి దాఖలు చేయాలని సూచించినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే సోమవారం జరగనున్న వాదనలకు స్వయంగా తాను హాజరు అవుతానని, మళ్ళీ స్టే ఆర్డర్ కోరతామని తెలిపారు. ఇదే విషయమై రానున్న రెండు రోజుల్లో న్యాయవాదులతో ప్రత్యేకంగా మరో సమావేశం నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావు చూపిస్తున్న లేఖ సిడబ్ల్యూసి అంతర్గతంగా సమాచారం కోసం పంపిన లేఖ మాత్రమే నని, ఎంత మాత్రం సిడబ్యుసి ఆమోదించినట్లు కాదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర జల హక్కులపై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు బిఆర్ఎస్ పార్టీ పూనుకుందని ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని తొసిపుచ్చారు. పోలవరంనల్లమల ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం జిఆర్‌యంబి, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ లతో పాటు కేంద్ర జల కమిషన్, కేంద్ర పర్యావరణ,అటవీ మంత్రిత్వ శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలకు లేఖలు రాశామని, తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయంతో ఈ సంస్థలన్నీ ఏకీభవించాయని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 4న కేంద్ర జల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖనే ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను నిలువరించడంలో విజయం సాధించమన్నారు. తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదటనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ పడిన విషయాన్ని తెలంగాణా సమాజం గుర్తించుకోవాలన్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్ పాలకులు జల వనరుల నిర్వహణలో ఘోరంగా విఫల మయ్యారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అడుగుపెడతా

(మొదటి పేజీ తరువాయి)

తనలో నింపుకుని, అస్తిత్వం కోసం పోరాడే పార్టీ రావాల్సి ఉందన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలు కూడా జాగృతి లో చేరాలని విజ్ఞప్తి చేశారు. తన పోరాటం ఆత్మగౌరవ పోరాటమేనని కవిత అన్నారు.

## స్టే ఇవ్వండి


(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటాయించిన 480 టిఎంసిలకు మించి వాడుకునేందుకు ఎపి యత్నిస్తోందన్నారు. వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 200 టిఎంసిలు తరలించేందుకు ఎపి ప్రయత్నిస్తున్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టిఎంసిల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఎపి పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఎపి తరపున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డిపిఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు.

# త్వరలోనే హెల్త్ కార్డులు

అసెంబ్లీలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా సుమారు 850 పోస్టులను అతి త్వరలోనే భర్తీ చేయబోతున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్ అదనంగా 490 వెంటిలేటర్లు, 9 ఎంఆర్ఐ యంత్రాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. హెల్త్ కార్డులకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీనాయక్, లక్ష్మారెడ్డి, బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎంఐఎం ఎమ్మెల్యే మీరాజ్ జుల్ఫికర్ అలీ అడిగిన ప్రశ్నకు మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సుమారు 1790 వెంటిలేటర్ బెడ్లు ఉన్నాయని, ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు మెరుగుపడ్డాయని, తద్వారా ప్రభుత్వ హాస్పిటళ్లకు చికిత్స నిమ్మితం వచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగిందని, అందుకే ఐసియు బెడ్లు, వెంటిలేటర్ బెడ్ల అవసరం పెరిగిందని తెలిపారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మరో 490 వెంటిలేటర్లను కొనుగోలు చేస్తున్నామని, గాంధీ, ఉస్మానియా, ఎంజిఎం వంటి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, జిల్లా హాస్పిటల్స్‌లో వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గత ఏడాది కొత్తగా 213 అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని, ఈ ఏడాది మరో 79 కొత్త అంబులెన్సులను ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా ఎమర్జన్సీ రెస్పాన్స్ టైమ్ 10 నిమిషాలకు తగ్గుతుందని ఆయన చెప్పారు. ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని, డయాలసిస్ పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.



### కొత్తగూడెంలో ప్రపంచంలో అరుదైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం

ప్రపంచంలో అరుదైన ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగూడెం ఏర్పాటు చేసిందని మంత్రి దామోదర్ రాజ నర్సింహ తెలిపారు. సోమవారం శాసనసభలో తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026పై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజ నర్సింహ మాట్లాడుతూ ఖనిజ సంపదకు నెలవైన కొత్తగూడెంలో 1978లో స్థాపించిన స్కూల్ ఆఫ్ మైన్స్ (తర్వాతి కాలంలో ఇంజనీరింగ్ కాలేజీ)ని అప్‌గ్రేడ్ చేయగా ప్రభుత్వం తాజా చట్ట సవరణ ద్వారా పూర్తి అటానమీ (స్వయం ప్రతిపత్తి) గల భూ విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అంతకు ముందు జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభా పక్ష నాయకులు అక్బరుద్దీన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతోనే సరిపోదని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కూడ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ఇప్పటీ వరకు మైనింగ్ కోర్సులు చదవాలనుకునే తెలంగాణ విద్యార్థులు ఇప్పటివరకు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేందని ఈ ప్రభుత్వం తీసుకువస్తున్న విశ్వవిద్యాలయం ఆ కొరత తీరిందని తెలిపారు. అదేవిధంగా మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్‌లో సైతం కొమురం బీమ్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయ డం అభినందనీయమన్నారు. విద్యతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని, భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఇందుకు మరింత దోహదపడనుందని ఆది నారాయణ అన్నారు.

# జిఎస్‌టి సాంకేతిక అంశాలను చేర్చేందుకే చట్ట సవరణ

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ చట్టమైన ప్రజలకు ఉపయోగపడే విధంగానే ప్రభుత్వాలు రూపొందిస్తాయని జూపల్లి కృష్ణారావు అన్నారు. జిఎస్‌టి చట్టం మంచిందే అయినా అమలు తీరుతోనే సమస్యలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) నిబంధనలను మరింత సరళతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన 'తెలంగాణ వస్తు, సేవల పన్ను (సవరణ) బిల్లు 2026పై జరిగిన చర్చకు మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానం ఇచ్చారు. గత ఏడాది నవంబరులో జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ నూతన బిల్లును తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. జాతీయ విధానానికి అనుగుణంగా.. జిఎస్‌టీ కౌన్సిల్ 51 నుంచి 55వ సమావేశాల వరకు చేసిన సిఫార్సుల మేరకు దేశవ్యాప్తంగా ఒకే రకమైన పన్ను విధానం ఉండాలనే ఉద్దేశంతో ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన పరిధిలోని ఐజిఎస్‌టి, సిజిఎస్‌టి చట్టాలను సవరించిందని, దానికి అనుగుణంగా రాష్ట్ర జిఎస్‌టి చట్టంలో మార్పులు చేయడం తప్పనిసరి అయిందని పేర్కొన్నారు. దీంతో ఈ బిల్లును సభను ఆమోదించింది.

### జిఎస్‌టి ఓ భూతం : అక్బరుద్దీన్ ఓవైసీ

అంతకు ముందు జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభా పక్ష నాయకులు అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ జిఎస్‌టి అనేది ఓ భూతమని ఈ ఒకే పన్ను విధానం కారణంగా పలు రాష్ట్రాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. ఓ రాష్ట్రం ప్రత్యక్షంగా పరోక్షంగా కేంద్రానికి లక్షల కోట్ల పన్ను రూపంలో చెల్లిస్తే కేంద్రం మాత్రం జనాభా ప్రాతిపదిక వాటాను చెల్లించడం ఇదెక్కటి న్యాయమన్నారు. అందుకే బిల్లును ఎంఐఎం పూర్తిగా వ్యతిరేకమని తాము వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి బయటికి వెళ్లారు.

### బిల్లులను వ్యతిరేకించడం సరికాదు : బిజెపి

ప్రభుత్వాలు చేసే చట్టాలను ప్రతిపక్షాలు వ్యతిరేకించడం ఆనవాయితీ అయిపోయిందని బిల్లుల ఆమోదం రాజకీయ కోణంలో చూడడం సరికాదని బిజెపి సభ్యులు పాయల్ శంకర్ అన్నారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం (జిఎస్‌టి) అమల్లోకి వచ్చిన తర్వాత పెట్టుబడులు పెరిగాయన్నారు. దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల స్ఫూర్తిగా తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలను చేపట్టారన్నారు. ధన్‌పాల్ సూర్యానారాయణ మాట్లాడుతూ జిఎస్‌టి అమల్లో వచ్చిన తర్వాత వ్యాపారులపై ఒత్తిడి లేదన్నారు. పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ జిఎస్‌టి రిజిస్ట్రేషన్లలో అధికారులు పూర్తిగా అవినీతికి పాల్పడుతున్నారని దీనిని కట్టడి చేయాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు మధన్ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువస్తున్నా ఈ బిల్లును పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు.

# మార్చి 1 నుండి మహిళలకు చీరలు

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మార్చి 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మహిళలకు పెద్ద ఎత్తున చీరల పంపిణీ చేపట్టనున్నట్టు రాష్ట్ర గ్రామీణ, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేశామని, ఇంకా మిగిలిన వారితో పాటు పట్టణాల్లో కూడా చీరల పంపిణీ చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ గృహాలు, క్యాంటిన్లు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకే పనులను అప్పగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు నేనావత్ బాలునాయక్, రాజ్‌ఠాకూర్, బీర్ల ఐలయ్య, పాయల శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు, గండ్ర సత్యనారాయణ, శంకరయ్య తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ కేరళ ప్రభుత్వ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా అత్యంత పేదలను మహిళా సంఘాల ద్వారా గుర్తించి, వారికి కావాల్సిన అవసరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం అవసరమైన చేయూతనిస్తుందన్నారు. క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన 'షెఫ్ శిక్షణ, క్యాంటీన్ నిర్వహణ'పై ఒక్కొక్కరికి రూ.22,300ల వ్యయం తో, మహిళా స్వయం సహాయక బృంద సభ్యులకు పది రోజుల పాటు హైదరాబాద్‌లోని జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ (నిథం) ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నామని వివరించారు. అవసరమైన ప్రతిచోటా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

# పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇవ్వడం సరికాదు

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2025–26 సంవత్సరంలో ఒక్క రూపాయి రుణం తీసుకురాలేదని రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వెల్లడించారు. శాసనసభలో ముఖ్యమైన ప్రశ్నోత్తరాలు, నీటి పారుదల రంగంపై చర్చలో ప్రధాన ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పాల్గొనకుండా, బయట పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల నుంచి వెళ్లిపోయి, స్పీకర్‌పైన వ్యాఖ్యాలు చేయడం మంచిది కాదని, ఈ విషయమై బిఆర్‌ఎస్ సభ్యులపైన స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 2025, డిసెంబర్ 31 నాటికి జిహెచ్ఎంసి మొత్తం బాకాయిలు రూ.4717 కోట్లు అని వివరించారు.

# తెలంగాణలో కేరళ తరహా పర్యాటకం

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేరళ రాష్ట్రం తరహా పర్యాటకాన్ని తెలంగాణలో తీర్చిదిద్దుతున్నామని, రానున్న రోజుల్లో పర్యాటకం కొత్త పుంతలు తొక్కనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లక్ష్మి కాంత రావు, ఆది శ్రీనివాస్, భూపతిరెడ్డి, పాయలశంకర్, మీర్ జుల్ఫికర్ అలీ అడిగిన ప్రశ్నలకు మంత్రి జూపల్లి సమాధానమిస్తూ పర్యాటక రంగాన్ని పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేసేందుకు దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్శించేందుకు రాయితీలు ఇస్తున్నామని ప్రకటించారు. భారతదేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం అనుకున్న రీతిలో పర్యాటక రంగం అభివృద్ధి చెందలేకపోయిందని, రాష్ట్రంలో గతంలో పర్యాటక విధానం అంటూ లేకపోడవంతో ఈ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టూరిజం కాన్‌క్లేవ్, గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆ రంగం వాటాను పెంచడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం నిబద్ధతో పని చేస్తుందని స్పష్టం చేశారు.కామారెడ్డి జిల్లాలోని నిజాం సాగర్ వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ సదుపాయం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని,కౌలస్ కోట, నాగన్నమెట్ల బావి అభివద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయం, డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం అభివృద్ధికి పర్యాటక పరంగా ఉన్న అవకాశాలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించి అమలు చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ఏరియా టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఎస్ఆర్ఎస్‌పి రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం, హరిత హోటల్ పునరుద్ధరణ, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ వంటి చారిత్రక, వారసత్వ ప్రదేశాలకు దేశ. విదేశీ పర్యాటకులను ఆకర్శించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..
చలో ఖమ్మం
2026 జనవరి 18
సిపిఐ శతవార్షికోత్సవ సభకు
వేలాదిగా తరలి రండి!

# ఖమ్మం జిల్లాలో బలమైన ఉద్యమానికి పునాదులు




**ప్రజాపక్షం/ఖమ్మం :** పోరాట స్మృతులు మరువలేనివి, మరుపురానివి. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం ఎందరో త్యాగధనుల పోరాట స్ఫూర్తితో బలోపేతమైంది. కమ్యూనిస్టు పార్టీలో చీలిక సంభవించిన నాడు ఖమ్మం జిల్లాలో నామ మాత్రంగా ఉన్న సిపిఐ నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, మహ్మద్ రజబ్‌అలీ, మనుబోతుల కొమరయ్య, వాసిరెడ్డి వెంకటపతి, తూము ప్రకాశరావు, టివి చౌదరి, కర్నాటి కృష్ణయ్య, దొండపాటి వెంకయ్య, తుళ్లూరి పెద్ద సత్యం, మియాజాని, రేగళ్ల చెన్నారెడ్డి, మేకల సంగయ్య లాంటి ఎందరో యోధుల కృషితో ఒక బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఆనాడు సరైన రహదారి సౌకర్యాలు ఉండేవి కావు. ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు సమితికి అప్పట్లో ఒక వాహనం మాత్రమే ఉండేది. ఆ వాహనంలోనే అప్పటి నేతలు నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు, రజబ్‌అలీ మొదలైన వారంతా తిరిగే వారు. బోనకల్ మండలంలోని రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, ఆళ్లపాడు, మోటమర్రి మొదలైన గ్రామాలు సిపిఐకి కంచుకోటలా ఉండేవి. 1980 దశకంలో నల్లమల గిరిప్రసాద్, పువ్వాడ నాగేశ్వరరావు తదితరులు రాయన్నపేట సమావేశానికి వెళ్లారు. రాయన్నపేట, కలకోట గ్రామాల మధ్య ఉన్న వాగులో జీబు కూరుకుపోయింది. ఆ ప్రాంతంలో పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా ఉండేవి. స్వయంగా పువ్వాడ నాగేశ్వరరావుతో పాటు ఇతర నేతలు దిగబడిన జీబును ఒడ్డుకు చేర్చేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. మంచి యవ్వనంలో ఉన్న పువ్వాడ సిపిఐ కార్యకర్తల సాయంతో దిగబడిన జీబును ఒడ్డుకు చేర్చారు. అప్పటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ చర్చనీయాంశంగా మారింది. పువ్వాడ నాగేశ్వరరావు 1982లో శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన తర్వాత తన ఎంఎల్‌సి కోటాలో తొలి ప్రాధాన్యతగా రాయన్నపేటకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు తన నిధుల నుంచి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటలా ఉండడంతో పువ్వాడ నాగేశ్వరరావు ఎంఎల్‌సి అయ్యేంత వరకు వివక్షతతో కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. అప్పటి నేతలు ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు చేసిన కృషికి నిదర్శనమే పైన పేర్కొన్న చిత్రం.

# కమ్యూనిస్టు పార్టీకి గ్రామీణ ప్రజలే బలం




సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ప్రజా హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న పార్టీ ఒక్క సిపిఐ పార్టీ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సోమవారం సిపిఐ ప్రచార జాతలో భాగంగా మండల పరిధిలోని మర్కోడు నుండి అనంతోగు వరకు సిపిఐ కార్యకర్తలు సుమారు 200 బైకులతో భారీ ర్యాలీతో ప్రచార జాతా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఆళ్లపల్లి మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజలతోనే మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమించిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నో పార్టీలు పుట్టాయని అలాగే కాలగర్భంలో కలిసిపోయాయని కానీ ప్రజాదరణతో వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్, అధ్యక్షులు ఎస్‌కే షాహిద్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు గోగ్గల కృష్ణ, మండల సహాయ కార్యదర్శిలు నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, ఎస్‌కే రహీం, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము తదితరులు పాల్గొన్నారు.

## సామినేని రామారావు దారుణ హత్య కేసు

# దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం

రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం జిల్లాలో గత ఏడాది అక్టోబర్ 31న సిపిఐ(ఎం) నేత సామినేని రామారావు దారుణ హత్య కేసులో దర్యాప్తులో ప్రభుత్వ కుట్ర కోణం దాగి ఉందని వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు పేర్కొన్నారు. సామినేని రామారావు దారుణ హత్య కేసులో నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 'సామినేని రామారావు హంతకులను శిక్షించాలని' అంశంపై సిపిఐ(ఎం) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు, ఎంసిపిఐయు నేత రవి, సిపిఐఎంఎల్ నాయకుడు రమేష్‌రాజా, సిపిఐఎంఎల్ న్యూడెమాక్రసీ నేత హన్మేష్ తదితరులు మాట్లాడారు. సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి సుదర్శన్ సమావేశానికి అధ్యక్షతన వవహించారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సామినేనిని పలానావాళ్లు హత్య చేశారని భార్య ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు పట్టించుకోలేదని, ఈ కేసును దర్యాప్తు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, వారిపై రాజకీయ ఒత్తిడిలు ఉన్నాయని కూనంనేని పేర్కొన్నారు. ఈ కేసు విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, అలాగే దర్యాప్తు నిస్పక్షపాతంగా సాగేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు. ఈ కేసులో పోలీసుల పాత్రపై అనుమానాలు కలుగుతున్నాయని, ఇందులో కుట్ర కోణం దాగి ఉందని పేర్కొన్నారు. అనుమానిత నిందితులను వదిలిపెట్టి కుటుంబ సభ్యులకు లై డిటెక్టర్ పరీక్షలు చేస్తామనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముందు నిందితులకు ఈ పరీక్షలు చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులను ఏమి చేసినా వారు ఏమి చేయలేరనే చులకనభావంతో వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చర్యలను వామపక్షాలు సమర్ధవంతంగా తిప్పికొట్టాలన్నారు. సామినేనికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో శత్రువులు లేరని, ఒక వేళ ఉంటే గ్రామస్థాయిలోనే ఆయనకు ప్రత్యర్థులు ఉంటారని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై ఐక్యంగా పోరాడాలని, కమ్యూనిస్టుల ఉద్యమాలు మరింత బలపడాలన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ సామినేని హత్య జరిగి 65 రోజులు గడిచినా ఇంత వరకు ప్రభుత్వం హంతకులను పట్టుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కేసును పక్కదారి పట్టించి స్వపక్షంపైనే నిందలు వేసే విధంగా లీక్‌లు ఇస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో వామపక్ష పార్టీలను నాశనం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయని, ఈ చర్యలను గట్టిగా అడ్డుకోవాలన్నారు.

### రామారావు హత్య ఘటనపై సిట్ ఏర్పాటు చేయాలి :కూనంనేని

మధిర నియోజకవర్గం, బొనకల్లు మండలంలో సిపిఐ(ఎం) నాయకులు సామినేని రామారావు హత్య ఘటనపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో సోమవారం జరిగిన జిరో అవర్‌లో కూనంనేని సాంబశివరావు సామినేని రామారావు హత్య విషయాన్ని ప్రస్తావించారు. గత అక్టోబర్‌లో సామినేని రామారావు హత్యకు గురి కాగా పోలీసులు ప్రయత్నం చేస్తున్నప్పటికీ హత్యకు సంబంధించిన వివరాలు ఇప్పటి వరకు బయటికి రాకపోవడం విచారకరమన్నారు. ఈ ఘటనకు సంబంధించి రామారావు కుటుంబం సభ్యులను లైడిటెక్టర్ టెస్ట్ నిర్వహిస్తామని చెప్పినట్లు వారు తెలిపారన్నారు. ఈ హత్య ఘటన మిస్టరీగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే సిట్ ఏర్పాటు చేసి విచారణ త్వరితగతిన పూర్తి చేసి కేసును చేధించాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.

### భూ విజ్ఞాన విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తగూడెంలో భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్న లక్ష్యం నేరవేరే విధంగా విద్యావిధానం రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. శాసనసభలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2026పై జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు పాల్గొంటూ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పేరుతో విశాలమైన 400 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న భూ విజ్ఞాన విశ్వవిద్యాలంలో అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని నియమించడంతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా అద్భుతమైన విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నందున ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ఖనిజాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ఉండాల్సిన అవసరముందని తెలిపారు. తన నియోజకవర్గంలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఇందుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ మేడ్చల్ సర్కిల్
టెండర్ నోటీస్ నెం. 08/2025-26
అనుభవజ్ఞులైన మరియు జిఎస్‌టి రిజిస్టర్డ్ విక్రేతల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది. 1. TspNo. 70&79/25-26 మరియు Mat.TspNo. 07to19/25-26 - మేడ్చల్ సర్కిల్ కార్యాలయం. 2. TspNo. 60/25-26 - సివిల్ సబ్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 3. TspNo. 89/25-26 - కన్‌స్ట్రక్షన్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 4. TspNo. 54, 58, 67, 68, 69, 71 to 76, 85/25-26 - లైన్స్ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 5. TspNo. 80&81/25-26 - ప్రొటెక్షన్ & టిఆర్ఇ డివిజన్ కార్యాలయం, మేడ్చల్ సర్కిల్. 6. TspNo. 61, 64, 86, 87, 88/25-26 - జీడిమెట్ల డివిజన్ కార్యాలయం. 7. TspNo. 82to84/25-26 - కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయం. 8. TspNo. 59, 62, 63, 65, 66, 77, 78, 90 to 97/25-26 - మేడ్చల్ డివిజన్ కార్యాలయం. మరిన్ని వివరాలకు www.tgsouthernpower.org చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, మేడ్చల్.
DIPR R.O. No. : 13052-PP/CL/ADVT/1/2025-26, Date: 05-01-2026



## తెలంగాణలో జనపనార సాగుకు అడుగులు

ఎంపి చామల చొరవ రంగంలోకి దిగిన జూట్ కార్పొరేషన్ అధికారులు

**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు, టెక్స్టైల్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్లమెంట్లో గళమెత్తడంతో తెలంగాణలో జూట్ (జనపనార) సాగుపై కీలక అడుగులు పడ్డాయి. ఇటీవలే లోక్‌సభలో రాష్ట్రంలో జూట్ సాగు అవకాశాలపై ఆయన ప్రశ్నించిన నేపథ్యంలో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో విచ్చేసి ఎంపీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జూట్ ఉత్పత్తిని ఎందుకు చేపట్టడం లేదనే అంశంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. పర్యావరణానికి ఎంతో మేలు చేసే జూట్ సాగు వల్ల భూసారం పెరగడమే కాకుండా, రైతులకు ఎకరానికి దాదాపు లక్ష రూపాయల వరకు నికర ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని తెచ్చిపెట్టే ఈ 'బంగారు పీచు'ను తెలంగాణ రైతులకు అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన అవగాహన కల్పించాలని ఎంపీ చామల కోరారు. త్వరలోనే జూట్ కార్పొరేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ హితమైన జూట్ సాగుతో తెలంగాణ రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తన లక్ష్యమని ఎంపీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లూయిస్ బ్రెయిలీ జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్రెయిల్ లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం జరుపుకుంటున్నారు. లిపి ఆవిష్కరణ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంధులు మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని కొనియాడారు. అనంతరం అంధులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, డిబిఈఓ భాను నాయక్, డిటిడిఓ శంకర్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే స్వీకరిస్తాం

మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సవరించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు ముసాయిదా జాబితాలో ఉన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రానికి 106 అభ్యంతరాలు వచ్చాయన్నారు. వాటిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు సవరిస్తామని అన్నారు. ఇప్పటికే 20 సమస్యలు పరిష్కరించడం జరిగిందని చెప్పారు. జీవో 367 ప్రకారం వార్డుల సరిహద్దులను పరిగణలోకి తీసుకుంటామని, ఓటర్లను ఆయా వార్డుల్లో సర్దుబాటు చేస్తామని తెలిపారు. అక్టోబర్ 2025 నాటికి ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీ ప్రకారం కొత్త ఓటర్లను చేర్చుకునే అవకాశం లేదన్నారు. 48వార్డుల్లో 144 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 800 మంది ఓటర్లకు ఒక బూత్ ఉండేలా చూస్తామన్నారు. ముఖ్యంగా 39 వార్డులోని ఓట్లు 24 వార్డులో వచ్చాయని దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో మేనేజర్ బ్రహ్మేశ్వర్, టీపీవో అంజయ్య, డిఈఈ వర్మన్ బాలునాయక్, గుడిపాటి కోటయ్య, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతల కొలువుతీరినట్టి గోష్పద దర్శనాన్ని చేయించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామికి మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనము నిర్వహించారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయమే శ్రీ ఆండాళ్ అమ్మవారికి నవ కలశ స్నపన పంచామృతాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## బిసి హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

యాసిడ్ తాగిన విద్యార్థిని పరిస్థితి విషమం



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా కేంద్రంలోని బిసి డి హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్న ఎర్రబోయిన హేమశ్రీ(19) అనే విద్యార్థిని అనారోగ్య కారణాలతో బాత్రూంలు కడిగే యాసిడ్‌ను తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పరిస్థితి విద్యార్థిని విషమంగా ఉండడంతో పట్టణంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన తోటి విద్యార్థినిలు తెలిపిన వివరాలు ఇల ప్రకారం అనుముల మండలం హాజారిగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు,లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమార్తె హిమశ్రీ నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న బిసి హాస్టల్‌లో ఉంటూ ఎన్‌జి కళాశాలలో బిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం తెల్లవారుజామున బాలిక హాస్టల్ ఆవరణలో ఉన్న బాత్రూంలు కడిగే యాసిడ్‌ను సేవించి రూమ్‌లోకి వచ్చి వాంతులు చేసుకుంది. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని వెంటనే వార్డెన్ జ్యోతి దృష్టికి తీసుకెళ్లి చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించాలని సూచించడంతో వార్డెన్ జ్యోతి బాలికను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. విషయం తెలిసిన వెంటనే డిబిసీడబ్ల్యు ఓ సంజీవయ్యతోపాటు పలువురు అధికారులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉందని నాలుగు రోజుల తర్వాత కానీ ఏమి చెప్పలేమని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువు విద్యార్థి సంఘాల నాయకులు, బీసీ సంఘాల నాయకులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

**హేమశ్రీని పరామర్శించిన జిల్లా కలెక్టర్**

అనారోగ్య కారణాలతో యాసిడ్ తాగి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హేమశ్రీ ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సోమవారం ఆస్పత్రికి వెళ్లి హేమశ్రీని పరామర్శించారు.అమ్మాయి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ల ద్వారా అడిగి తెలుసుకోవడమే కాకుండా,విద్యార్థినితో మాట్లాడి ధైర్యంగా ఉండాలని చెప్పారు. విద్యార్థిని తండ్రి వై. వెంకటేశ్వర్లుతో కలెక్టర్ మాట్లాడుతూ సంఘటన జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హేమశ్రీ తండ్రి తన కూతురుకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ పంపించాలని కోరగా,జిల్లా కలెక్టర్ తక్షణమే నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పంపించేందుకు ఏర్పాటు చేశారు జిల్లా కలెక్టర్ వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,జిజిహెచ్ సూపరింటిండెంట్ నేత నరసింహారావు ఉన్నారు.

## గ్రామాల నుండి జన సమీకరణ చేయండి





ఖమ్మంలో జరిగే శతజయంతి బహిరంగ సభ జయప్రదం చేయాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శతజయంతి బహిరంగ సభను జయప్రదం చేయాలని సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సూర్యాపేట పట్టణ కౌన్సిల్, చివ్వెంల మండల కౌన్సిల్ సమావేశం చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల నుండి జన సమీకరణ చేయాలన్నారు. శతజయంతి బహిరంగ సభను జయప్రదం చేయడానికి పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద కమ్యూనిస్టు అమరవీరుల చిత్రపటాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కళాజాతాలతో ప్రచారం చేయాలని, ఆటోలతో మైకుల ద్వారా పట్టణంలో, గ్రామాలలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. శతజయంతి బహిరంగ మహాసభకు సహకరించవల్సినదిగా సూర్యాపేట పట్టణంలోని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో పెద్దఎత్తున ప్రచారం చేయాలని తీర్మానం చేశారు. పార్టీ సభ్యత్వ సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని, వామపక్ష భావజాలం గల యువతను పార్టీలో చేర్పించాలని అన్నారు. పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఆరు గ్రామ పంచాయితీలలో సర్పంచులుగా విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో రాబోయే మున్సిపాలిటి ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, గుగులోతు రాజారాం, రేగట్టి లింగయ్య, పెంద్ర కృష్ణ, ఏడెల్లి శ్రీకాంత్, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**మల్లేపల్లి మండల కేంద్రం నుండి భారీగా తరలాలి**






**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. మల్లేపల్లి మండల కేంద్రం నుండి సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పెరికేటి శేఖరాచారి, కౌన్సిల్ సభ్యులు శ్రీను, సోమ్లానాయక్, చరణ్‌రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

**సిపిఐ వంద సంవత్సరాల ముగింపు వేడుకలను విజయవంతం చేయండి**

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు ముగింపు వేడుకల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోదాడ మండల కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, సహాయ కార్యదర్శి పోతురాజు రాజేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం కోదాడ మున్సిపల్ పరిధిలోని తమ్మర గ్రామంలోని బత్తినేని శ్రీనివాసరావు నివాస గృహంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి మాతంగి ప్రసాద్, అల్వాల్ పురం గ్రామ కార్యదర్శి గౌసు నగేష్, గొట్టేముక్కల కోటి నారాయణ, బత్తినేని శ్రీనివాసరావు, రాయపూడి కాంటరాజు, కమతం కుటుంబరావు, కొండా కోటేశ్వరరావు పాల్గొన్నారు.





## తురక కాశ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్సీ సత్యం

కృతజ్ఞతగా సత్యం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన తురక కాశ కార్మికులు

**ప్రజాపక్షం/నల్లగొండ(తిప్పర్తి) :** ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశలలో తురక కాశ కార్మికుల సమస్యలు,వారి దయనీయ స్థితిగతులపై ప్రస్తావించి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించిన ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంకు కృతజ్ఞతగా తెలంగాణ తుర్కకాశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిప్పర్తి మండలం కాశివారి గూడెం గ్రామంలో ఎంఎల్‌సి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న తురక కాశ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏనాడు కూడా పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుట్టలలో రాళ్లు కొట్టి జీవనోపాధి పొందుతున్నం. సమాజ అభివృద్ధిలో, విద్య, వైద్యం,ఉపాధి రంగాలలో ఇంకా వెనుకబడి ఆధునిక యుగంలో కూడా ఈ వర్గం ప్రజలు విద్య,ఆరోగ్యంపై సరైన అవగాహన లేక బాధ్యతలతో కూడిన జీవితాలు గడుపుతున్న తమ సమస్యలను ఆర్థం చేసుకోని ఒక కమ్యూనిస్టు నాయకుడు తెలంగాణ శాసనమండలి నిండు సభలో ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం సంతోషకరం అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు,షేక్ లతీఫ్ పాష,షేక్ అలీ,గ్రామ సర్పంచ్ షేక్ కమల్,ఉప సర్పంచ్ షేక్ అలీ,వార్డు సభ్యులు షేక్ అల్లావలి,షేక్ నూర్ మొహమ్మద్ షేక్ కలీం,గ్రామ శాఖ అధ్యక్షులు షేక్ మౌలానా, గౌరవ అధ్యక్షులు షేక్ సయ్యద్,మండల అధ్యక్షులు షేక్ మహిమూద్,గ్రామ పెద్దలు షేక్ చాంద్ పాషా,షేక్ సుభాని,షేక్ అజిత్,షేక్ ఖాసీం,షేక్ అబ్దుల్ షేక్ షబ్బీర్,షేక్ కమల్ కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల పనులు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం రాజాపేట మండలం బసంతపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చినవారు మొత్తం ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యాయి ? ఎన్ని ఇండ్లు చివరి దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల పనులు మొత్తం కూడా వేగంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి ఇటుక, ఇసుక తక్కువ ధరకు ఇప్పించేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయినంతవరకు డబ్బులు జమ అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు తరచు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించి, లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేల చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం కోర్టు భవనంలో జిల్లా జడ్జి లక్ష్మి శారదను జిల్లా ఎస్‌పి కె నరసింహ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేసుల దర్యాప్తు, కోర్టు క్యాలెండర్, నేరస్తులకు శిక్షణ అమలు, లోక్ అదాలత్ నిర్వహణ గురించి చర్చించారు.

## పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం





**ప్రజాపక్షం/నల్లగింద టౌన్:** మండల విద్యాశాఖ అధికారులు నెలలో వారి పరిధిలోని పాఠశాలలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశించారు.ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు,ఎంఈఓలు సెలవుపై వెళ్లకూడదని, జిల్లాలో టాయిలెట్ లేని పాఠశాల ఉండరాదని , విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో భాగంగా హెడ్మాస్టర్లతో తరచూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న పీఎం శ్రీ పాఠశాలలు,టాయిలెట్స్,తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద పాఠశాల విద్యార్థులకు మంజూరు చేసిన నిధులన్ని సద్వినియోగమయ్యాలా చూడాలని, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్,బాలికల ఆరోగ్యం, శానిటేషన్,సైన్స్, మ్యాథ్స్,సర్కిల్స్ నిర్వహణ,ఎక్స్పోజర్ విజిట్లు, స్పోర్ట్స్ మెటీరియల్,స్కౌట్స్ అండ్ గైడ్స్,స్వెల్ఫ్ డిఫెన్స్,మాక్ పార్లమెంట్ నిర్వహణ,సేఫ్టీ క్లబ్బుల ఏర్పాటు,టీచర్ పేరెంట్స్ మీటింగ్‌లు విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. 17,18 పూర్తి చేయాలన్నారు.

**ఫిర్యాదులన్నీ వారంలోగా పరిష్కరించాలి :జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**

**ప్రజాపక్షం/నల్లగొండ :** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులన్నీ వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కరించిన ఫిర్యాదులకు ఆన్‌లైన్‌లో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ,ఒకవేళ ఏదైనా ఫిర్యాదు పరిష్కారం కానట్లయితే పరిశీలించి క్షేత్రస్థాయి నుండి రిపోర్టు తెప్పించి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, చండూరు ఆర్డిఓ శ్రీదేవి, జిల్లా అధికారులు, ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

## పనుల్లో అక్రమాలు, మస్టర్‌లో కూలీల సంతకాలు లేకుండానే బిల్లులు

తూతూ మంత్రంగా సోషల్ ఆడిట్

చర్యలు శూన్యం





**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం రైతు వేదికలో జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఎన్ఆర్ఈజీఎస్ అడిషనల్ పీడీజి సురేష్ హాజరయ్యారు. గ్రామస్థాయిలో ప్రజలే ప్రత్యక్షంగా పనుల వివరాలను పరిశీలించి ఇటీవల మండలంలోని గ్రామ పంచాయతీలలో జరిగిన పనులపై సామాజిక తనికి నిర్వహించారు. చేపట్టిన అభివృద్ధి పనులు ఖర్చయిన నిధులు పని దినాల నమోదు కూలీల హాజరు వేతనాల చెల్లింపు వంటి అంశాలను గ్రామసభల ముందు ఉంచి సమగ్రంగా పరిశీలించారు. ప్రజలు స్వయంగా పనుల స్థలాలను సందర్శించి నాణ్యతను పరిశీలించడం తోపాటు రికార్డులతో పోల్చి చూశారు. కానీ మండలంలోని 31 గ్రామపంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై స్థానిక ఎంపీడీవో, ఏపీవో రోల్ కాల్ చేసిన పాపాన పోలేదు. పనులు జరుగుతున్నట్టు కాగితాలపై చూపిస్తూ వాస్తవానికి పనికిరాని కూలీల పేర్లను మాస్టర్లో అక్రమంగా నమోదు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిచేయకున్న హాజరు నమోదు చేసి డబ్బులు ఫీల్డ్ అసిస్టెంట్స్ సగం, పనిచేయని పేరు నమోదైన లబ్ధిదారులు సగం పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఒకే వ్యక్తి పేరు పలు రోజులు హాజరుగా చూపడం మరికొన్నిచోట్ల గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లను చేర్చడం వంటి అవకతవకలు చోటుచేసుకున్నాయని బయటపడ్డాయి. సామాజిక తనిఖీ సందర్భంగా మాస్టర్ రోల్స్‌ను పరిశీలించిన ఆడిట్ బృందం సంతకాలు లేకుండా హాజర్ వేసిన విషయాన్ని గుర్తించింది. కొంతమందికి తా ము పని చేయని రోజులకు కూడా హాజరు చూపి పనిచేసినట్లుగా నమోదు చేశారని అయినప్పటికీ వేతనం కూడా అందలేదని తెలిపారు. కొన్ని గ్రా మాలలో ఆదివారాల్లో సైతం పనిచేసినట్లుగా నమోదు చేసిన విషయం ఆశ్చర్యానికి గురిచేసిం ది. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను, ఏపీవో ఎన్ఆర్ఈజీఎస్, సిబ్బందిపై తక్షణమే అక్రమాలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు మాజీ ఎంపీటీసీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్‌లు మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన ఉపాధి హామీ సిబ్బందిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వెనుజులాపై అమెరికా దాడి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

ధూళిపాళ ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెనుజులా దేశంపై అమెరికా సామ్రాజ్యవాదం చేపడుతున్న రాజకీయ, ఆర్థిక, సైనిక దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైనవని, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశం తన వనరులు, తన రాజకీయ విధానాలను స్వయంగా నిర్ణయించుకునే హక్కును కాలరాస్తూ అమెరికా సాగిస్తున్న ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చమురు, ఖనిజ వనరులపై కన్నేసి, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అనే ముసుగులో అమెరికా వెనుజులాపై ఆర్థిక ఆంక్షలు, రాజకీయ జోక్యాలు, కుట్రలు చేస్తుందని, దీంతో వెనుజులా ప్రజలు ఆహారం, మందులు, విద్య, ఉపాది వంటి మౌలిక అవసరాలకు కూడా దూరమవుతున్నారని, ఇది నేరుగా ప్రజలపై సాగుతున్న ఆర్థిక యుద్ధమేనని, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే లక్ష్యంతో బాహ్య శక్తులు చేసే ఈ జోక్యాలు ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా మారుతునానయని, వెనుజులా సమస్యను వెనుజులా ప్రజలే పరిష్కరించుకోవాలని, అక్కడి అంతర్గత వ్యవహారాల్లో అమెరికాకు ఎలాంటి హక్కు లేదని ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు, ప్రజాస్వామ్యవాదులు, శాంతి ప్రేమికులు ఈ దాడులను ఖండించాలని ఆయన అన్నారు.

## 'సర్'పై కోర్టుకు వెళ్తా

### అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా...

### అనుమతిస్తే సాధారణ వ్యక్తిగా వాదిస్తా

### మమతా బెనర్జీ



**సాగర్ఐలాండ్:** రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌పై కోర్టుకు వెళ్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. ఈ ప్రక్రియ భయం, వేధింపులు, పరిపాలనా ఏకపక్షతను రేకెత్తించిందని, దీ నివల్ల మరణాలు, ఆసుపత్రిలో చేరాల్సి వ చ్చిందని ఆమె ఆరోపించారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ఐలాండ్ లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, సరైన కారణాలు లేకుండా ఓటర్ల జా బితాల నుండి పేర్లు ఏకపక్షంగా తొలగించబడుతున్నాయని, అసెంబ్లీ ఎన్నికల కు ముందు సాధారణ పరిపాలనా ప్రక్రియను భయానికి మూలంగా మారుస్తున్నారని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ కారణంగా అమానవీయంగా వ్యవహరి ంచడం, చాలా మంది మరణించడంపై తాము రేపు కోర్టుకు వెళ్తున్నామని చెప్పారు. అనుమతిస్తే, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తానని, ఈ అమానవీయ ప్రక్రియకు వ్యతిరేకంగా ఒక సాధారణ వ్యక్తిగా వాదిస్తానని, తాను కూడా శిక్షణ పొందిన న్యాయవాదిని అని ఆమె అన్నారు. అయితే, బెనర్జీ ఈ పిటిషన్‌ను తా ను వ్యక్తిగతంగా, రాష్ట్ర ప్రభుత్వం లేదా తృణమూల్ కాంగ్రెస్ దాఖలు చేస్తుందో లేదో స్పష్టం చేయలేదు. ప్రాణాంతక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు చట్టబద్ధమైన ఓటర్లుగా నిరూపించుకోవడానికి పొడవైన క్యూలలో నిలబడవలసి వస్తోందని ము ఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఎవరైనా తమ వృద్ధ తల్లిదండ్రులను తమ గుర్తింపును నిరూపించుకోవడానికి వరుసలో నిలబెట్టినట్లయితే బిజెపి నాయకులు ఎలా భావిస్తారు? అని ఆమె ప్రశ్నించారు. 'సర్' ప్రారంభమైనప్పటి నుండి, చాలా మంది భయం కారణంగా మరణించారు. అనేక మంది ఆసుపత్రిలో ఉన్నారు అని ఆమె పేర్కొన్నారు. బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై బిజెపి పాలిస్తున్న రాష్ట్రాలలో వివక్ష చూపుతున్నారని బెనర్జీ ఆరోపించారు. ఆతను వారిని చంపడానికి ధైర్యం చేస్తున్నానని, కానీ మాతృభాషలో మాట్లాడటం ఆపను అని ఆమె అన్నారు. దేశంలో బెంగాలీ మాట్లాడటం నేరంగా మారిందా అని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ముడుపులు ఇచ్చి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత అణచివేతకు పాల్పడుతుందని ముఖ్యమంత్రి ఆరోపించారు. వారు ఎన్నికలకు ముందురూ. 10,000 ఇస్తారు, అది ముగిసిన తర్వాత బుల్డోజర్‌ను ఉపయోగిస్తారు అని ఆమె అన్నారు. '

## ఢిల్లీ అల్లర్ల కేసులో ఖాలిద్, ఇమామ్‌లకు

# 'సుప్రీం' బెయిలు నిరాకరణ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో ఇద్దరు కీలక నిందితులకు సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించింది. ఈ కేసులో ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లు 2020 ఫిబ్రవరిలో హింసాత్మక అల్లరకు కుట్ర చేశారని బలమైన ఆధారాలు ఉన్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం విశ్వసించడంతో వారికి బెయిలు తిరస్కరించింది. మరో ఐదుగురికి మాత్రం బెయిలు లభించింది. ఖాలిద్, ఇమామ్ ఇద్దరూ ఈ అల్లర్లు రేకెత్తించేందుకు ప్రణాళిక చేశారని,వ్యూహాత్మక మార్గదర్శనం చేసినట్లు బలమైన సాక్ష్యాలున్నాయని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం స్పష్టం చేసింది. ప్రాసిక్యూషన్ చేసిన ప్రాథమిక ఆరోపణలు, సమర్పించిన సాక్ష్యాధారాలపట్ల న్యాయస్థానం సంతృప్తి చెందిందని పేర్కొంది. ఈ దశలో ప్రధాన నిందితులు ఇద్దరూ తమను తాము సమర్థించుకోలేరని పేర్కొంది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నిందితులు బెయిలుకోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం కిందికోర్టు తీర్పును సమర్థించింది. బెయిలు ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం కిందికోర్టుకు ఆదేశాలు ఇచ్చింది. బెయిలు ప్రక్రియకోసం ధర్మాసనం 12 షరతులు విధించింది. బెయిలును గనుక దుర్వినియోగం చేస్తే వెంటనే బెయిలును రద్దుచేస్తామని కూడా ఐదుగురు నిందితులకు హెచ్చరించింది. డిసెంబరు పదో తేదీన సుప్రీంకోర్టు వాదనలు వినడం పూర్తిచేసి తీర్పును రిజర్వుచేసి సోమవారం ప్రకటించింది.

ఈ కేసులో కార్యకర్తలు గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్, షిఫా ఉర్ రెహ్మాన్, మహ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌లకు బెయిలు లభించింది. వివిధ జైళ్ళలో ఉన్న వీరిని ఎప్పుడు విడుదల చేస్తారన్న విషయంలో స్పష్టత లేదు. రక్షణలో ఉన్న సాక్ష్యులను విచారణ చేసిన తర్వాత గానీ లేదా ఈరోజు నుండి సంవత్సరం తర్వాత గానీ ఖాలిద్, షర్జీల్ ఇద్దరూ తిరిగి బెయిలు కోరుతూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లభిస్తుందని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పుకోసం నిందితులతో పాటు ఈ అల్లర్లలో బలైపోయిన బాధితుల కుటుంబ సభ్యులు కూడా కోర్టు వెలుపల ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారు. "ఇప్పుడు జైలే నా జీవితం, కానీ మిగిలినవాళ్ళకు బెయిలు వచ్చినందుకు నేను నిజంగా ఎంతో సంతోషిస్తున్నా, చాలా ఉపశమనం కలిగింది" అని కోర్టు తీర్పు తర్వాత నిందితుడు ఖాలిద్ అన్నారని ఆయన జీవిత భాగస్వామి బనోజ్యోత్స్న లాహిరి చెప్పారు. భిన్నాభిప్రాయాలతో ఉన్న ప్రజలు, భిన్న రాజకీయ అభిప్రాయాలమధ్య ఈ తీర్పు వచ్చిందన్నారు.



**కొందరి విషయంలో బెయిలు వర్తించడం లేదు**

బెయిలు అనేది ఒక నిబంధన అనీ, జైలు అనేది ఒక మినహాయింపు అనీ ఐతే కొందరి విషయంలో ఈ సూత్రం వర్తించడంలేదని సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. అత్యాచారాలకు పాల్పడి, హత్యలు చేసిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు ఇప్పటివరకూ 15 సార్లు తాత్కాలికంగా జైలు నుండి విడుదలయ్యాడని గుర్తుచేశారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ మనోజ్ ఝా మాట్లాడుతూ, బెయిలు నిరాకరణ అనేక సంక్లిష్టమైన ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. రాజ్యాంగ రక్షణలు పొందాలంటే ఎంత కాలం ఖైదీగా ఉండాలనేది ప్రశ్నగా ఉందన్నారు. పిడిపి అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, దీనిని వివక్షతో కూడిన విచారణగా పేర్కొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ),జాతీయ పౌరస్మృతి (ఎన్ఆర్‌సి)లకు వ్యతిరేకంగా ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన అల్లర్లలో మొత్తం 53 మంది హత్యకు గురయ్యారు. 700 మంది గాయపడ్డారు. ఈ కేసులో ఖాలిద్ 2020 సెప్టెంబరు 13వ తేదీన అరెస్టయ్యాడు. అంతకుముందు ఫిబ్రవరి 24,25 తేదీలలో ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకుగాను అతడిని అరెస్టు చేశారు. అదేసమయంలో డోనాల్డ్ ట్రంప్ భారత్‌లో మొదటిసారి పర్యటనకు వచ్చారు. ఇమామ్ కూడా 2020 జనవరి 28న రెచ్చగొట్టే ప్రసంగాలు చేశాడు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిన తర్వాత జరిగిన మరో పెద్ద కుట్ర కేసులో ఇమామ్‌ను 2020 ఆగస్టులో అరెస్టు చేశారు. అతడి మామయ్య అర్షద్ ఇమామ్ బీహార్ లోని జహనాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, బెయిలు నిరాకరించడంపట్ల తాను ఎంతో దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఈసారైనా కోర్టు బెయిలు మంజూరు చేస్తుందని తానెంతో ఆశపడ్డానన్నారు. వాదనలు జరిగిన ప్రతిసారి షర్జీత్ ఇమామ్ నిర్దోషి అని రుజువు అవుతూనే ఉందని, కానీ కోర్టు బెయిలు నిరాకరిస్తోందన్నారు. కాగా బిజెపి నాయకులు స్పందిస్తూ, ఖాలిద్, షర్జీల్ ఇద్దరూ విచ్ఛిన్నకరశక్తులకు భారతదేశంలో ప్రతినిధులని విమర్శించారు. ఈ శక్తులను సమర్థించిన కాంగ్రెస్‌పార్టీ క్షమాపణ చెప్పాలని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షాజెడ్ పూనావాలా ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కోర్టు తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా స్వాగతించారు.

## ఇది తీర్పు లేకుండా శిక్ష విధించడమే! డి.రాజా విస్మయం

**న్యూఢిల్లీ:** 2020 నాటి దిల్లీ అల్లర్ల కుట్ర కేసులో ఆరోపణలులెదుర్కొంటున్న జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్, మరో విద్యార్థి నేత షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించడంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విస్మయం వ్యక్తం చేశారు. 'విచారణ లేకుండా ఐదు సంవత్సరాలకు పైగా జైలులో ఉండటం న్యాయం కాదు. ఇది తీర్పు లేకుండా శిక్ష విధించడమే. ఉమర్ ఖాలిద్, షార్జీల్ ఇమామ్‌లకు బెయిల్ నిరాకరించడం మన నేర విచారణ న్యాయవ్యవస్థలో కలతపెట్టే ద్వంద్వ ప్రమాణాలను బహిర్గతం చేస్తుంది' అన్నారు. ఓ పక్క అత్యాచారం, హత్య, సామూహిక హింస కేసుల్లో దోషులుగా తేలినవారు క్రమం తప్పకుండా బెయిల్ లేదా పెరోల్ పొందుతుండగా... పరిశోధించబడని ఆరోపణల ఆధారంగా నిందితులుగా ఉండి...విచారణలో ఉన్నవారిని నిరవధికంగా జైలులో ఉంచడంపై ఆశ్చర్యం వెలిబుచ్చారు. "అత్యాచారం, హత్య మరియు సామూహిక హింస కేసుల్లో దోషులుగా తేలినవారు క్రమం తప్పకుండా బెయిల్ లేదా పెరోల్ పొందుతారు, అయితే పరీక్షించబడని ఆరోపణల ఆధారంగా నిందితులుగా ఉన్న విచారణలో ఉన్నవారిని నిరవధికంగా జైలులో ఉంచుతారు. ఉపా వంటి చట్టాల ప్రకారం జైలు ఒక ప్రమాణంగా మారగా... స్వేచ్ఛ మినహాయింపుగా మారిందన్నారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అదే క్రూర నిబంధనల కింద సంవత్సరాల తరబడి జైలులో ఉంచబడ్డారని రాజా గుర్తు చేశారు. ఏ నేరం చేయకుండానే ఆయన తన అర్థవంతమైన జీవితాన్ని కోల్పోయాక నిర్దోషిగా విడుదలైనట్లు తెలిపారు. ఖాలిద్, షర్జీల్ పరిస్థితి కూడా ఇదేనన్నారు. అయితే ఇది న్యాయం అందించడంలో ఉద్దేశం, జవాబుదారీతనం, న్యాయవ్యవస్థ విశ్వసనీయత గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందన్నారు. "న్యాయస్థానాలు అంతులేని జైలు శిక్షను సమర్థించడానికి బెయిల్ నియమం , జైలు మినహాయింపు అనే రాజ్యాంగ సూత్రాన్ని వదిలివేయడానికి ప్రాథమిక ఆరోపణలపై ఆధారపడినప్పుడు, వ్యక్తిగత స్వేచ్ఛ దూరమవుతుంది. అసమ్మతిని నేరంగా పరిగణిస్తారు. కానీ నిజమైన నేరాలకు పాల్పడేవారు స్వేచ్ఛగా తిరుగుతారు" అని రాజా అన్నారు.

## బలవంతపు కౌగిలింతలు భారత్‌కు

# చాలా తక్కువ మేలు చేశాయ్

### ట్రంప్‌ను ప్రధాని మోదీ పొగడ్తలపై కాంగ్రెస్ ఎద్దేవా

### న్యూఢిల్లీపై వాషింగ్టన్ శీఘ్రగతిన సుంకాలను పెంచవచ్చని అమెరిక అధ్యక్షుడి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీపై వాషింగ్టన్ శీఘ్రగతిన సుంకాలను పెచ్చవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శగుప్పించింది. 'నమస్తే ట్రంప్, హౌడీ మోదీ ఈవెంట్స్, బలవంతపు కౌగిలింతలు', అమెరికన్ నాయకుడిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌లు చాలా తక్కువ మేలు చేశాయని ఎద్దేవా చేసింది. భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లతో సంతోషంగా లేదని ప్రధాని నరేంద్ర మోదీకి తెలుసని, వాషింగ్టన్ న్యూఢిల్లీపై సుంకాలను చాలా త్వరగా' పెంచవచ్చని ట్రంప్ చెప్పిన తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'వైట్ హౌస్‌లో ప్రధానమంత్రి మంచి స్నేహితుడు భారతదేశం పట్ల తన 'హాట్, బ్లో కోల్డ్ విధానాన్ని కొనసాగిస్తున్నాడు. భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలును ఆపకపోతే భారతదేశం నుండి అమెరికా దిగుమతులపై సుంకాలను పెంచుతామని ఆయన మరోసారి బెదిరించారు. 'ఆ నమస్తే ట్రంప్, హౌడీ మోదీ ఈవెంట్స్, ఆ (బలవంతపు) కౌగిలింతలు, అమెరికా అధ్యక్షుడిని ప్రశంసిస్తూ సోషల్ మీడియా పోస్ట్‌లు అన్నీ చాలా తక్కువ మేలు చేశాయి' అని అన్నారు. ట్రంప్ ఆదివారం ఫ్లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళుతూ ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రాథమికంగా భారతదేశం తనను సంతోషపెట్టాలని కోరుకున్నదని, మోదీ చాలా మంచి వ్యక్తి అని అన్నారు. తాను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు అని, తనను సంతోషపెట్టడం ముఖ్యమని చెప్పారు. భారత్ వాణిజ్యం చేస్తుందని, ఆ దేశంలో చాలా త్వరగా సుంకాలను పెంచవచ్చు అని, ఇది ఆ దేశానికి చాలా చెడ్డది చర్య అని వ్యాఖ్యానించారు. ట్రంప్ భారతదేశంపై విధించిన సుంకాల వల్లే న్యూఢిల్లీ ఇప్పుడు గణనీయంగా తక్కువ రష్యన్ చమురు కొనుగోలు చేస్తోందని ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఆయనతో పాటు ఉన్న యుస్ సెనేటర్ లిండ్సే గ్రాహం చెప్పిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల నుండి దిగుమతులపై 500 శాతం సుంకాలు విధించే తన సుంకం బిల్లు గురించి గ్రాహం మాట్లాడారు. రష్యా–ఉక్రెయిన్ ఘర్షణను ముగించడానికి, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కష్టమర్లపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం అన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ట్రంప్ అన్నారు। ఆ తర్వాత భారతదేశం గురించి ప్రస్తావించారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు భారతదేశంపై అమెరికా 25 శాతం సుంకం విధించిందని గ్రాహం అన్నారు.

## ఉమర్, షార్జీల్‌కు బెయిల్‌ను ఎందుకు నిరాకరించారు?

### ప్రశ్నలు లేవనెత్తిన ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అల్లర్ల (2020) కుట్ర కేసులో సామాజిక కార్యకర్తలు ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకో ర్టు బెయిల్ నిరాకరించడంపై ప్రతిపక్ష నాయకులు సోమవారం ప్రశ్నలు లేవనెత్తారు. అత్యాచార దోషి దేరా సచ్చా సౌ దా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌కు పదేప దే పెరోల్ మంజూరు చేస్తున్నారని మం డిపడ్డారు. 'బెయిల్ అనేది నియమం, జై లు మినహాయింపు' అనే సూత్రం కొంతమంది వ్యక్తుల విషయానికి వస్తే స్పష్టంగా వర్తించదు అని కమ్యూనిస్టు పా ర్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ఎంపి జా న్ బ్రిట్టాస్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉమర్ ఖలీద్‌కు బెయిల్ లేదని, క్రూరమైన 'ఉ పా' కింద 5 సంవత్సరాలకు పైగా నిర్బ ంధించారని, విచారణ ఇంకా ప్రారంభం కాలేదన్నారు. విచారణకు ము ందు జైలుకు వెళ్లడం శిక్ష కాదని బ్రి ట్టాస్ అన్నారు. అయితే దోషిగా తేలిన రేపిస్ట్, హంతకుడు గుర్మీత్ రామ్ ర హీమ్ సింగ్ (2017లో శిక్ష పడింది)కి మ రో 40 రోజుల పెరోల్ మంజూరు చే శారు. దోషిగా తేలినప్పటి నుండి అ తను తాత్కాలికంగా జైలు నుంచి విడుదల కావడం ఇది 15వ సారి. 'ఒకరు వి చారణ లేకుండా నిరవధికంగా మగ్గుతున్నారు. మరొకరు డిమాండ్ మేరకు పదేపదే 'జైలు సెలవులు' అనుభవిస్తున్నా రు' అని ఆయన అన్నారు. తన ఇద్దరు శిష్యులపై అత్యాచారం చేసినందుకు 2 0 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న దేరా స చ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సి ంగ్ సోమవారం రోహ్‌తక్‌లోని సునారి యా జైలు నుండి 40 రోజుల పెరోల్ మంజూరు అయిన తర్వాత బయటకు వచ్చారు. 2017లో ఈ కేసులో దోషిగా తేలినప్పటి నుండి అతనికి మంజూరు కావడం ఇది 15వ సారి. సిపిఐ(ఎం) కూడా ఎక్స్‌లో పోస్టు చ చేస్తూ బెయిల్ నిరాకరణను కొనసాగించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పే ర్కొంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం (యుఎపిఎ)ను అసమ్మతిని అణిచివేయడానికి ఉపయోగిస్తున్నారని ఆరోపించింది. 'విచారణ లేదా దోషిగా నిర్ధారణ లేకుండా క్రూరమైన యుఎపిఎ కింద ఐదు సంవత్సరాలకు పైగా జైలులో గడిపిన ఉమర్ ఖలీద్, ష ర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పార్టీ పేర్కొంది. 'విచారణకు ముందు సుదీర్ఘమైన జైలు శిక్ష బెయిల్ అనేది జైలు కాదు, అనే ప్రాథమిక సూత్రాన్ని ఉల్లంఘిస్తుంది. రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛా హక్కును. వేగవంతమైన విచారణను దెబ్బతీస్తుంది. భిన్నాభిప్రాయాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉ పాను నిరంతరం ఉపయోగించడం అ ణచివేత, ఎంపిక చేసిన న్యాయం కలతపె ట్టే నమూనాను ప్రతిబింబిస్తుంది. అన్ని రాజకీయ ఖైదీల విడుదల కోసం మా డిమాండ్‌ను మేము పునరుద్ఘాటిస్తున్నాము' అని అది పేర్కొంది. బెయిల్ తి రస్కరణ ఇబ్బందికరమైన ప్రశ్నలను లే వనెత్తుతుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఎంపి మనోజ్ ఝా అన్నారు. 'ఖై దు కాలం చాలా ఎక్కువ, అన్యాయం లే దా అసమానంగా మారినప్పుడు రాజ్యా ంగ న్యాయస్థానాలకు బెయిల్ మం జూరు చేసే అధికారం, విధి ఉందనేది నిజమే. అయినప్పటికీ, ఉమర్ ఖలీద్, షార్జీల్ విషయంలో, జైలులో ఇప్పటికే గడిపిన సమయం ఇంకా సరిపోలేదని, విచారణలో ఆలస్యం ఇంకా దిగ్భ్రాంతికరమైనది లేదా రాజ్యాంగ విరుద్ధం కా దని ప్రబలంగా ఉన్న న్యాయవ్యవస్థ అ భిప్రాయం అనిపిస్తుంది' ఆయన అ న్నారు. రాజ్యాంగ రక్షణలు సక్రియం చేయబడి సాధించబడటానికి ముందు ఎంత జైలు శిక్షను భరించాలి అనే దా నిపై ఇది ఇబ్బందికరమైన ప్రశ్నలను లే వనెత్తుతుందన్నారు.

## భారత అజేయస్ఫూర్తికి ప్రతీక 'సోమనాథ్'

### 11న జరిగే సోమనాథ్ స్వాభిమాన్ పర్వంలో పాల్గొనున్న ప్రధాని



**న్యూఢిల్లీ :** విదేశీ దురాక్రమణదారులు పదేపదే ధ్వంసం చేసిన గుజరాత్‌లోని ఆలయాన్ని పునర్నిర్మించారు. ఈ నేపథ్యంలో భారత నాగరికత అచంచలమైన స్ఫూర్తిని వేడుకగా జరుపుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 11న సోమనాథ్ స్వాభిమాన్ పర్వంలో పాల్గొనున్నారు. గుజరాత్ సౌరాష్ట్ర ప్రాంతంలోని వెరావల్‌లో అరేబియా సముద్ర తీరంలో శివునికి అంకితం చేయబడిన సోమనాథ్ ఆలయంలో ఏడాది పొడవునా ఈ వేడుకలను నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 8 నుండి 11 వరకు సోమనాథ్‌లో అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. సోమనాథ్ ఆలయంపై జరిగిన మొదటి దాడికి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒక బ్లాగ్ పోస్ట్‌లో, ప్రధానమంత్రి ఈ ఆలయాన్ని భారత నాగరికత అజేయ స్ఫూర్తికి ప్రతీకగా అభివర్ణించారు. అన్ని ఆటంకాలను, కష్టాలను అధిగమించి, వైభవంగా నిలబడిన సోమనాథ్ కంటే మన నాగరికత అజేయ స్ఫూర్తికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ మరొకటి ఉండదన్నారు. 1951లో ఆలయ ప్రారంభోత్సవం అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు ఉత్సాహాన్ని కలిగించలేదని పేర్కొంటూ, మోదీ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. సోమనాథ్ ఆలయంపై మొదటి దాడి జరిగి 2026 నాటికి 1,000 సంవత్సరాలు పూర్తవుతుందని, ఆ తర్వాత పదేపదే దాడులు జరిగినప్పటికీ ఆలయం సగర్వంగా నిలబడి ఉందని ప్రధానమంత్రి అన్నారు. 'ఎందుకంటే, సోమనాథ్ కథ మన సంస్కృతిని, నాగరికతను కాపాడిన భారత్ మాత లెక్కలేనంత మంది బిడ్డల అచంచలమైన ధైర్యానికి ప్రతీక' అని ఆయన అన్నారు. శతాబ్దాల దండయాత్రలు, వలస దోపిడీని అధిగమించి, ప్రపంచ వృద్ధిలో అత్యంత ప్రకాశవంతమైన ప్రదేశాలలో ఒకటిగా అవతరించిన దేశంలో కూడా అదే స్ఫూర్తి కనిపిస్తోందని ఆయన అన్నారు.

## హర్యానాలో ప్రతి పథకంలోనూ


## అవకతవకలే : సుర్జేవాలా

**చండీగఢ్:** హర్యానాలో బిజెపి ప్రభుత్వ హయాంలో అవినీతి విపరీతంగా పెరిగిందని, రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పథకం అవకతవకలతో ప్రభావితమైందని కాంగ్రెస్ సోమవారం ఆరోపించింది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలను ఉటంకిస్తూ, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా మాట్లాడుతూ గత ఐదేళ్లలో హర్యానాలో అవినీతి కేసులు 78.48 శాతం పెరిగాయని, దీంతో ఇది దేశంలో ఏడవ అత్యంత అవినీతి రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. అవినీతితో విసిగిపోయిన రాష్ట్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు కారుణ్య మరణానికి అనుమతి కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాసేంతగా పరిస్థితి తీవ్రంగా మారిందని కాంగ్రెస్ ఎంపి పేర్కొన్నారు. హర్యానాలో దాదాపు ప్రతి ప్రభుత్వ పథకం అవకతవకలతో ప్రభావితమైందని ఆయన ఆరోపించారు. మోసం, మైనింగ్ మాఫియాలతో పాటు వివిధ మాఫియాల పెరుగుదల, పేపర్ లీక్ కేసులు మరియు మాదకద్రవ్యాల వ్యాప్తికి బిజెపి ప్రభుత్వమే కారణమని ఆయన నిందించారుముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, బిజెపి నాయకులను పాలన యొక్క పర్యవసానాలను అనుభవిస్తున్నారని ఆయన అన్నారు.

# అంతిమ ఘడియల్లో మావోయిస్టు పార్టీ ?

### దగ్గర పడుతున్న మార్చి 31 గడువు

### మిగిలున్న వారి కోసం ముమ్మర గాలింపు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** ఒకప్పుడు సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు, పోరాటాలు అంతిమ ఘడియల్లోకి చేరుకుంటున్నాయి. ఈ విషయాన్ని ఇటీవల వరుసగా లొంగిపోతున్న మావోయిస్టు అగ్ర నేతలే స్వయంగా వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రజాయుద్ధం కొనసాగించ లేమని, ఆయుదాలు అప్పగించి లొంగిపోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని చెప్పుకొస్తున్నారు. భారీ ఎత్తున అగ్రనేతలతో సహా పలువురి ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్ల నేపథ్యంలో మావోయిస్టు పార్టీ అంతిమ దశకు చేరుకున్నట్లు సుస్పష్టమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దశాబ్దాల పాటు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న దండకారణ్యం ఇప్పుడు సాయుద నిశబ్ధాన్ని అలుముకుంటోంది. పక్షుల విప్లవ రాగాలు మూగబోతున్నట్లు అవుతోంది. పారే సెలయేటి నీళ్ల నీడలో కనిపించే బందూకులు బాధతో చప్పుడు చేయక తప్పు పడుతున్నట్లుగా మారింది. సాయుధ పోరాటం ప్రారంభమైన దశ అణిచివేత, దోపిడీ, పెత్తందారీ విధానం అయితే... అదే దశపు అనవాళ్లు ఇప్పుడు మావోయిస్టు పార్టీ అంతానికి పూనుకున్నాయి. దీంతో 16 రాష్ట్రాల్లో సమాంతర పాలన సాగించిన నక్సలైట్ పార్టీ ప్రస్తుతం అంపశయ్యకు చేరుకున్నదని వాదనలు వినవస్తున్నాయి.

**దగ్గర పడుతున్న గడువు:** ఈ ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారతాన్ని చూస్తారంటూ కేంద్ర హోంమంత్రి అమీత్‌షా పదేపదే చెప్పుకొచ్చిన ఆ గడువు సమీపిస్తోంది. దీంతో అడవులను తమ ఆదీనంలోనికి తీసుకున్న పారా మిలటరీ బలగాలు మావోయిస్టులపై ముప్పేట దాటి మొదలు పెట్టాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ రహదార్లు వేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నేషనల్ పార్క్, పామేడు వద్ద చింతవాగుపై నిర్మించిన రెండు వంతెనలు మావోయిస్టుల ఏరివేతకు కీలక పాత్ర పోషించాయి. ఎప్పుడైతే అడవుల్లో బేస్‌క్యాంపులు, బలగాలు సులువుగా ప్రయాణం చేసేందుకు మార్గాలు ఏర్పడ్డయో మావోయిస్టుల ఉనికిపై పెను ప్రభావం చూపింది. కేం ద్రంలో మూడో సారి అధికారంలోనికి వచ్చిన బిజెపి ప్రభుత్వం గడువు పెట్టి మరీ మావోయిస్టుల ను ఏరివేసేందుకు సిద్ధ పడింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉండటం గ మనార్హం. గడిచిన రెండేళ్లలో మావోయిస్టు పార్టీని కేంద్ర క మిటీ కార్యదర్శి బసవరాజు, సభ్యులు చలపతి, సుధాకర్, కట్టా రామచంద్రారెడ్డి, కది రి సత్యనారాయణ రెడ్డి, రూపేష్, హిడ్మా త దితర అగ్రనేతల ఎన్‌కౌంటర్‌లు, పలువురి లొంగుబాటు కుంగదీసింది. మిలటరీ దా డుల రూపకర్త మావోయిస్టు నేత హిడ్మాను నవంబర్ 18న చాకచక్యంగా హతమార్చిన పోలీసులు మరింత పట్టు సాధించారు. మ రో ప్రక్క తాజాగా దేవా తన అనుచరులతో లొంగిపోయారు. ఇక కేంద్ర కమిటీతో పా టు పలు కమిటీల్లో మిగిలిన ముఖ్యనేతలు ముగ్గురే ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ప్రస్తుత మావోయిస్టు కార్యదర్శి తి ప్పరి తిరుపతి, అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మ ణరావు అలియాస్ గణపతి, బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తెలంగాణకు చెందిన వారు కాగా మిషిర్ బెస్రా అలియాస్ భాస్కర్‌లు ఉన్నారు. దీంతో మావోయిస్టు పార్టీ ఉనికి దాదాపుగా చివరి దశకు చేరినట్లే అయింది. కేంద్రం పెట్టిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

**గడిచిన రెండేళ్లలో:** మావోయిస్టు పార్టీని గడిచిన రెండేళ్లలో తీవ్ర నష్టాలు వెంటాడాయి. ఉనికి కోసం ప్రయత్నాలు చేయడం సాధ్యపడని నేపథ్యంలో ఆయుధాలు అప్పగించక తప్పలేదు. రెండేళ్లపాటు సుమారు 2 20 ఎన్ కౌంటర్లు జరిగాయి. ఈ ఎదురు కా ల్పుల్లో సుమారు 467 మంది మావోయిస్టులు మృతి చెందారు. 2354 మంది లొ ంగిపోగా, 1813 మంది అరెస్టయ్యారు. 9 31 ఆయుదాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా 41 మంది జవాన్లు ఎదురు కాల్పుల్లో మృతి చెందగా, సాధారణ పౌరులు 125 మంది పోరులు మృత్యువాత పడ్డారు. లేఖలతోనే హడలెత్తించిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు ఉనికిని కోల్పోతోంది. విప్లవానికి అంతం లేదని మాజీ మావోయిస్టులు చెబుతున్నప్పటికీ ప్రస్తుతం పట్టు సాధించి పెనుగులాడటానికి అవకాశం లేదు. పీడన ఉన్నంత కాలం ఉద్యమాలు సజీవంగానే ఉంటాయని, దోపిడీ, అణిచి వేత కొనసాగినంత కాలం ప్రశ్నించే గొంతుకలు వినపిస్తూనే ఉంటాయనేది విప్లవం ఎరిగిన సత్యం. మావోయిస్టు పార్టీ అంతానికి మోడీ షాలు విధించిన గడువు ఆగమేఘాల మీద ముంచుకొస్తున్న తరుణంలో ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు తలెత్తుతున్నాయి.

# బెంగళూరులో ఉద్రిక్త పరిస్థితి



### ఓం శక్తి భక్తుల ఊరేగింపుపై రాళ్లు రువ్విన దుండగులు

**బెంగళూరు:** కర్నాటక రాజధాని బెంగళూరు నగరంలోని జగ్జీవన్ రామ్ నగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓం శక్తి భక్తుల ఊరేగింపుపై దుండగులు రాళ్లు రువ్వారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ, అదుపులోనే ఉందని పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఊరేగింపుపై జరిగిన దాడిలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు జెజె నగర్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సోమవారం బాధితుల నుంచి ప్రతీకార చర్యలు జరిగే అవకాశం ఉందనే భయంతో జెజె నగర్‌లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. సీనియర్ పోలీసు అధికారులు ఆ ప్రాంతంలోనే మకాం వేసి, ఈ నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకోవడానికి దర్యాప్తు ప్రారంభించారు. వివిఎస్ గార్డెన్‌కు చెందిన శశికుమార్ ఎన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆదివారం అర్ధ రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శశికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, భక్తులు ఆ ప్రాంతంలో ఊరేగింపు నిర్వహిస్తున్నప్పుడు రాత్రి 8.15 గంటల నుండి 9.00 గంటల మధ్య సంఘటన జరిగింది. తాను గత 23 సంవత్సరాలుగా ఓం శక్తి మాల ధరించి, ఆచారంలో భాగంగా ఇరుముడిని మోస్తూ ఓం శక్తి, అయ్యప్ప స్వామి పూజలలో పాల్గొంటున్నానని ఫిర్యాదుదారుడు పేర్కొన్నాడు. ముగ్గురు నలుగురు యువకులు ఊరేగింపుపై రాళ్లు రువ్వారని, ఈ దాడిలో ఒక మహిళా భక్తురాలికి తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమైందని ఫిర్యాదుదారుడు ఆరోపించాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో మతపరమైన కార్యక్రమాల సమయంలో అగ్నిప్రమాదాలతో సహా ఇలాంటి సంఘటనలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో దళిత జనాభా గణనీయంగా ఉందని, దళితులపై అకృత్యాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆరోపించారు. ఈ సంఘటన మతపరమైన మనోభావాలపై దాడి, బెదిరింపు చర్య అని పేర్కొంటూ, ఓం శక్తి భక్తులు, అయ్యప్ప స్వామి భక్తులు సంయుక్తంగా బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు


**పట్టాదారు పాసు బుక్కు పోయినది**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన **ఆవుల రవళి భర్త యాదగిరికి** సంబంధించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ పోయినది. తన భర్త ఆవుల యాదగిరి 02-12-2025 తేదీన మృతి చెందాడు. తన భర్త పేరు మీద ఉండబడిన **తెలంగాణ పట్టాదారు పాసు బుక్కు ఖాతా నెంబర్ : 60450, పట్టా పాసు బుక్ నెం. T21100011234** గల భూమి పట్టా దారు పాసు బుక్కు పోయినది. సంబంధిత పట్టా దారు పాసు బుక్కు దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు:
**ఆవుల రవళి,**
**భర్త : ఆవుల యాదగిరి,**
ఇంటి నెంబర్ : 57-3-53
గ్రామం : రాంపూర్, మండలం : కాజీపేట,
జిల్లా : హనుమకొండ, పిన్: 506151
ఫోన్ నెంబర్ : 7386853365.

# క్రీడలపై రాజకీయ క్రీనీడ

భారత ఉపఖండంలో పాలకపక్షాల మధ్య రాజకీయ వైరాలు, అస్థిరత, అనిశ్చితికి క్రీడా సంబంధాలు బలి అవుతున్నాయి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇప్పటికే ఉప్పు–నిప్పుగా ఉన్న సంబంధాలు ఇరు దేశాల జట్లు — ఒకటి రెండో దేశంలో పర్యటించే అవకాశాన్ని త్రోసిపుచ్చాయి. ఈ పరిస్థితి తాజాగా బంగ్లాదేశ్‌కు విస్తరించింది. ఆ దేశంలోని అంతర్గత రాజకీయ పరిస్థితులు, అక్కడ మైనారిటీలుగా ఉన్న హిందువులపై మతోన్మాదుల మూక దాడులు అగ్నికి ఆజ్యం తోడయినట్లయింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హత్యలు మన దేశంలో ఆగ్రహావేశాపూరితమైన నిరసనలకు దారి తీశాయి. ఇందులో ఉన్న ముస్లిం–హిందూ కోణం ఇరుదేశాల మధ్య సత్సంబంధాలను కలుషితం చేస్తున్నది. పూర్వప్రధాని షేక్ హసీనా వాజెద్ గత ఆగస్టులో జన్–జడ్, వారి వెనుకనున్న దుష్టశక్తుల హింసాత్మక కృత్యాలతో తమ దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందటం. అవినీతికి, నాటి అల్లర్లకు ఆమెను బాధ్యురాల్ని చేస్తూ ఢాకాలోని ప్రత్యేక న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించటం, ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాలో భారత్ వ్యతిరేక ప్రదర్శనలు జరగటంతో బంగ్లాదేశ్ అంతర్గత సమస్య భారత్–బంగ్లా సమస్యగా మారింది. తాత్కాలిక ప్రభుత్వం ఫిబ్రవరిలో నిర్వహిస్తామంటున్న జాతీయ పార్లమెంటు ఎన్నికల్లో షేక్ హసీనా అధ్యక్షురాలిగా ఉన్న ప్రధాన రాజకీయ పార్టీ అవామీలీగ్ పాల్గొనకుండా ముఖ్య సలహాదారు యూనస్ ప్రభుత్వం నిషేధించటం తెలిసిందే. అంతేగాక పచ్చి మితవాద సంస్థ జమాతె ఇస్లాంపైనున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో బిఎన్‌పి అధ్యక్షురాలు, మాజీ ప్రధాని బేగం ఖలీదా జియా అనారోగ్యంతో మరణించటం, 18 ఏళ్లుగా లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న ఆమె కుమారుడు రెహ్మాన్ కొద్దిరోజుల క్రితం ఢాకా తిరిగివచ్చి (ఆయన మీదున్న కేసులు రద్దు చేసి ప్రభుత్వం అందుకు వీలు కల్పించింది), పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించటం బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరో కోణం.

ఈ ఉద్రిక్తత పరిస్థితుల్లో క్రీడా సంబంధాలు అసాధ్యమని ఎవరైనా అంగీకరిస్తారు. అందువల్ల పరిస్థితులు సాధారణీకరణ పొందేవరకు ద్వైపాక్షిక క్రీడా పర్యటనలు వాయిదా వేయవచ్చు. కాని ఇప్పుడు ఇందులో విచారకరమైన కొత్త కోణం చోటు చేసుకుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) 2026 సంవత్సర ఎడిషన్‌కు ఫ్రాంచైజీ కలకత్తా నైట్ రైడర్స్ (సినీ హీరో షారూఖ్‌ఖాన్ యజమాని) గత నెలలో నిర్వహించిన క్రీడాకారుల వేలంపాటలో బంగ్లాదేశ్ పేస్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను దక్కించుకుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ ఆటగాణ్ణి విడుదల చేయాలని బిసిసిఐ కలకత్తా నైట్ రైడర్స్‌కు సలహాయివ్వటం, దాన్ని వారు అమలు చేయటం జరిగింది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇందుకు ప్రతి చర్య అన్నట్లుగా భారత్–శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగబోతున్న టి.20 ప్రపంచ కప్ టోర్నీకి తమ జట్టు భద్రతా కారణాలరీత్యా భారత్ రాలేదని, అందువల్ల తమ జట్టు మ్యాచ్‌లను భారత్ వెలుపల ఏర్పాటు చేయాలని ఐసిసిని అధికారికంగా కోరింది. ఐపిఎల్ మ్యాచ్‌ల టివి ప్రసారాలను కూడా నిషేధించింది. ఈ పురుషుల వరల్డ్‌కప్ ఫిబ్రవరి 7 నుండి మార్చి 8 వరకు జరుగుతుంది. 55 మ్యాచ్‌ల్లో 20 శ్రీలంకలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్ జగడం దృష్ట్యా పాకిస్థాన్ పాల్గొనే పోటీలన్నీ 2028 వరకు తటస్థ వేదికల్లో జరపటానికి ఐసిసి ఇంతకుముందే అంగీకరించింది. ఇరు దేశాల క్రికెట్ పోటీలకు దుబాయ్ వేదికగా ఉంది. ఈ టి.20 ప్రపంచకప్ పోటీల్లో బంగ్లా జట్టు లీగ్‌దశలో కలకత్తాలో మూడు, బొంబాయిలో చివరి లీగ్ ఆడాల్సి ఉంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు సమయం తక్కువగా ఉన్నందున ఐసిసి కిది పరీక్ష. ఎక్కడో ఒక చోట ఏర్పాటు చేయకపోతే ఏకంగా టోర్నమెంట్ అభాసుపాలవుతుంది.

భారత ఉపఖండంలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక తదుపరి బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ ఆడే దేశాలు. వాటిలో మూడు దేశాల మధ్య రాజకీయంగా ప్రస్తుతం స్నేహ సంబంధాలు లేవు. ఇక మిగిలింది శ్రీలంక, అఫ్ఘానిస్థాన్. కాబూల్‌లో పాలన దృష్ట్యా అక్కడ అంతర్జాతీయ క్రీడలకు అవకాశం లేదు. ప్రభుత్వాలు, ప్రజల మధ్య సంబంధాలు దెబ్బతిన్నప్పుడు క్రీడా, సాంస్కృతిక సంబంధాలు ఆశించలేము.

సంపాదకీయం....



## అవసరమైతే సుప్రీంకు వెళతా..

'సర్' ప్రక్రియలో భాగంగా అనుసరిస్తున్న అమానవీయ ప్రవర్తన వల్ల అనేక మంది మరణిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా మంగళవారం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అవసరమైతే సుప్రీం కోర్టుకు కూడా వెళ్లి సాధారణ పౌరురాలిగా వాదిస్తా. ఇంకా నేను శిక్షణ పొందిన న్యాయవాదిని కూడా. గంగాసాగర్ సేతు డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. ఈ క్రమంలోనే గంగసాగర్, దాని పరిసర ప్రాంతాల అభివృద్ధికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. దీని టెండర్ ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించాం. ఈ రోజు శంకుస్థాపన చేశాం. వచ్చే 2-3 ఏళ్లలో ఈ వంతెన పూర్తి అవుతుందని ఆశిస్తున్నాం. ఈ అత్యాధునిక బ్రిడ్జికి సుమారు రూ.1700 కోట్లు ఖర్చు అవుతుంది.

- ప.బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



## జన్యు శాస్త్ర పిత గ్రెగర్ మెండెల్

సంతానం తల్లిదండ్రుల నుండి జన్యు సమాచారాన్ని ఎలా పొందుతుంది అనే ప్రక్రియగా వారసత్వాన్ని నిర్వచించవచ్చు. వంశపారంపర్య ప్రక్రియ మొత్తం వారసత్వంపై ఆధారపడి ఉంటుంది మరియు సంతానం తల్లిదండ్రులను పోలి ఉండడానికి ఇది కారణం. వారసత్వం కారణంగా, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటారని దీని అర్థం.

19వ శతాబ్దం మధ్యలో మాత్రమే ప్రజలు వారసత్వాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోవడం ప్రారంభించారు. వారసత్వం గురించి ఈ అవగాహన గ్రెగర్ మెండెల్ ద్వారా సాధ్యమైంది, అతను వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని నియమాలు రూపొందించాడు, వీటిని మెండెల్ వారసత్వ నియమాలు అంటారు.

మెండెల్ తన ప్రయోగాలలో బఠానీ మొక్కలను ఎంచుకున్నాడు ఎందుకంటే బఠానీ మొక్క విభిన్నమైన గమనించదగ్గ లక్షణాలను కలిగి ఉంది. దీనిని పెద్ద సంఖ్యలో సులభంగా పెంచవచ్చు మరియు దాని పునరుత్పత్తిని మార్చవచ్చు. అలాగే, బఠానీలో మగ మరియు ఆడ పునరుత్పత్తి అవయవాలు ఉన్నాయి, కాబట్టి అవి స్వీయపరాగసంపర్కం మరియు క్రాస్‌పరాగసంపర్కం చేయగలవు.మెండల్ చేసిన పరిశోధనలవల్ల అనువంశికత ఏ విధంగా ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుందో తెలియవచ్చింది.అందువల్లే మనం మెండల్ ని జన్యుశాస్త్ర పిత అని వ్యవహరిస్తున్నాం. అయితే ఆయన చనిపోయిన తర్వాత ఆయనకు ఈ గుర్తింపు లభించింది. జూలై 20, 1822న ఆస్ట్రియాలోని హీన్‌జెండార్ఫ్‌లో ఒక వ్యవసాయ కుటుంబంలో గ్రెగర్ జోహన్ మెండెల్ జన్మించాడు. మెండెల్ తన కుటుంబం యొక్క నిరాడంబరమైన పొలంలో పెరిగాడు, పదకొండు సంవత్సరాల వయస్సులో స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు, యువ మెండెల్ యొక్క తెలివితేటలతో ముగ్ధుడై, అతని విద్యను కొనసాగించడానికి అతనిని పాఠశాలకు పంపమని కుటుంబాన్ని ప్రోత్సహించాడు. కొంతకాలం పాటు మెండల్ క్రైస్తవ మత ప్రచారకర్తగా వ్యవహరించాడు. ఆయన 1884జనవరి 6న తుదిశ్వాస విడిచారు.

(జనవరి 6–మెండల్ వర్ధంతి సందర్భంగా)

# 'ఆ గట్టునుంటావా ఈ గట్టుకొస్తావా' : మోదీకి ట్రంప్ పరీక్ష



ఎం.కోటేశ్వరరావు

ప్రతి ఏటా మాదిరే ఈసారి కూడా అమెరికా రక్షణశాఖ (పెంటగన్) 2025 నివేదిక విడుదల చేసింది. దాని లో ఉన్న అభూత కల్పనలు, కుట్ర సిద్ధాంతాలు, వక్రీకరణలతో సహా అనేక అంశాల గురించి మీడియాలో, ఇతరంగా అనేకమంది తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. హెచ్చరికలు, పరోక్ష బెదిరింపులు, బుజ్జగింపులు, చైనా, మనదేశం పరస్పరం దెబ్బలాడుకొనేందుకు తంపులు పెట్టటం వంటివి అనేకం ఉన్నాయి. ఈ ఏడాది నివేదిక ప్రత్యేకత ఏమంటే తన తో చెట్టపట్టాలు వేసుకుని జిగిని దోస్తులా ఉన్న నరేంద్రమోడీకి సహజభాగస్వామి డోనాల్డ్ ట్రంప్ అగ్ని పరీక్ష పెట్టాడంటే అతిశయోక్తి కాదు. ఏడాది కాలంలో ఎంతలో ఎంతమార్పు ?

ఐదేండ్ల పాటు శత్రువుగా పరిగణించిన చైనాతో పూర్వంమాదిరి సంబంధాలు, అమెరికాతో ఎడబాటుకు 2025నాంది పలికింది. అమెరికా మీడియా కొన్ని అంతర్గత అంశాల మీద విమర్శనాత్మకంగా ఉన్నప్పటికీ మొత్తంమీద ఎవరు అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ కనుసన్నలలోనే ఉంటుంది. " భవిష్యత్‌లో ఘర్షణ అవకాశం" ఉంటుందంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ తాజాగా భారత్, చైనా గురించి ఒక విశ్లేషణ రాసింది. దానికి ఆధారం పెంటగన్ నివేదికలోని అంశాలు. భవిష్యత్‌లో చైనాతో యుద్ధం తలెత్తే సమక్షంలో యావత్ హిమాలయ ప్రాంతంలో భారత్ వందలకోట్ల డాలర్లతో రోడ్లు, సొరంగాలు, విమానాలు ఎగిరే, దిగే ఏర్పాట్లు తదితర మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. రక్షణ విషయంలో సమతూకంతో ఉండటం కాకుండా వ్యూహాత్మక పోటీని సంచలనాత్మకం కావిస్తోంది. 2020 గాల్వన్ లోయలో మాదిరి చైనా కొద్ది గంటల్లోనే అదనపు బలగాలను దించగలదు, మౌలిక సదుపాయాలు లేని కారణంగా అదే భారత్‌కు ఒక వారం పడుతుంది. మొత్తం వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం వచ్చిందని గుర్తించామని, అందువలన ఆలోచనలు నాటకీయంగా మారినట్లు లడఖ్ ప్రాంతంలో రవాణా నిర్వహణ వ్యవహారాలను పర్యవేక్షించిన మాజీ అధికారి మేజర్ జనరల్ అమ్రిత్ పాల్ సింగ్ చెప్పినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. గాల్వన్‌లోయ ఉదంతాల తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు కనిష్ట స్థాయికి పడిపోయాయని, డోనాల్డ్ ట్రంప్ పన్నుల విధింపుతో భారత్, చైనాలతో అమెరికా సంబంధాలు దెబ్బతిన్నట్లు కూడా వ్యాఖ్యానించింది.

రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలను సరి చేసుకోవాలని 2024 అక్టోబరు నుంచి నిర్ణయించుకోవటమేగాక వేగంగా సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాయి. దాంతో ఏడు సంవత్సరాల తరువాత ప్రధాని నరేంద్రమోదీ చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి హాజరై పుతిన్, షీ జిపింగ్‌లతో భేటీ జరిపి అమెరికాకు పరోక్ష హెచ్చరికలు పంపా రు. పెంటగన్ నివేదిక ఈ పూర్వరంగంలో తయారైందే అన్నది స్పష్టం. సరిహద్దులలో ఉద్రిక్తతలు తగ్గటాన్ని అవకాశంగా తీసుకొని అమెరికా, భారత్ సంబంధాలను బలహీనపరిచేందుకు చూస్తున్నదని, పాకిస్తాన్‌తో రక్షణ సంబంధాలను మరింతగా పెంచుకుంటున్నదని, అరుణాచల్ ప్రదేశ్‌ను ప్రధాన అంశంగా చూస్తున్నదని ఆ నివేదికలో చైనామీద ఆరోపించారు. గత పదకొండు సంవత్సరాలు, అంతకు ముందు యుపిఎ హయాంలో అమెరికా జూనియర్ భాగస్వామిగా మారేందుకు మన్మోహన్ సింగ్ ప్రయత్నించారు. తరువాత నరేంద్రమోదీ హౌడీమోడీ కార్యక్రమంలో డోనాల్డ్ ట్రంప్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారంచేసి చెట్టపట్టాలు వేసుకుతిరిగి మరింత సన్నిహితమయ్యారు. క్వాడ్ పేరుతో చైనాకు వ్యతిరేకంగా మరింత చురుకుగా వ్యవహరించారు. ఈ పరిణామాలకు చైనా కారణమా? ప్రారంభ సంవత్సరాల్లో జవహర్‌లాల్ నెహ్రూ కూడా అమెరికావైపే మొగ్గారు. దానిది ధృతరాష్ట్ర కౌగిలి అని అర్థమయ్యాక అలీనవిధానం, సోవియట్‌వైపు మొగ్గారు. పరిస్థితిని చూస్తుంటే ఇప్పుడు నరేంద్రమోదీ కూడా చైనాతో రానున్న రోజుల్లో ఎలా ఉంటారో తెలియదుగాని అనివార్యంగా అమెరికా బెదిరింపులను వ్యతిరేకించకతప్పని స్థితిలో ఉన్నారు. నరేంద్రమోదీ అమాయకంగా చైనా వలలో చిక్కుకున్నారని అనుకుంటే అంత కంటే అమాయకత్వం మరొ కటి ఉండ దు. అవసరాలు అలానడిపిస్తాయి.

అరుణాచల్ ప్రదేశ్ టిబెట్‌లో అంతర్భాగమని మనదేశంలో ఆశ్రయం పొందుతున్న దలైలామా స్వయంగా చెప్పాడు. ఆ పెద్దమనిషికి మనదేశం అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నది. అదే మాట చైనా కూడా చెబుతున్నమాట నిజం. అయితే ఎన్నడూ ఆక్రమించుకుంటామని చెప్పలేదు. 1962 యుద్ధం సందర్భంగా చైనా సేనలు అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజ్‌పూర్ వరకు వచ్చాయి. అక్కడే తిష్టవేసి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. యుద్ధంలో కాల్పుల విరమణను వారే ప్రకటించి, తమ ఆధీనంలోకి తెచ్చుకున్న ప్రాంతాల నుంచి ఉపసంహరించుకొని వాస్తవాధీన రేఖకు ఆవలకు వెళ్లాయి. ఇది చైనా వ్యతిరేకులు కూడా అంగీకరిస్తున్న తిరుగులేని వాస్తవం. బ్రిటీష్ అధికారులు గీచిన సరిహద్దు రేఖలను చైనా ఎన్నడూ అంగీకరించ లేదు. లడఖ్‌లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతం మనదిగానూ, అరుణాచల్ చైనాలో భాగంగా బ్రిటీష్ మాపుల్లో ఉంది. అందుకే సరిహద్దు వివాదం తలెత్తింది. ఐదేండ్ల క్రితం ఆరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించి చైనా కొన్ని గ్రామాలు నిర్మిస్తున్నదని మన మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అవి అమెరికా సిఐఎ సృష్టించిన కట్టుకథలు, వక్రీకరించిన చిత్రాలు. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన మన మిలిటరీ అధికారి రావత్ అప్పుడే ఆ వార్తలు అవాస్తమని ప్రకటించారు. గతంలో ఎన్నడో నిర్మించిన ఇండ్లు పాతబడిపోయినందున వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు తప్ప చైనా ఎలాంటి ఆక్రమణకు పాల్పడలేదని



చెప్పారు. మన కేంద్ర ప్రభుత్వం కూడా కొత్తగా ఎలాంటి దురాక్రమణలు జరగలేదని పార్లమెంటులో, వెలుపలా ప్రకటించిన సంగతి తెలిసిందే.

పాకిస్తాన్‌కు చైనా ఆయుధాలు, యుద్ధ విమానాలు విక్రయిస్తున్నది జాగ్రత్త అంటూ మన దేశాన్ని భయపెట్టేందుకు పెంటగన్ పూనుకుంది. ఆయుధాల క్రయ, విక్రయాలు అంతర్జాతీయ నిబంధనల మేరకే జరుగుతున్నాయి. చైనా గురించి మనలను రెచ్చగొడుతున్న అమెరికా దానికంటే ముందుగానే ఎఫ్16 యుద్ధ విమానాలను, ఇతర ఆయుధాలను పాకిస్తాన్ కు ఎందుకు అమ్మినట్లు? మనకు కూడా ఎఫ్35 విమానాలను ఇస్తామని స్వయంగా డోనాల్డ్ ట్రంపే చెప్పాడు కదా? మనం ఫ్రాన్సునుంచి రాఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్నాం. అదేవిధంగా చైనా నుంచి పాకిస్తాన్ కొనుగోలు చేసింది. చైనా విమానాలు ఎగరలేవు, ఆయుధాలు తుస్సుమనే నాశిరకం అని ఒకవైపు ప్రచారం చేస్తున్నవారు, వాటి గురించి ఎందుకు భయపెడుతున్నట్లు? ఎంతో సమర్ధవంతమైనవని చెబుతున్న రాఫేల్ విమానాలను పాకిస్తాన్ ఆ నాశిరకం ఆయుధాలతోనే కూల్చివేసింది. ఆపరేషన్ సింధూర్‌లో ఏం జరిగిందీ, చైనా ఆయుధాల గురించీ నరేంద్రమోదీకి తెలియని అంశం కాదు. ఆ తరువాతే కదా చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి మోడీ వెళ్లటం, చైనాకు వీసాలు, విమానాల పునరుద్ధరణ వంటి సానుకూల పరిణామాలన్నీ చోటు చేసుకున్నది. సంబంధాల పునరుద్ధరణ సందర్భంగా రెండు దేశాలూ ఇతర దేశాలతో సంబంధాల విషయంలో పరస్పరం ఎలాంటి ఆంక్షలు పెట్టకూడదని నిర్ణయించాయి. పెంటగన్ నివేదికను చూసి మనదేశంలోని కొందరు నిజమే కదా అనుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు.

తగాదాలు పెట్టటం, అనుమానాలను పెంచటంలో అమెరికా తరువాతే ఎవరైనా. పెంటగన్ నివేదికను బయటపెట్టిన తరువాత గతంలో అధ్యక్షుడిగా ఉన్న జార్జి డబ్ల్యు బుష్ మరియు రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణలు బయటకు వచ్చాయి. చైనాను నమ్మవద్దని ఇప్పుడు మనకు ట్రంప్ చెబుతున్నట్లే నాడు బుష్ కూడా పుతిన్‌కు చెప్పాడు. బుష్, పుతిన్ మధ్య 2001 నుంచి 2008వరకు జరిగిన సంభాషణల ప్రకారం చైనా నుంచి మీకూ మాకూ ఇద్దరికీ దీర్ఘకాలిక సవాలు ఉన్నదని, అందువలన మీరు జాగ్రత్తలు తీసుకోవాలని బుష్ చెప్పాడు. తొలిసారి స్లోవేనియాలో ఇద్దరు నేతలు భేటీ అయినపుడు రష్యా పశ్చిమదేశాల్లో భాగం అనీ, శత్రుదేశం కాద ని, చైనాతో జాగ్రత్తగా ఉండాలని, ఇద్దరికీ దీర్ఘకాలం సమస్యలుంటాయని బుష్ అన్నాడు. 2005 లో కూడా ఈ ప్రస్తావన చేసినపుడు మాకంటే మీకే ఎక్కువ సమస్యలని పుతిన్ చెప్పాడు. దానికి వారేమీ మా సరిహద్దులలో లేరని (చైనా రష్యా మధ్య 4,195 కిలోమీటర్ల సరిహద్దు ఉంది) చైనా నుంచి వ్యవస్థాపరమైన సవాలు ఉందని బుష్ బదులిచ్చాడు.

అయితే పుతిన్ తక్కువేమీ తినలేదు గనుక తమకు తక్షణ ప్రమాదం నాటో తూర్పువిస్తరణ, ఐరోపాలో అమెరికా క్షిపణి మోహరింపు పథకాల నుంచి వుందని చెప్పాడు. చివరి సారిగా ఇద్దరు నేతల మధ్య 2008లో సంభాషణలు చోటు చేసుకున్నా యి. అక్కడ కూడా బుష్ చైనా గురించి హెచ్చరించాడు. అయితే తమ దేశ సరిహద్దులకు పశ్చిమ దేశా ల మిలిటరీ మోహరింపు తక్షణ ప్రమాదంగా ఉందని పుతిన్ స్పష్టం చేశాడు. తరువాత జరిగిన పరిణామాల్లో రష్యాను నమ్మించి మోసం చేసేందుకు అమెరికా నాయకత్వంలోని నాటో చేసిన కుట్రలు బయటపడ్డాయి. ఉక్రెయిన్‌లో రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసి తమకు తొత్తులుగా ఉండేవారిని గద్దెనెక్కించి, దానికి నాటో సభ్యత్వమిచ్చి రష్యా సరిహద్దుల్లో తిష్టవేసేందుకు పూనుకున్నారు. దానికి ప్రతిగానే రష్యా 2014లో ఉక్రెయిన్‌లో ఉన్న ప్రాంతమైన క్రిమియాను స్వాధీనం చేసుకుంది.దాంతో రష్యాను జి 8 కూటమి నుంచి తొలగించారు.

అసలు అమెరికా ఎందుకు గుండెలు బాదుకుంటోంది? ఆసియా ఖండంపై ఆధిపత్యంకోసం, దానిలో భాగంగా చైనాను కట్టడి చేసేందుకు దీర్ఘకాలంగా అది అనుసరిస్తున్న విధానానికి న్యూఢిల్లీ, బీజింగ్ సాధారణ సంబంధాల పునరుద్ధరణ పెద్ద ఎదురుదెబ్బ. భారత్ మెడమీద తుపాకి పెట్టి చైనాను కాల్చాలనుకున్న దాని ఎత్తుగడ పారే అవకాశం లేదని అనుకుంటున్నది. రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదంలో మూడోదేశ జోక్యానికి అవకాశం లేదని మోదీ సర్కార్ స్పష్టం చేసింది. చైనాతో దౌత్య సంబంధాలు, వీసాలు, విమానాల పునరుద్ధరణ ఏదో తాత్కాలిక వ్యూహంలో భాగం అనుకోలేము. రష్యా, చైనా, భారత్ సంబంధాలు మరింత సన్నిహితం కావటం సహజంగానే అమెరికాకు మింగుడుపడటం లేదు. ఈ పరిణామం ప్రపంచ రాజకీయాలలో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసేదిగా కనిపిస్తున్నది. ఈ పూర్వరంగంలో అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమి భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నగా మారిందని చెప్పవచ్చు. దక్షిణ చైనా సముద్రంలో చైనాను అడ్డుకొనేందుకు 2007లో ఈ కూటమిని అమెరికా ముందుకు తెచ్చింది. తరువాత దాని పరిణామాలు, పర్యవసానాలను మదింపు చేసుకొని మన్మోహన్ సింగ్ దాని పట్ల ఆసక్తి చూపకపోవటంతో ఒక విధంగా అది అటకెక్కింది. తరువాత నరేంద్రమోదీ ఉత్సాహం చూపటంతో 2017 నుంచి చురుకుగా పనిచేస్తున్నది.

మారిన పరిస్థితుల్లో అంతర్గతంగా మోదీకి ఇష్టం ఉన్నా, లేకపోయినా ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నారు, చైనా వైపు మొగ్గారు. అందుకే ట్రంప్ ఇప్పుడు అగ్నిపరీక్ష పెట్టారు. ఏ గట్టునుండాలో తేల్చుకొమ్మని హెచ్చరించాడు.

# గాంధీ, నెహ్రూ వారసత్వంపై దాడి

భారతదేశ లౌకిక పునాదులు సడలిపోయి, పరీక్షకు గురవుతున్న ఈ యుగంలో జాతిపిత మహాత్మాగాంధీ మరియు ఆధునిక భారతదేశ నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ శాశ్వత కృషి దేశ గుర్తింపుకు కీలకంగా మిగిలి ఉంది. ఇటీవల రాజకీయ చర్చలు, ప్రభుత్వ ప్రత్యక్ష పరోక్ష చర్యలు తీవ్రమైన వ్యతిరేకత అలాగే సామాజిక సమగ్రతను విచ్ఛిన్నం చేసేవిగా ఉన్నాయి. కొన్ని స్వతంత్ర సంస్థలను తమ చెప్పు చేతుల్లో పెట్టుకుని కేసులు బనాయించి ప్రజల్లో సాంఘిక అశాంతిని పెంచి సమాజంలో జరిగే అభివృద్ధికి కొన్ని మతాలు, కొన్ని కులాలు ప్రతిబంధకంగా మారాయని తద్వారా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే పద్ధతిలో ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుంటోందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. మహాత్మాగాంధీ అహింస (సత్యాగ్రహం) మరియు మానవతావాద దర్శనం మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ నుంచి నెల్సన్ మండేలా వరకు ప్రపంచ నాయకులను ఇప్పటికీ ప్రేరేపిస్తుంది. గాంధీ పేదరికం, కుల వివక్ష, వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు నాయకత్వం వహించారు, ఇది 1947లో భారత స్వాతంత్ర్యంల సాధించిన తర్వాత ముగిసింది. ఆరెస్సెస్ బిజెపి తో సంబంధం ఉన్న అంశాలు గాంధీపట్ల చారిత్రక శత్రుత్వాన్ని కలిగి ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రజాతంత్ర వాదులు విమర్శిస్తున్నారు. ఇది హిందూ మహాసభ భావజాల వాదుల తో ముడిపడి ఉంది, అలాగే గాంధీ పాత్రను తగ్గించే నిరంతర ప్రయత్నాలను చేస్తున్నారు. ఇటీవలకాలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కొత్త ఫ్రేమ్‌వర్క్ విబి జీ రామ్ జీ పేరు మార్చడం ద్వారా నిరూపితమైంది, కీలక గ్రామీణ సంక్షేమ పథకం నుంచి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు. భారతదేశ మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ 1948లో ఆర్‌ఎస్‌ఎస్ ను నిషేధించారు, గాంధీ హత్యకు దోహదపడిన సాంప్రదాయిక విషాన్ని పెంచిన పాత్రను ఉదహరిస్తూ. చారిత్రక రికార్డులు పటేల్ను ఉల్లేఖిస్తాయి: సావర్కర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో హిందూ మహాసభ యొక్క ఫనాటికల్ వింగ్ కుట్రను రూపొందించి, దానిని అమలు చేసింది (నెహ్రూ లేఖ, ఫిబ్రవరి 27, 1948). భారతదేశం మొదటి ప్రధానమంత్రి (1947–1964) జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారతదేశాన్ని పారిశ్రామికీకరణ, శాస్త్రీయ మనస్తత్వం మరియు అనాలైన్మెంట్ ద్వారా మార్చారు. నెహ్రూ మానవతావాదాన్ని పెంపొందించారు, తర్కం, అనుభవాత్మక సాక్ష్యం మైనారిటీ రక్షణలకు ప్రాధాన్యత ఇచ్చారు. సంక్షేమ రాజ్య దృష్టి పేదరికం మరియు అసమానతను ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ ద్వారా పరిష్కరించింది, సాంప్రదాయికతను ఎదుర్కొనేందుకు విభిన్నతలో ఐక్యతను ప్రోత్సహించింది.

వ్యవస్థలను నెలకొల్పడంలో నెహ్రూ చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఇటీవల పార్లమెంట్ సెషన్ లో వందే మాతరం వంటి చారిత్రక సంఘటనల పై చర్చలు నెహ్రూ పాత్ర వక్రీకరించేదిగా గమనించవచ్చు. పథకాల పేరు మార్పు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం సంస్కరణలతో కాంగ్రెస్‌వారసత్వాన్ని తొలగించే ఆరోపణలను రేకెత్తించాయి. స్వతంత్ర పోరాటంలో పాల్గొనని మతోన్మాదులు, బ్రిటిషువారి మూతులు నాకి క్షమాభిక్ష ప్రసాదించమని ప్రార్థించిన వారి వారసులు పాలిస్తున్న తరుణంలో ఇలాంటి దుష్పరిణామాలు సంభవించక తప్పదు. భారతదేశం ఈ చర్చలను నావిగేట్ చేస్తున్నప్పుడు, అహింస, లౌకికత మరియు సమగ్ర ప్రగతిలో మూలాలు ఉన్న గాంధీ, నెహ్రూ వారసత్వాలు దేశ స్థాపన ఆదర్శాల గుర్తు చేయడంగా పని చేస్తాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం కోసం సామాజిక సమైక్యత, ప్రజాస్వామ్యం, లౌకికవాదం కాపాడటం అవసరం.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

# కారకస్‌లో కల్లోలం.. ఢిల్లీలో ఆందోళన

దక్షిణ అమెరికా ఖండంలో అత్యధిక చమురు నిల్వలు కలిగిన వెనెజులాలో శనివారం రాత్రి చోటుచేసుకున్న పరిణామాలు ప్రపంచ భౌగోళిక రాజకీయాలను ఒక్కసారి గా కుదిపేశాయి. అమెరికా దళాలు ఆ దేశ రాజధాని కారకస్‌పై మెరుపు దాడులు నిర్వహించి, అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారంపై కొత్త చర్చ కు దారితీసింది. ఈ ఉద్రిక్తతలపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ, అక్కడి పరిస్థితు లు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. మారుతున్న పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని చెబుతూనే, సమస్యను శాంతియుత మార్గాల్లో, దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. అయితే, ఈ ఆందోళన కేవలం ఒక దేశ రాజకీయ మార్పు గురించి మాత్రమే కాదు, దీని వెనుక భారత్ యొక్క లోతైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి. వెనెజువెలాలో నెలకొన్న అస్థిరత భారత్‌కు ఆర్థికంగా ఎంతో కీలకమైన అంశం. ప్రపంచంలోనే అతిపెద్ద ముడిచమురు నిల్వలు ఉన్న దేశాలలో వెనెజులా ఒకటి కావడంతో, అక్కడ జరిగే ఏ చిన్న అలజడి అయినా అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై తక్షణ ప్రభావం చూపుతుంది.




గత దశాబ్దకాలంగా భారత్ తన ఇంధన అవసరాల కోసం వెనెజులాపై గణనీయంగా ఆధారపడుతూ వచ్చింది. మదురో ప్రభుత్వంపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇటీవల దిగుమతులు తగ్గినప్పటికీ, ఇప్పుడు జరుగుతున్న సైనిక చర్య వల్ల చమురు సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినే ప్రమాదం ఉంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్ ముడిచమురు ధరలు పెరిగితే, అది భారత్ వంటి దిగుమతి ఆధారిత దేశాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారాన్ని మోపుతుంది. రవాణా ఖర్చులు పెరగడం ద్వారా దేశీయంగా ద్రవ్యోల్బణం పెరిగి, సామాన్య ప్రజలపై భారం పడే అవకాశం ఉంది. అంతేకాకుండా, వెనెజులా లో ఓఎన్‌జిసి విదేశ్ వంటి భారతీయ చమురు సంస్థలు వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాయి. మదురో ప్రభుత్వం పతనం కావడం, ఆ దేశంలో పౌర యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, ఆ పెట్టుబడుల భద్రత మరియు సుమారు ఒక బిలియన్ డాలర్లకు పైగా రావాల్సిన బకాయిలు ప్రశ్నార్థకంగా మారుతాయి వెనెజులాలోని భారతీయ పౌరుల రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తమైం ది. సుమారు 80 మందికి పైగా భారతీయులు అక్కడ ఉన్నట్లు సమాచారం, వారి భద్రత కోసం విదేశాంగ శాఖ నిరంతరం అక్కడి రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతోంది. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వారిని సురక్షితం గా తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారత్ తన జాతీయ ప్రయోజనాలను, అంతర్జాతీయ సంబంధాలను సమతూకం చేసుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజంపై ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ నాయకత్వం వహించే తరుణంలో ఒక పెద్ద పరీక్షగా నిలవనున్నాయి.

వెంకగారి భూమయ్య
9848559863

# సిపిఐ త్యాగాల చరిత్రపై నిర్మితమైనది

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి
జమ్ముల జితేందర్‌రెడ్డి

దేశ సంపద కార్పొరేట్ల జేబుల్లోకి
ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి
సింగు నరసింహారావు





**ప్రజాపక్షం/బోనకల్ :** భారతదేశ గడ్డపై మహోజ్వల పోరాటాల, త్యాగాల చరిత్ర నిర్మితమైనది సిపిఐ అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా మోటమర్రి, కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, బోనకల్, ముష్టికుంట్ల గ్రామాల మీదుగా జాతా కొనసాగింది. ఆయా గ్రామాల సిపిఐ శ్రేణులు జాతా ప్రతినిధులను ఘనస్వాగతం పలికారు. ముందుగా మోటమర్రిలో జాతాలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిందన్నారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై ఆవిర్భవించి నేటికి పోరాడుతుందన్నారు. భారత దేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. దోపిడీకి పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. వేలాది మంది అమరుల త్యాగాలతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. అనాటి నుండి నేటి వరకు ప్రజాక్షేత్రంలో అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ దేశంలో భూసంస్కరణలు, కార్మిక హక్కులు అనేక సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాటాల ఫలితంగా వచ్చాయని గుర్తు చేశారు. పేదలు, దళితులు, మైనార్టీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి, ప్రజల హక్కుల సాధన కోసం సిపిఐ నిరంత పోరాటాలు చేస్తోందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ పూర్తిగా అమలు కావడం లేదని, నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిహెచ్ సీతామహాల, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, నాయకులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంకటమ్మ, శాఖ కార్యదర్శి వంగాల కృష్ణ, తోటపల్లి ఆనందరావు, సొసైటీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వర్లు, తోటపల్లి సునీత, మాతంగి సామ్రాజ్యం, యంగల కృష్ణవేణి, బుంగ నరసింహ, బుంగ గోపి, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ వందేళ్ల పండుగకి తరలిరండి**

**మధిర :** భారతగడ్డపై నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని, ఈ వందేళ్లు సిపిఐ పేదలు, బడులు, బలహీన వర్గాల కోసం పోరాటాలు సాగించిందని, రానున్న మరో వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ప్రజా క్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సింగు నర్సింహారావు అన్నారు.
సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావడంతో ఈనెల 18న ఖమ్మం వేదికగా 5లక్షల మందితో నిర్వహించే శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 3న సత్తుపల్లిలో ప్రారంభమై ప్రచార జాతా సోమవారం మధిరకు చేరుకుంది. ప్రజానాట్యమండలి కళాకారుల జాతాకి ముందుభాగాన నిలిచి వందేళ్ల సిపిఐ పోరాట చరిత్రను పాటల రూపంలో ప్రజలకు వివరించారు. అనంతరం మధిర పట్టణం, మడుపల్లి, మల్లవరం గ్రామాల్లో సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభల్లో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.
భారత గడ్డపై సిపిఐ నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా ప్రచార జాతా సోమవారం మధిర మండలం మాల్లారం గ్రామం చేరింది. గ్రామంలోని కార్యకర్తలు భారీగా బైకులతో స్వాగతం పలికారు. మల్లారం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ అమరజీవి మచ్చా హన్మంతరావు, మాజీ ఎంపిటిసి అమరజీవి మందడపు నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మి, మందడపు రాణి, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, పద్మ, కొంగర మురళీ, గరిడేపల్లి వెంకటేశ్వరరావు, ఎర్ర నాగులు, సైదులు, మందడపు మురళీకృష్ణ, సుజాత, కృష్ణారావు, వెంకటలక్ష్మి, మరియమ్మ, అరిగెల రవి, సాయి తదితరులు పాల్గొన్నారు



## ప్రచార జాతలో పలువురు సిపిఐలో చేరిక

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆళ్లపల్లి మండలంలో సోమవారం జరిగిన సిపిఐ ప్రచార జాతలో ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి పూనెం వెంకటేష్, మర్కోడు గ్రామానికి చెందిన పాషా, సుద్దరేవు గ్రామానికి చెందిన పూనెం క్రిష్ణలు సిపిఐ జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్క అజిత్, అధ్యక్షులు ఎస్‌కే.షాహిద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల మల్లికార్జున్, జిల్లా సమితి సభ్యులు గొగ్గేల కృష్ణ, మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు, మండల సహాయ కార్యదర్శిలు నరెడ్ల రాంబాబు, వజ్జా పగడయ్య, ఎస్‌కే.రహీం, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కాటూరి రాము, సీనియర్ నాయకులు శ్రీరామ సమ్మయ్య, డీకొండ మల్లేష్, కుంట సహదేవ్, నరేడ్ల శివ, రేసు సురేందర్, గుంతోజు శివ, మద్దెల వెంకటేశ్వర్లు, సూర్య నారాయణ, కల్తి భద్రయ్య, గొగ్గల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.


## పెన్షనర్ల అరెస్టు శోచనీయం

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు సిద్ధమైన వారిని హౌజ్ అరెస్టులు చేయడం శోచనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ తెలిపింది. అరెస్టులను తీవ్రంగా ఖండించింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్‌లు ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి నేటికి బకాయిలు చెల్లించలేదని బకాయిల కోసం ఆందోళన చేస్తున్న వారిని హౌజ్ అరెస్టులు చేయడం సహేతుకం కాదన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేపట్టిన వారిని అరెస్టు చేయడం ద్వారా పెన్షనర్ల పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టమైందన్నారు. అర్ధరాత్రి నుండి ముఖ్య కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్నారని కరీంనగర్, సూర్యాపేట తో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన వారిని కూడా అరెస్టు చేశారని వారు తెలిపారు. పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలని లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని పుల్లయ్య, రవికుమార్‌లు తెలిపారు.

## బ్యాంకులు సరైన భద్రత ఏర్పాటు చేసుకోవాలి : ఎస్‌పి రోహిత్‌రాజ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం తన ఛాంబర్లో బ్యాంకు అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటిఎంలు, బ్యాంకుల్లో నేరాలు జరగకుండా అధికారులు జాగ్రత్త పడాలన్నారు. అన్ని ప్రదేశాల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఏటిఎంలలో నగదు లోడ్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు సైబర్ నేరాలపై ప్రతినిత్యం అవగాహన కల్పించాలని చెప్పారు. సైబర్ నేరాల భారిన పడి నగదు కోల్పోయిన బాధితులకు నేరగాళ్ల అకౌంట్లలో ఫ్రీజ్ చేయబడిన నగదును త్వరితగతిన వారికి అందించేలా పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ చర్యలు తీసుకోవాలని చెప్పారు.



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/మధిర :** త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, 9వ డివిజన్ మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు పిలుపునిచ్చారు. సోమవారం మధిర మున్సిపాల్టీ పరిధిలోని 9వ డివిజన్‌లో ఇన్‌చార్జిలు అంబటి వెంకటేశ్వరరావు, నేతాజి ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు డివిజన్ సమావేశాలను నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, కర్నాటి అశోక్, శ్రీనినవాసరాజు, బండి ప్రశాంతి, మునుగోటి ఆంజనేయులు పాల్గొన్నారు.



## దాతల సహకారంతో క్రీడా దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం/మధిర :** మధిర మండల పరిధిలోని మాటూరు ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి అల్లుడు మహిపాల్‌రెడ్డి, శ్రీ వైష్ణవి దంపతుల దాతృత్వంతో క్రీడా దుస్తులను ఎంఇఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి వారికి అవసరమయ్యే మౌలిక వసతులు, ఇతర వస్తువులు అందించటం అభినందనీయమనని అన్నారు. దాతల దాతృత్వం చక్కని చేయూతలా ఉపయోగించుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు నడవాలని సూచించారు. విద్యార్థులకు సుమారు రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొట్టె వెంకట్రావమ్మ, పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం కప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిఎం కప్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ క్రీడా పోటీలపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణను అందించడమే సిఎం కప్ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ క్రీడలు ఐదు దశల్లో జరుగుతాయని వెల్లడించారు. గ్రామపంచాయితీల స్థాయిలో ఈనెల 17 నుండి 22 వరకు మండల స్థాయి పోటీలు 28 నుండి 31 వరకు, నియోజకవర్గ పరిధిలోని వచ్చే నెల 3 నుండి 7 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 10 నుండి 14 వరకు ఉంటాయని, గెలుపొందన విజేతలు రాష్ట్ర స్థాయి సిఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 19నుండి 26 వరకు వివిధ ప్రాంతాల్లో జరగనున్నాయన్నారు. గ్రామ స్థాయిలో క్రీడాపోటీల నిర్వహణకు జిల్లాను 77 క్లస్టర్లుగా విభజించామని, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికలను తీసుకొచ్చిన ఘనత కూనంనేనిదే

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా





**ప్రజాపక్షం/పాల్వంచ :** గత 20 సం.లుగా ఎన్నికలు లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పాల్వంచను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుదే అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా అన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రచార జాత సోమవారం రాత్రి పాల్వంచకు చేరింది. ఈ సందర్భంగా జాతాకు నవభారత్ సెంటర్ వద్ద భారీ స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో వందలాది వాహనాలతో దమ్మపేట సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా నటరాజ్ సెంటర్, శాస్త్రి రోడ్, రాజీవ్ గాంధీ రోడ్, కూరగాయల మార్కెట్ నుండి పోస్టాఫీస్ సెంటర్‌కు చేరుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ది కోసం గత ప్రజాప్రతినిధులు పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా అడ్డుపడ్డారని, ఎన్నికల హామీలో భాగంగా కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే పాల్వంచకు ఎన్నికలు నిర్వహిస్తానని హామీ ఇచ్చిన కూనంనేని దానిని నిలబెట్టుకున్నారని చెప్పారు.
పాల్వంచ సమగ్రాభివృద్ధికి సిపిఐ కట్టుబడి ఉందని చెప్పారు. శాశ్వత మంచినీటి పరిష్కారానికి అమృత్ స్కీంలో భాగంగా రూ.50కోట్ల నిధులతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని,కార్పొరేషన్ ఏర్పాటుతో ఇప్పటికే ఈ ప్రాంతానికి రూ.100కోట్ల అభివృద్ధి నిధులు వచ్చాయని, దశాబ్దాల సమస్యను పరిష్కరించేందుకు కూనంనేని పాటుపడతున్నారని చెప్పారు. పాల్వంచలో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ ప్లాంట్లు మంజూరయ్యాయని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని చెప్పారు.
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫాయూమ్, గుండాల నాగరాజు, విశ్వేశ్వర రావు, పద్మజ, వేముల కొండలరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వర్గా అజిత్, వేల్పుల మల్లిఖార్జున్, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజల నుంచి అర్జీలను
స్వీకరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా.పి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సత్తుపల్లిలోని కాకర్ల పల్లి సర్కిల్ వద్ద ఉన్న ఆర్ఆర్ చికెన్ సెంటర్ వల్ల చుట్టు పక్కల నివసించే ప్రజలకు దుర్గంధంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అక్కడి నుంచి చికెన్ సెంటర్‌ను తరలించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ధంసలాపురం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులు ర్యాంపు 3 ఎంట్రీ, ఎగ్జిట్ దగ్గర ఉన్న ప్లాట్లకు దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సాధన సుబ్బమ్మ తన కుమారుడు మోసం చేసి 30 కుంటల భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తిరిగి పొలం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**లైంగిక వేధింపుల చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలి**

లైంగిక వేధింపుల నిరోధక చట్టం కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ యాక్ట్ 2013పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా.పి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 క్రింద పని ప్రదేశాలలో మహిళలను వేధింపులకు గురిచేయడం నేరం క్రింద పరిగణించాలని తెలిపారు.
10మంది కంటే ఎక్కువ సిబ్బంది పనిచేసే కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీలో 50శాతం మహిళలు ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కాకుండా ఫ్యాక్టరీలు,వాణిజ్య సంస్థలు, ప్రైవేటు సంస్థలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను నెల రోజుల లోపు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో రూ.50వేల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.
అనంతరం లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013కు సంబంధించిన గోడప్రతులను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారిణి వి. విజేత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, డిహెచ్‌ఈడబ్ల్యూ సమ్రీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రైతులకు కూపన్లు పంపిణీ చేసిన సర్పంచ్ హెమియా చక్రపాణి

**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం లింగన్నపాలెం, విప్పలమడక, గన్నవరం, గోవిందాపురం గ్రామాల్లో యూరియా పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుండి ఏఈవోలు ముందస్తుగా గ్రామాల్లో యూరియా కూపన్లు రైతులకి పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం వెంటనే రైతులు సొఐటీలో యూరియా తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి, వైరా మండల తహశీల్దార్ సిహెచ్.సురేష్, ఎంపిడివో బి.సక్రియ, వైరా సబ్ ఇన్స్‌పెక్టర్స్‌లు పుప్పాల రామారావు, పవన్‌లు పర్యవేక్షించారు. సోమవారం కూపన్లు ద్వారా మండలంలో 1400 యూరియా బాగ్స్ పంపిణీ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ తెలియజేశారు.
సరిపడనంత యూరియా ఉందని రైతులు కృత్రిమ కొరతను దయచేసి సృష్టిచవద్దని మండల వ్యవసాయ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లు మేడా హెమియా చక్రపాణి, రంగిశెట్టి కళావథి, చంగల పరశురాములు, కారుమంచి యేసు, వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, వాసంతి, కీర్తి, పంచాయతీ సెక్రటరీలు, గ్రామపాలన అధికారులు పాల్గొన్నారు.

## ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలి

జిల్లా అధికారులతో
సమీక్షించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఫ్లాగ్ షిప్ కార్యక్రమాల వివరాలను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ధాన్యం కొనుగోలు మొదలైన వివిధ కార్యక్రమాల అమలు వివరాలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నిర్ణీత గూగుల్ షీట్ ప్రొఫార్మలో ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను జనవరి తొమ్మిది వరకు డిస్పోజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి దరఖాస్తును అటెండ్ చేయాలని, మన పరిధిలో లేని దరఖాస్తులను సంబంధిత కార్యాలయాలకు బదిలీ చేయాలని, నిబంధనల ప్రకారం చేయలేని దరఖాస్తులను కారణాలు తెలుపుతూ తిరస్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులు పెండింగ్ పెట్టవద్దని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పి సిఈవో దీక్షా రైనా, డిఆర్డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/మధిర :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి ప్రవర్తనతో చదువుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మధిర టౌన్ ఎస్సై కిషోర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మహాదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు హెచ్‌ఎం సాధుసమాధానం అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసై నేర ప్రవర్తన కలిగి వ్యవహరిస్తున్నారని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని, అటువంటి వాటికి ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. నేరం చేసే వారు ఎంత పెద్ద వారైనా కఠినంగా శిక్షించబడతారని ఆయన అన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఓటిపిలు, ఎకేపి వంటి ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదని, అపరిచితుల నుండి వచ్చే వాట్సాప్ వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయకూడదని డిజిటల్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయాలను తల్లిదండ్రులు కూడా తెలియపర్చాలని ఆయన అన్నారు. అదేవిధంగా మైనార్టీ తీరని పిల్లలు వాహనాలను నడిపితే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశ్ రెడ్డి, టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ పురస్కారాలకు దరఖాస్తు ఆహ్వానం

**ప్రజాపక్షం/మణుగూరు :** తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ సౌత్ ఇండియన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు జనవరి. 12. 2026 నుండి జనవరి 23. 2026 జరగనున్నట్లు పురస్కారాలు నిర్వహణ కమిటీ వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొనిస్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, స్పోర్ట్స్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, యూత్ ఇండియన్ ఐకాన్ పురస్కారం,ఉమెన్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, భారత స్ఫూర్తికిరిటీ పురస్కారాం నటరాజ పురస్కారం, మహానంది పురస్కారాలకు ఆంధ్రప్రదేశ్, ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు పంపించటకు చివరి తేదీ 05 జనవరి 2026లోపు పంపించవలెను పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జనవరి 25 /1/2026 రోజున వరంగల్ లో జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8639884672 ను సంప్రదించాలని కోరారు.

## ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యశాఖ తనిఖీలు



ప్రజాపక్షం/నెక్కొండ:నెక్కొండ మండల కేంద్రంలోని ప్రయివేట్ ఆసుపత్రిని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు ఉప డిఎంహెచ్ఒ డాక్టర్ ఐ ప్రకాష్, పిఓ ఎంసిహెచ్ డాక్టర్ కె విజయ్‌కుమార్, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వసతులు, లైసెన్సులు, రికార్డుల నిర్వహణను సవివరంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించకుండా ప్రజల ప్రాణాలతో ఆడుకునే చర్యలకు తా వు లేకుండా కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. రోగులకు నాణ్యమైన వైద్యం, పారదర్శకమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రయివేట్ ఆసుపత్రులపై ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్య హక్కులను కాపాడే ది శగా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల కార్యక్రమంలో నెక్కొండ ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ తన్వీర్‌పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారు,చీఫ్ విప్‌లను కలిసిన నాయకులు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ లను కాంగ్రెస్ పార్టీ మున్నూరుకాపు నా యకుల బృందం సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిం ది. ఈ బృందంలో టిపిసిసి నాయకులు ఇ.వి. శ్రీనివాస్ రావు, చిట్ల సత్యనారాయ ణ, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, రుద్ర సంతోష్, తూము విన య్, బొమ్మ శ్రీరామ్,అల్లం భాస్కర్, ఆనంద్ రావు, రాంభూపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సమాజ నిర్మాణ కార్యక్రమాలు, మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు, సమాజ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు అంశాలతో పాటు కోకాపేటలో మున్నూరుకాపు సమాజానికి కేటాయించిన 5 ఎకరాల భూమి ల్యాండ్ స్థితిగతులపై విస్తృతంగా చర్చలు జరిపారు.ఈ అంశాలపై వారు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లి సంబంధిత జీవో జారీ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కెసిఆరే సిఎం కావాలని పాదయాత్ర



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : తెలంగాణ ఉద్యమకారుడు, వరంగల్ పశ్చిమ ని యోజవర్గానికి చెందినబిఆర్ఎస్ నాయకుడు చాగంటి రమష్ కెసిఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. అయ్యప్ప స్వామి మాల ధరించి 101 రోజులు పూర్తి అయినా సందర్భంగా ఇరుముడితో శబరిమలై బయలుదేరారు. పంబా నుంచి అయ్యప్ప సన్నిధానం వరకు చిన్న పాదంతో వెళుతున్న మార్గంలో తెలంగాణ రా ష్ట్రా నికి మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మళ్లీ భారీ మెజారిటో దాస్యం వినయ భాస్కర్ గెలుపొంది తెలంగాణ రాష్ట్రానికి మంత్రి కావాలని ఆకాంక్షిస్తూ నెత్తిన ఇరుముడితో చేతిలో ఫ్లెక్సీ తో ఇరుముడి సమర్పించేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో రుద్రోజ్ సంపత్, పలువురు అయ్యప్ప స్వాములు ఉన్నారు.

## రామప్పను సందర్శించిన రష్యా దేశస్తులు




ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామ ప్ప దేవాలయాన్ని సోమవారం రష్యా దేశానికి చెందిన ఇరినా, అమీయాలు స ందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు నిర్వహించగా అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్లు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను శిల్పకళా వైభవం గురించి టూరిజం గోరంటల విజయ్ కుమార్ వారికి వివరించగా ఆసక్తిగా తిలకించారు. వారి వెంట పురావస్తు, దేవాదాయ శాఖల సిబ్బంది టూరిస్ట్ పోలీసులు ఉన్నారు

## సమన్వయంతో పని చేసి లక్ష్యాలను చేరుకోవాలి



ప్రజాపక్షం/జనగామ: జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెట్టేలా ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజన అమలుపై సెంట్రల్ నోడల్ ఆఫీసర్ పురుషార్థ, (ఐఎఎస్) సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రూపొందించిన 6 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక మండల స్థాయిలో లక్ష్యాల సాధనపై సమీక్ష జరిపా రు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి, నీటి యాజమాన్యం, వ్యవసా య రంగంలో సాంకేతికత అభివృద్ధి గురించి చర్యలు చేపట్టాలని సూచించా రు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ పిఎమ్‌డిడికెవై అమలులో జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెట్టేలా ప్రతి శాఖ సమన్వయంతో పని చేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మత్స్యశాఖ, వ్యవసాయ,పశుసంవర్ధక శాఖాదికారు లు పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్, సహకార వి భాగం, భూగర్భ జలాలు, పౌర సరఫరాలు, నీటి పారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఏజెన్సీమండలాలను వదలను అంటున్న పొగ మంచు



పజాపక్షం/గూడూరు/కొత్తగూడ;గత మూడు రోజులగా మహబూబాబాద్ జిల్లా గూడూరు కొత్తగూడ గంగారం తదితర ఏజెన్సీ మండలాలను పొగ మంచు వదలను అంటుంది .ఉదయ ం 10 అయినాపొగ మంచు తో రహదారుల ప్రయాణించే ప్రయాణికులు భయం భయంతో ప్రయాణాలు చేస్తున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇదే పొగ మంచు ఉంటుండగా ముఖ్యంగాగూడూరు గం గారం కొత్తగూడ మండలాల నుండి మేడారం వెళ్లే ప్రయాణికులకు ఉదయం పూట ప్రయాణాలు ఇబ్బందికరంగా మారాయి.ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాహనాలను డ్రైవ్ చేసేవారు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాల నడపాలని టు వీలర్ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా ఉండాలనిఅన్నారు.వాహనాలుసైతంఎక్కువస్పీడువెళ్లకుండాచూసుకోవాలని అన్నారు.

త్వరితగతిన

# ప్రజావాణి వినతుల పరిష్కారం

అర్జీలు పెండింగ్‌లో ఉండొద్దు * హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్






ప్రజాపక్షం/హనుమకొండ: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను సత్వర చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిష్కార స్వభావాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రిమార్కులు లేకుండా దరఖాస్తులను క్లోజ్ చేయరాదన్నారు. అర్జీలు అధికశాతం పెండింగ్‌లో ఉన్న తహశీల్దార్లు, గ్రేటర్‌వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలు పరిష్కానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. నలబై సంవత్సరముల పైబడిన, నలభై సంవత్సరముల లోపు వయస్సు కలిగిన వారి కుటుంబ సభ్యుల వివరాలతో 2002 ఓటర్ల జాబితా 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 153 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కన్నం నారాయణ, జిల్లా గ్రా మీణాభివృద్ధి అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ**

ప్రభుత్వ వసతి గృహాలను ప్రత్యేకాధికారులు నెలలో రెండు సార్లు తప్పని సరిగా తనిఖీ చేయాలని, టీచర్లు లేకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వినాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టె (కంప్లైంట్ బాక్స్) తప్పనిసరిగా ఉండాలని దానికి సంబంధించిన తాళం ప్రత్యేక అధికారి వద్ద మాత్రమే ఉండాలన్నారు. వసతి గృహాల్లో హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాల్లో ప్రధానంగా విద్యా, ఆరోగ్యం, శానిటేషన్ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. వసతి గృహాల తనిఖీ సందర్భంలో మండల ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి బోజనం చేయాలన్నారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు.

## మానుకోటకు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాపక్షం/మహబూబాబాద్:భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో సిపిఐ మహబూబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జనవరి 7 భారతదేశంలో కమ్యూనిస్టుల ఐక్యత నేటి ఆవశ్యకత అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి తెలిపారు. ఈ సెమినార్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ వేదికగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, ఈ బహిరంగ సభ జయప్రదానికై అన్ని ప్రాంతాల్లో సెమినార్లు నిర్వహిస్తున్నట్లు విజయ సారధి తెలిపారు. భారత దేశంలో కమ్యూనిస్టుల చరిత్ర గొప్పదని దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది కమ్యూనిస్టులే సిపిఐ అన్నారు. దోపిడీ లేని సమాజం కొరకు సిపిఐ ఉద్యమిస్తుందని రానున్న కాలంలో ఫాసిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్న ప్రజలందరినీ ఐక్యత చేసి ముందుకు పోతామని తెలిపారు పెద్ద సంఖ్యలో పాల్గొని సెమినార్ జయప్రదం చేయాలని తెలిపారు.

## హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించాలి



ప్రజాపక్షం / చెన్నారావుపేట : హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గుంపెల్లి మునీశ్వరుడు డిమాండ్ చేశారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో ఎస్‌బ్ల్యుసి గోదావరి జరిగిన హమాలీ కార్మికులు సమావేశం సాంబయ్య అధ్యక్షత సోమవారం నిర్వహించారు. ఈ సందర్బంగా గుంపెల్లి మునీశ్వరుడు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ఎలాంటి కార్మిక చట్టాలు లేకుండా కేవలం తమ రెక్కల కష్టాన్ని నమ్ముకొని బ్రతుకుతున్నారని కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి సహించరానిదని ఇప్పటికైనా హమాలీ కార్మికుల కోసం పార్లమెంటులో సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించి ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ డబ్ల్యా సి గోదాంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని కార్మిక శాఖ అధికారులను కోరారు. హమాలి కార్మికులు సుధాకర్, రాజు, కుమార్, లక్క కుమారస్వామి పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు




ప్రజాపక్షం / వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిరక్షణకు, కార్మికుల అభివృద్ధికి సంక్షేమానికి రానున్న బడ్జెట్ లో చేనేత రంగానికి 2000 కోట్ల రూపాయలు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ కొత్తవాడలో చేనేత కార్మిక పరపతి సంఘం రూపొందించిన 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండ చేనేత క్యాలెండర్ ను పంపిణీచేస్తున్న పాలకమండలిని ఆయన అభినందించారు. పాలకులు మారిన నేతన్నల తలరాతలు మారలేదని వారి బ్రతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంబుగా ఉందని అందుకు పాలకుల బడా కంపెనీల కొమ్ము కాసే విధానాలే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే చేనేతపై జిఎస్టి రద్దుచేయాలని,రద్దు చేసిన చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. 12 సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించనందున చేనేత వ్యవస్థ చిన్నాభిన్నమైందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు, టెస్కో పాలక మండలికి ఎన్నికలు జరపాలన్నారు. ఇండ్లు లేని నేతన్నలకు గృహ నిర్మాణంతో పాటు వర్క్ షెడ్స్ నిర్మించాలని, చేతినిండా పని కలిగించి నిత్యావసర వస్తువులధరల పెరుగుదల కనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని, కార్మికుల పెన్షన్ రూ.6 వేలకు పెంచిఅర్హులైన భార్యాభర్తలందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘంఅధ్యక్షులు కూచన సారయ్య, ప్రధాన కార్యదర్శి లింగబత్తిని రామకృష్ణ, బొద్దుల బిక్షపతి, బాసబత్తిని శంకరయ్య, పెండ్యాల రాజేంద్రచారి ,శంకర్,ప్రశాంత్ ,పుణ్యవతి,రాధ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి :ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 47 దరఖాస్తులు స్వీకరించి, వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం శాఖలు వారిగా 350 ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ వచ్చే వారంలోపే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారని, అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.చాలా శాఖల్లో పెండింగ్ అధికంగా ఉందని, దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 47 దరఖాస్తులు స్వీకరించి, వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం శాఖలు వారిగా 350 ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ వచ్చే వారంలోపే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారని, అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. చాలా శాఖల్లో పెండింగ్ అధికంగా ఉందని, దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్‌డిఓ , శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


## మున్సిపాలిటీ ఓటర్ల ముసాయిదా లోపాల సవరణ



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ మున్సిపల్ 1నుండి 36 వార్డుల్లో ఓటర్ల ముసాయిదా లోపాలను తప్పులను తక్షణమే పరిశీలించి సరిచేయాలని కాంగ్రెస్, సిపిఐ బిఆర్ఎస్,సిపిఎం,బిజెపి,టిడిపి టిడిపి ఆధ్వర్యంలో కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నేతలు ఘనపురపు అంజయ్య బి అజయ్ సారధి రెడ్డి మారినేని వెంకన్న సూర్ణపు సోమయ్య క్యాచ్వల్ శ్యాంసుందర్ శర్మ బొమ్మ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రూపొందించిన మున్సిపల్ ఓటర్ల ముసాయిదా జాబితాలో స్పష్టంగా పెద్ద ఎత్తున లోపాలు తప్పులు ఉన్నాయని వీటిలో వెంటనే సరి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని నిర్దేశించిన వార్డు భౌగోళిక హద్దుల పరిధిలోనే ఇట్టి సంబంధిత ఓటర్లను ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.సంబంధంలేని వార్డుల నుండి వచ్చిన ఓట్లను పరిశీలన, విచారణ చేసి సంబంధిత వాస్తవ వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కమీషనర్‌ను డిమాండ్ చేశారు . పలు సూచనలతో కూడిన వినతి ప్రత్రాన్ని మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్వరరావుకి అందించారు ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, నీరుటి సురేష్ నాయుడు, ఎండి ఫరీద్, భానోత్ సీతారాం, పల్లె సందీప్, పిబి రామారావు, పాల్గొన్నారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల వినతి పత్రం ఇవ్వగా స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 10లోగా వార్డుల్లో సమగ్రంగా సర్వే నిర్వహించి లోపాలను తప్పులను సరిజేస్తామని తెలిపారు.

## ఎక్స్‌ప్రెస్ పేరే గానీ...సేవలు ప్యాసింజర్ కన్నా దారుణం!

ప్రయాణికులను అవస్థలకు గురిచేస్తున్న రైల్వే అధికారుల నిర్లక్ష్యం




ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా రైల్వే ప్రయాణికులకు మరోసారి రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. భద్రాచలం రోడ్డు మణుగూరు నుండి సికింద్రబాద్‌కు వెళ్లే కాకతీయ ఎక్స్‌ప్రెస్ విషయంలో చోటు చేసుకున్న సంఘటన రైల్వే అధికారుల తీరున హాస్యాస్పదంగా మార్చింది. గతంలో ప్యాసింజర్ రైలుగా నడిచిన ఈ రైలుకు కేవలం పేరు మాత్రమే ఎక్స్‌ప్రెస్‌గా మార్చి ప్రయాణికుల నుండి మాత్రం ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తూ, సేవల విషయంలో మాత్రం ప్యాసింజర్ కన్నా కూడా అధ్వాన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇది రైల్వే శాఖ ప్రజా వ్యతిరేక ధోరణికి నిదర్శనంగా నిలుస్తోంది. వరంగల్ నుండి భద్రాచలం రోడ్డు మణుగూరు వెళ్లే రైలు చింతలపల్లి, ఏలూరు, నెక్కొండ స్టేషన్లలో మొదటి నెంబర్ ప్లాట్‌ఫారంలో ఆగుతుందని డిసెంబర్ 3 శనివారం రాత్రి రైల్వే యాప్‌లలో, అధికారిక సమాచారం ద్వారా ముందస్తుగా ప్రకటించారు. అయితే, తీరా రైలు వచ్చే సరికి చింతలపల్లి, నెక్కొండ స్టేషన్లలో రెండవ నెంబర్ ప్లాట్‌ఫారానికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా నెక్కొండ స్టేషన్‌లో మొదటి నెంబర్ ప్లాట్‌ఫారం ఖాళీగా ఉన్నప్పటికి, అధికారుల నిర్లక్ష్యంతో రెండవ నెంబర్‌కు రైలు తీసుకురావడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు..ఇది ప్రయాణికుల భద్రతపై, సౌకర్యాలపై నిర్లక్ష్యం, యాప్‌ల ద్వారా ముందస్తు సమాచారం ఇచ్చి మోసం చేసిన తీరు, ఇది ప్రజల డబ్బుతో నడిచే రైల్వే బాధ్యతారాహిత్యం, ఎక్స్‌ప్రెస్ చార్జర్ వసూలు చేస్తూ, ఆ స్థాయి సేవలు ఎందుకు ఇవ్వరు? ముందస్తు సమాచారం ఇస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడితే బాధ్యులు ఎవరు? అర్థరాత్రి ప్రయాణికులు అవస్థలకు జవాబు ఎవరిది ఎవరు బాధ్యులు? ఈ ఘటనపై రైల్వే అధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనే ఉంది. ఇందుకోసం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రజాపక్షం డిమాండ్ చేస్తుంది. ప్రయాణికుల సహనాన్ని పరీక్షించే నిర్లక్ష్య ధోరణిని సహించబోరని, రైల్వే ఉన్నతాధికారులు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మేడారం జాతరకు గవర్నర్‌కు ఆహ్వానం



ప్రజాపక్షం/ములుగు: నెల 28 నుండి 31వ తేదీ వరకు జరుగు శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, గిరిజన పూజారులు రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మను కోరారు. సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈఓ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ

2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్ఐ



ప్రజాపక్షం/రేగొండ :ఉమ్మడి రేగొండ మండలం లోని కొత్త పల్లి గోరి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజా పక్షం 2026 నూతన క్యాలెండర్ ను గోరి కొత్తపల్లి మండలం ఎస్సై దివ్య, గ్రామ సర్పంచ్ నిమ్మల శంకర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్రిక లు సమాజంలో ముఖ్య భూమిక ను పోసిస్తాయి అని ప్రజలుకు, ప్రతి పక్షాల కు అనుకూలంగా ఉండి సమస్య లపై స్పందిచాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రజాపక్షం రిపోర్టర్ అంబాల రవీందర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మైనారిటీ మహిళా యువజన పథకానికి దరఖాస్తులు

జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఏ కుమారస్వామి

ప్రజాపక్షం/భూపాలపల్లి :తెలంగాణ రాష్ట్రంలో మైనారి టీల సంక్షేమం కోసం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచిన ఇందిరమ్మ మై నారిటీ మహిళ యువజన పథకం అలాగే రేవంతన్న సహారా మిస్కినుకే లియో కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎ.కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం మైనారిటీ (ముస్లింలు, సిక్కులు, బుద్ధులు, జైనులు పార్సీలు) మహిళలు (వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాథలు, అవివాహిత మహిళలు అర్హులని పేర్కొన్నారు. వ్యాపారాన్ని స్థాపించడానికి వారికి సాధికారత కల్పించడానికి ఉపాధి కల్పన లక్ష్యాన్ని సాధించడానికి వారికి స్వయం స్థిరత్వాన్ని కల్పించడానికి ఒకేసారి గ్రాంట్ ద్వారా ఆర్థిక సహాయం యూనిట్ కు రూ.0.50 వేల వరకు (సుమారుగా) అందించడం జరుగుతుందన్నారు. రేవంతన్నా సహారా మిస్కీల కోసం" పథకం కోసం జిల్లాలోని ఫకీర్ / దూదేకుల / ఇతర దుర్బల ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు / బైక్ లు / ఈ బైకులను పంపిణీ చేయాలని ప్రతిపాదించిందని,.యూనిట్ కు రూ.1.00 లక్ష (సుమారుగా) చొప్పున పంపిణీ చేయాలని ప్రతిపాదించిందని పేర్కొన్నారు. అర్హత ఆసక్తిగల వారు దరఖాస్తు , http://tgobmmsnew.cgg.gov.in : 05012026 3 4. 10.30 నుండి తేదీ 10 01 2026 రాత్రి 11:59 వరకు దరఖాస్తులు నమోదు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 6302523278, 7337396427 సంప్రదించాలన్నారు.

# ముంబై కెప్టెన్‌గా అయ్యర్..



స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయాస్ అయ్యర్ మైదానంలోకి దిగనున్నాడు. అది కూడా కెప్టెన్‌గా. ఈమధ్యే కోలుకున్న అయ్యర్ దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ సారథిగా ఎంపికయ్యా. వన్డే ఫార్మాట్లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో తదుపరి మ్యాచ్‌లకు అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సోమవారం ముంబై క్రికెట్ సంఘం తెలిపింది. సిడ్నీ వన్డేలో గాయంతో ఆటకు దూరమైన శ్రేయాస్ అయ్యర్.. సర్జరీ తర్వాత వేగంగా కోలుకున్నాడు. ఇటీవలే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ చాటుకొని న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే.. బిసిసిఐ నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ చాటుకుంటేనే జాతీయ జట్టుకు ఆడే అవకాశం ఉన్నందున దేశవాళీ టోర్నీలో ఆడేందుకు సిద్ధమయ్యాడీ స్టార్ బ్యాటర్. సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ గాయపడడంతో అయ్యర్‌కు ముంబై సారథ్యం అప్పగించింది. 'ముంబై సీనియర్ టీమ్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ నియమితులయ్యాడనే విషయాన్ని మీతో పంచుకోవడం సంతోషంగా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై అయ్యర్ సారథ్యంలోనే తదుపరి మ్యాచ్‌లు ఆడనుంది' అని ఎంసిఎ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం గ్రూప్ సీ నుంచి రెండో స్థానంలో ఉంది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో, జనవరి 8న పంజాబ్‌తో ముంబై తలపడనుంది.

**జనవరి 11న బరోడాలో**

రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో, ఆపై ఛాంపియన్స్ ట్రోఫీలో మెరిసిన అయ్యర్‌ను న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు తీసుకున్నారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 11న బరోడాలో జరగనున్న తొలి వన్డేలో కివీస్‌తో టీమిండియా తలపడనుంది.

# ముస్తాఫిజుర్ ఎఫెక్ట్.. బంగ్లాదేశ్‌లో ఐపిఎల్ బ్యాన్..



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి నేపథ్యంలో భారత్‌బంగ్లా మధ్య వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐపిఎల్ టీం నుంచి బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ ను తొలగించాలని బిసిసిఐ ఆదేశించింది. దీంతో బంగ్లాభారత్ మధ్య సంబంధాలు మరింత దిగజారుతున్నాయి. ముస్తాఫిజుర్ ను తొలగించినందుకు నిరసనగా.. బంగ్లాదేశ్ లో ఐపీఎల్ పై నిషేధం విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో ఐపిఎల్ ప్రసారాలతోపాటు, ప్రచారం కూడా చేయకూడదు. ఈ మేరకు బంగ్లా ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇటీవల మినీ వేలంలో ముస్తాఫిజుర్ ను కోల్ కతా జట్టు రూ.9.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా పలువురు కేకేఆర్, బిసిసిఐపై విమర్శలు చేశారు. ఒక పక్క బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు జరుగుతుంటే.. ఆ దేశానికి చెందిన క్రీడాకారుడిని ఐపీఎల్ టీంలోకి తీసుకోవడంపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శించారు. దీంతో స్పందించిన బిసిసిఐ అతడిని తొలగించాలని కేకేఆర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని చెప్పింది. దీంతో ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీనిపై బంగ్లా క్రికెట్ బోర్డ్ (బిసిబి) ఆగ్రహం వ్యక్తం చేసింది. బిసిసిఐ నిర్ణయం బంగ్లా ప్రజల్ని ఆగ్రహానికి, విస్మయానికి గురి చేసిందని తెలిపింది. ఇలా చేస్తే.. ఇండియాలో జరగబోయే టీ20 వరల్డ్ కప్‌లు తమ జట్టు పాల్గొనబోదని, తమ జట్టు ఆడే మ్యాచుల వేదికలు ఇండియా నుంచి మార్చాలని ఐసిసిని కోరింది. తమ క్రికెటర్ల భద్రత రీత్యా తమ ఆటగాళ్లను ఇండియా పంపించకూడదని నిర్ణయించుకున్నట్లు బిసిబి తెలిపింది. ఈ అంశంపై త్వరలోనే ఐసిసి చర్చించనుంది. ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్.. ఇండియాలో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఒకవేళ బిసిబి కోరినట్లు ఇండియా నుంచి వేదికలు మారిస్తే.. శ్రీలంకలో ఆడే ఛాన్స్ ఉంది.



# రూట్.. శతక మోత

## ఆస్ట్రేలియాను ఆదుకున్న హెడ్!

యాషెస్ సిరీస్‌లో చివరిదైన సిడ్నీ టెస్టులో ఆస్ట్రేలియా ధీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్(160) భారీ శతకంతో ఇంగ్లండ్ సవాల్ విసిరినా.. పేసర్ నెసెర్(4–60) విజృంభణతో ప్రత్యర్థిని నాలుగొందల లోపే కట్టడి చేసింది. అనంతరం ట్రావిస్ హెడ్ (91 నాటౌట్) విధ్వంసక అర్ధశతకం బాదేయగా.. మార్నస్ లబూషేన్(48) క్రీజులో నిలబడ్డాడు. వీరిద్దరి జోరుతో పటిష్ట స్థితిలో నిలిచిన స్మిత్ సేన తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 218 పరుగులు వెనకబడి ఉంది సిడ్నీ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ భారీ స్కోర్ చేయగా.. ఆస్ట్రేలియా కూడా తగ్గేదేలే అన్నట్టుగా ఆడుతోంది. ఓపెనర్ ట్రావిస్ హెడ్(91 నాటౌట్) మెరుపు అర్ధ శతకంతో ఆసీస్ పుంజుకుంది. రెండో రోజు ఆట ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. అంతుకుముందు దాంతో.. ఓవర్‌నైట్ స్కోర్ 211–3తో రెండో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టు 384కే ఆలౌటయ్యింది. మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోవడంతో తొలిసారి ఆలౌట్ గండం తప్పించుకున్న ఇంగ్లండ్‌ను నెసెర్(4–60) దెబ్బకొట్టాడు. జో రూట్(160), వికెట్ కీపర్ జేమీ స్మిత్(46)ల మెరుపులతో నాలుగొందల దిశగా వెళ్తున్న పర్యాటక జట్టు తోకను ఈ ఆసీస్ పేసర్ కత్తిరించాడు.

**ఇద్దరు నిలబడడంతో..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ సిడ్నీ టెస్టులో తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు లేమి కారణంగా 45 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా పర్యాటక జట్టు మిడిలార్డర్ బ్యాటర్లు క్రీజునంటుకుపోయారు. ఓపెనర్లు బెన్ డకెట్(27), జాక్ క్రాలే(16)లు శుభారంభమిచ్చినా స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. కాసేపటికే బొలాండ ఓవర్లో జాకబ్ బెథెల్(10) ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన జో రూట్, హ్యారీ బ్రూక్ ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. 57కే మూడు కీలక వికెట్లు పడిన వేళ వీరిద్దరూ ఏకొంచెం తడబడినా, ఒక చెత్త షాట్ ఆడినా ఇంగ్లండ్ ఆలౌటయ్యేది. కానీ, వీరు ఆస్ట్రేలియా బౌలర్ల వ్యూహాలను చిత్తు చేస్తూ రూట్, బ్రూక్ అర్ధ శతకాలతో స్కోర్ 200 దాటించారు.

# యువతరంగం


కొత్త సంవత్సరం యువతకు అవకాశాలతో పాటు సవాళ్లను కూడా తీసుకొచ్చిన కీలక దశగా నిలుస్తోంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో యువత కేవలం ఉద్యోగాల కోసం సిద్ధపడే వర్గంగా కాకుండా, సమాజాన్ని దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉంది.




సాంకేతిక పురోగతి, ఆర్థిక మార్పులు, సామాజిక అసమానతలు, పర్యావరణ సంక్షోభం వంటి అంశాలు యువతపై కొత్త బాధ్యతలను మోపుతున్నాయి. కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటలైజేషన్ వంటి అంశాలు ఉద్యోగ రంగాన్ని వేగంగా మార్చేస్తున్నాయి. సంప్రదాయ ఉద్యోగాలు తగ్గుతూ, నైపుణ్యాధారిత పనులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో యువత జీవితాంతం నేర్చుకునే దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఒక డిగ్రీ లేదా ఒక నైపుణ్యంతోనే జీవితాన్ని నిర్మించుకోవడం ఇక సాధ్యం కాదు. కొత్త సాంకేతికతలను అర్థం చేసుకోవడం, మార్పులకు తగినట్లుగా తాము మారడం యువత ముందున్న తొలి బాధ్యత.

**ఉపాధి.. ఆర్థిక స్వావలంబన**

యువత 2026లో ఎదుర్కొనే ప్రధాన సవాల్ ఉపాధి. గిగ్ ఎకానమీ, ఫ్రీలాన్సింగ్, స్టార్టప్ సంస్కృతి అవకాశాలను పెంచుతున్నప్పటికీ, ఉద్యోగ భద్రత తగ్గుతోంది. ఈ నేపథ్యంలో యు వత స్వయం ఉపాధి, ఆవిష్కరణలు, వ్యాపార దృక్పథం వైపు అడుగులు వేయాలి. కేవలం ఉద్యోగం కోరుకునే వ్యక్తులుగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే నాయకులుగా మారడం కాలం కోరుతున్న పని. ఆర్థిక అవగాహన, సేవింగ్స్, పెట్టుబడులు వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం కూడా యువత బాధ్యతగా మారింది. యువత శక్తి సమాజాన్ని మార్చగల శక్తి. కానీ ఆ శక్తి సరైన దిశలో ఉపయోగించబడినప్పుడే ఫలితం ఉంటుంది. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కులు వంటి అంశాలపై చైతన్యంతో ఉండటం ఈ ఏడాది యువతకు కీలక పని. కుల, మత, లింగ వివక్షలకు వ్యతిరేకంగా నిలబడటం, అణగారిన వర్గాల గొంతుకగా మారడం యువతపై ఉన్న సామాజిక బాధ్యత. సోషల్ మీడియా వంటి వేదికలను ద్వేషానికి కాకుండా, అవగాహన మరియు ఐక్యత కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా, ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే యువత చురుకైన పౌరులుగా మారాలి. ఓటు హక్కును కేవలం హక్కుగా కాకుండా బాధ్యతగా భావించాలి. ప్రభుత్వ విధానాలపై అవగాహన పెంచుకోవడం, ప్రశ్నించడం, చర్చించడం, అవసరమైతే శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం యువత కర్తవ్యంగా మారింది. 2026లో రాజకీయ నిర్లక్ష్యం కాదు, చైతన్యమే యువత లక్షణంగా ఉండాలి.



**పర్యావరణ పరిరక్షణ.. భవిష్యత్తు కోసం పోరాటం**

వాతావరణ మార్పులు, నీటి కొరత, కాలుష్యం వంటి సమస్యలు యువత భవిష్యత్తునే ప్రశ్నిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ ఇక ఎంపిక కాదు, తప్పనిసరి బాధ్యత. స్థిరమైన జీవన విధానం, పునర్వినియోగం, పర్యావరణ హిత ఆలోచనలు యువత జీవనశైలిలో భాగం కావాలి. చిన్న చర్యలే అయినా, అవి పెద్ద మార్పులకు దారి తీస్తాయన్న అవగాహన యువతలో అవసరం.

**మానసిక ఆరోగ్యం.. మానవ సంబంధాలు**

పోటీ, ఒత్తిడి, అనిశ్చిత భవిష్యత్తు యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. విజయమే జీవితం అన్న భావన నుం చి బయటపడి, సమతుల్య జీవనాన్ని అలవర్చుకోవడం యువత ముందున్న ముఖ్యమైన పని. మానసిక ఆరోగ్యాన్ని బలహీనతగా కాకుండా, జీవన భాగంగా అంగీకరించాలి. కుటుంబం, స్నేహాలు, సామాజిక సంబంధాలకు విలువ ఇవ్వడం ద్వారా మాత్రమే సమగ్ర వ్యక్తిత్వం ఏర్పడుతుంది. నేటి యువత కేవలం రేపటి నాయకులు మాత్రమేకాదు, ఈ రోజునే మార్పును నడిపించే శక్తులు కూడా. వ్యక్తిగత లక్ష్యాలను సామాజిక బాధ్యతలతో మేళవించగలిగినప్పుడే యువత నిజమైన శక్తిగా మారుతుంది. నేర్చుకోవడం, ప్రశ్నించడం, సృష్టించడం, సమాజం కోసం నిలబడటం. ఇవీ యువత ముందున్న అసలైన పనులు. ఈ బాధ్యతలను యువత స్వీకరించిన నాడు, భవిష్యత్తు మాత్రమే కాదు, వర్తమానమూ మారుతుంది.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు


## సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



**ప్రజాపక్షం/తాండూరు :** జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కార్యచరణ నిర్మించుకుని ఉద్యమాలు చేద్దామని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తెలపారు. సిపిఐ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. సోమవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావించి వంద వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే భారీబహిరంగ సభకు వికారాబాద్ జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ అభిమానులు, ప్రజా సంఘాల నాయకులను విజయలక్ష్మి పండిత్ కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పీర్ ముహ్మమద్, నాయకులు రవీందర్, వెంకటేష్, అనంతయ్య, అబ్దుల్లా, మునీర్ అహ్మద్, సురేష్‌కుమార్, బాబు, సుదర్శన్, పుష్ప, ఖాదర్, రాకేష్, జయప్ప, యేసయ్య పాల్గొన్నారు.

# పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటాలు

## సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పోరాటాలు చేసి సాధించిన హనుమాపురం గ్రామంలో సర్వే చేసి నిర్ధారించిన మిగులు ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 28లో 76 ఎకరాలు అర్హులైన నిరుపేదలకు పట్టాలు చేసి పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ భువనగిరి మండల, పట్టణ కమిటీ సమావేశం సోమవారం పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో చింతల పెంటయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో యానాల మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో సుమారు ఐదు వేల మంది ప్రజలు అద్దె ఇండ్లలో ఉండి కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, ఐదు సంవత్సరాలుగా సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు, ఏషాల అశోక్, దాసరి లక్ష్మయ్య, నాగపురి యాదగిరి నాయకత్వంలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. పట్టాలు ఇచ్చేంతవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఈనెల 18న జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాలకు జిల్లా నుంచి ఐదు వేల మందిని సమీకరించి ఖమ్మం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, సిపిఐ మండల పట్టణ కార్యదర్శులు దాసరి లక్ష్మయ్య, పుట్ట రమేష్, చొప్పరి సత్తయ్య, కోట శంకర్, బద్దం వెంకటరెడ్డి, చింతల మల్లేష్, ముదిగొండ ఠాగూర్, వడి శ్రీను, మరిపెల్లి ఎల్లయ్య, కూరాకుల అబ్బులు, ఘనబోయిన వెంకటేశం పాల్గొన్నారు.

# అమెరికా నిరంకుశ చర్యలు వ్యతిరేకించాలి

## ప్రపంచ శాంతి కోరుకునేవారికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపు

**ప్రజాపక్షం/వరంగల్ :** వెనుజులాపై అమెరికా అత్యంత పాశవీకంగా దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను బంధించి న్యూయార్క్ తీసుకురావడం దారుణమని, ఇలాంటి చర్యలను ప్రపంచ శాంతి కోరుకునే ప్రతిఒక్కరు తీవ్రంగా ఖండించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వరంగల్ జిల్లాకేంద్రంలోని శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సిపిఐ వరంగల్ జిల్లా విస్తృత సమావేశం ఎండి అక్బర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, అధ్యక్షుడు నికోలస్ మదూరో, ఆయన కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెనిజులాపై అమెరికా దాడిని తాము వ్యతిరేకిస్తున్నామని, ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని ఆయన అన్నారు. వెనిజులాలో ఆయిల్ సంపదను అమెరికా వశం చేసుకోవాలని చూస్తున్నదని, ఆ దేశ సహజ వనరులను కొల్లగొట్టే అధికారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లేదన్నారు. అమెరికా నిరంకుశ చర్యలను భారత దేశం వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.




## సామ్రాజ్యవాదం విస్తరణలో భాగమే వెనిజులాపై దాడి : బాలనర్సింహ్మ

**నాగర్‌కర్నూల్ :** వెనిజులా దేశ సార్వభౌమత్వాన్ని హరించే విధంగా, అధ్యక్షుడు నికోలస్ మధురో, ఆయన కుటుంబ భద్రతకు ముప్పుగా మారిన అమెరికా సైనిక చర్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ తీవ్రంగా ఖండించారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం విస్తరణలో భాగమే వెనిజులాపై అమెరికా దాడి అన్నారు. ట్రంపు ప్రధాన ఉద్దేశ్యం వెనిజులాలో ఉన్న చమురు ఉత్పత్తులను స్వాధీనం చేసుకోవడమేగాని డ్రగ్స్ ఆరోపణలు నిజం కావని, ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరం ఖండించాల్సిందేనన్నారు. ఇప్పటివరకు దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హమన్నారు. కేంద్రప్రభుత్వం దేశంలో కొనసాగిస్తున్నటువంటి ఆపరేషన్ కగార్ రాజ్యాంగానికి విరుద్ధమని, మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించిన కూడా మావోయిస్టులను చంపడం అన్యాయ మన్నారు. దీనివెనుక అసలు కారణం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అడవులలో ఉన్న విలువైన ఖనిజసంపదను మోదీ తన మిత్రులైన ఆదాని, అంబానిలకు అప్పగించడం అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగసభకు జిల్లా నుంచి అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి బొల్లెద్దుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు టి.నర్సింహ్మ, ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిరమ్మ, కౌన్సిల్ సభ్యులు తుమ్మలశివుడు, రవీందర్, బండి లక్ష్మిపతి, శివశంకర్, మర్యాద వెంకటయ్య, కిరణ్‌కుమార్, పరుషరాములు, గోపాల్, శ్రీను, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.




## రైతులను దోచుకున్న వారిపై చర్యలు తీసుకోకపోతే

# ఉద్యమం ఉధృతం చేస్తాం

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి బిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్ల సందర్భంగా తరుగు పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరిగిందని ఆధారాలతో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, కోట్లల్లో జరిగిన ఈ దోపిడీపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు కొంతమంది సహకారంతో జరుగుతున్న ఈ అక్రమాలపై విచారణ జరిపి భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తరుగు పేరుతో పెద్దఎత్తున ధాన్యం దోచుకుంటున్న విషయాన్ని ఒకరిపై ఒకరు నెపం మోపుకుంటూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. వందల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో తమ పార్టీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ కూనంనేని సాంబశివరావు ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాలుగైదేళ్లుగా ధాన్యం కొనుగోళ్లలో ఏదో రకంగా రైతులు మోసపోతున్నా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శించారు. అవకతవకలకు భాద్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తరుగు పేరుతో అదనంగా దోచుకున్న ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల తరఫున జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని భిక్షపతి హెచ్చరించారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఎదునూరి వెంకట్రాజం, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, మునిగాల భిక్షపతి, కొట్టే వెంకటేష్ , కుడిస్వామి, మునిగాల స్వామి, స్వరూప దేవరకొండ కొమురయ్య , బద్రుంబి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.




# హక్కుల రక్షణకు పోరాటాలు

## సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలిరండి

## సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగసభకు వేలాదిగా ప్రజలు, కమ్యూనిస్టు శ్రేణులు తరలిరావాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో పార్టీ నాయకులతో కలసి బహిరంగసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ దేశంలో నాడు స్వాతంత్ర్యోద్యమం నుండి నేటివరకు ప్రజల కోసం ఉద్యమించిన సిపిఐ వందేళ్ల ఉత్సవాలను జరుపుకోవటం గర్వకారణమన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ అని, కార్మిక, రైతు, మహిళ, విద్యార్థి, యువజన హక్కుల కోసం నిరంతరం సిపిఐ పోరాడుతుందన్నారు. సమావేశం లో సిపిఐ జిల్లా నేతలు కనుకుంట్ల శంకర్, కొమ్ముల భాస్కర్, బట్టు దయానంద్‌రెడ్డి. ఎడల వనేశ్, అందె అశోక్, కిష్టపురం లక్ష్మణ్, జెర్రిపోతుల జనార్దన్, రజని, బన్సిలాల్, ఎస్కె హరీఫ్, మిట్టపల్లి సుధాకర్, బోనగిరి రూపేశ్, శివలింగం ,కృష్ణ, సుదర్శనచారి, రంగారెడ్డి, రాజేశం. సంగెం మధు. రామగళ్ల నరేష్, కర్నాల చంద్రం. బంక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## హత్యకేసులో నిందితుడికి మరణ శిక్ష

### నిజామాబాద్‌లోకోర్టు సంచలన తీర్పు

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్‌లో హత్యకేసులో జిల్లా న్యాయస్తానం సంచలన తీర్పును సోమవారం వెలువరించింది. హత్య కేసులో ప్రధాన నిందితుడికి మరణ శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డి. దుర్గాప్రసాద్ తీర్పు ఇచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సందీప్, నాగారంకు చెందిన సతీష్ గౌడ్‌లు స్నేహితులు, వీరి మధ్య ఆటో విషయంలో గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న సతీస్ గౌడ్, సందీప్‌ని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం గత సంవత్సరం ఫిబ్రవరి 15,2025న సతీష్ గౌడ్, సందీప్‌ను ఇందల్వాయికి తీసుకువెళ్ళి, ఇద్దరు మద్యం సేవించి అనంతరం సందీప్‌ను పెట్రోల్‌పోసి తగులబెట్టాడు. అనంతరం సతీష్ గౌడ్ ఆటో తీసుకొని పారిపోయాడు. ఈ క్రమంలో ఐదవ టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సతీష్ గౌడ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈకేసును విచారించిన నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, 238 బిఎస్ఎన్ ప్రకారం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, 307 బిఎస్ఎన్ కింద ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 103 బిఎస్ఎన్ కింద 10 వేల రూపాయలు, మరణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు అని సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## మైనర్ డ్రైవింగ్ ప్రాణసంకటం

### జిల్లా రవాణా శాఖ అధికారి గోపికృష్ణ



**ప్రజాపక్షం/ మంచిర్యాల :** మైనర్ డ్రైవింగ్ ప్రాణసంకటమని, దీనికి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా రవాణా శాఖ అధికారి గోపికృష్ణ హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026 సందర్భంగా సోమవారం మంచిర్యాల పట్టణం గోదావరి రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో వి ద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కొత్త చట్టం ప్రకారం వాహనం సీజ్ చేస్తారని తెలిపారు. పాఠశాల బస్సులు నడిపే సమయంలో క్రమశిక్షణ పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే రహదారి నిబంధనలు పాటిస్తూ ఇళ్లలో రోడ్డు సేఫ్టీ అంబాసిడర్లుగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డీన్ నాగేశ్వర్ రావు, జోనల్ పిటి రాజేందర్, ఎఓ వికాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.పాఠశాల చైర్మన్ మాంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఎజిఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు అభినందనలు తెలిపారు.

## సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**ప్రజాపక్షం/ హాజీపూర్ :** వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం హాజీపూర్ మండలం రాపల్లి ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండేతో కలిసి ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలం లోని ఇలేగాం గ్రామానికి చెందిన మహమ్మద్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి 60 వేల రూపాయల చెక్కును సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్ అందజేశారు.ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సహకరించినందుకు కృతజ్ఞతలు చెప్పారు.రెండు సంవత్సారాల్లో గ్రామంలో అనారోగ్యం బారిన పడిన వారికి ఎమ్మెల్యే సహకారంతో 20 మందికి చెక్కులు ఇవ్వడం జరిగింది.ఎమ్మెల్యే సహకారం తో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.పంచాయతీ కార్యదర్శి సురేష్,ఉప సర్పంచ్ శ్రీనివాస్ వార్డ్ మెంబర్లు శాంతాబాయి,రెడ్ల రాజు,గ్రామస్తులు రంజాన్,రసూల్,పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన కాట్రియాల సర్పంచ్



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మండలం కాట్రియాల గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, బండారి మహేందర్‌రెడ్డి, కాట్రియాల గ్రామ అధ్యక్షులు గడీల నగేష్, కంలియా నాయక్, సిద్ధరాములు, ఎల్లం, రాగిశెట్టి సంజు, విఠల్, కం ది విఠల్‌రెడ్డి, కొప్పుల భూషణం, బైగరి నాగరాజు, హంసరా గౌరిరాజు, మద్ది శ్యాములు, ఆలీతో పాటు ఉన్నారు.

## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం

**ప్రజాపక్షం / రెబ్బెన :** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు ఎంతో కీలకమని రెబ్బెన సిఐ సంజయ్ కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ అన్నా రు. ఆదివారం రెబ్బెన సిఐ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లో ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్ ను వారు వేర్వేరుగా ఆవిష్కరించారు.ప్రజాపక్షం పత్రిక ప్రజా సమస్యలను నిర్భయంగా రాస్తూ అతి తక్కువ కాలంలో ప్రజాదరణ పొందిందని పేర్కొన్నారు. పాత్రికేయులు నిజాలను రాస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ప్రజల సమస్యలు రాయడంలో ప్రజాపక్షం పత్రిక ముందుందని కొనియాడారు.పాత్రికేయులు దీకొండ సంజీవ్ కుమార్, రెబ్బెన మండల రిపోర్టర్ ఒడ్నాల సందీప్ పాల్గొన్నారు.



## బైంసా ఏరియా ఆసుపత్రిలో

# పరికరాలు నిరూపయోగం

### అసెంబ్లీలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా :** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని బైంసా ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలున్న ఇప్పటివరకు వాటిని ఇన్స్టాలేషన్ చేయకపోవడంతో సేవలు అందలేకపోతున్నాయని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.సోమవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. ముధోల్ నియోజకవర్గానికి పెద్ద ఆసుపత్రి బైంసా ఏరియా ఆసుపత్రి అని,రెండు వెంటిలేటర్లు ఇచ్చినప్పటికి ఇప్పటికీ ఇన్స్టాలేషన్ చేయడం లేదన్నారు.అదేవిధంగా 5 బేబీ కేర్ వార్నర్ మిషన్ లు ఉన్నప్పటతికీ వాటిని ఉపయోగంలోకి తేనందున పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.మొబైల్ ఎక్సరే మిషన్ ఉన్నప్పటికీ ఇప్పటికీ ఉపయోగంలోకి రాలేదంటే అధికార యంత్రాంగ నిర్లక్ష్యం అద్దం పడుతుందన్నారు.బ్లడ్ బ్యాంకులో అన్ని పరికరాలు ఉన్నప్పటికీ ఉద్యోగుల భర్తీ లేకపోవడంతో ఉపయోగంలోకి రావడం లేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ముధోల్ లో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటికి పనులు పూర్తి కాలేదని,తక్షణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.అదేవిధంగా బాసర లో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కుబీర్ మండలంలో 20వేల మంది గిరిజనులు ఉన్నారని,అక్కడ ఉన్న పి.హెచ్.సి.ని 30 పడకల ఆసుపత్రి గా మార్చాలని కోరారు. 2007లో గోదావరి పుష్కరాలు వస్తున్నాయని,మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని పలుమార్లు ప్రకటించినప్పటికీ బాసర మాస్టర్ ప్లాన్ పనులు అమలు కావడం లేదని,కోట్లాదిమంది భక్తులు వస్తారని,బాసర పునరనిర్మాణపనులు చేపట్టాలని కోరారు.ఇందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సానుకూలంగా స్పందించారు.

## మున్సిపల్ ఎన్నికల ముసాయిదా

# తప్పల తడక : సిపిఐ ఆరోపణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్




**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నటువంటి ఎన్నికల ముసాయిదాలు చాల వరకు తప్పులు దొర్లయని సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ ఆరోపించారు. ఎన్నికల ముసాయిదా ప్రక్రియలు తప్పుల తడాఖా గా ఉందని వాటిని సవరించాలని మున్సిపల్ కమీషనర్ కు సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ , సిపిఐ డివిజన్ కార్యదర్శి కె. నర్సిఁలు ఆద్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో 37 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల ముసాయిదాలు తప్పులు దొర్లయి అని ఆయన అన్నారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల వార్డుల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన అన్నారు. వార్డుల్లో కొన్ని పేర్లు వేరే వార్డు లోకి పోవడం మరి కొన్ని డీలీట్ అవ్వడం జరిగిందని దాని వలన ప్రజల ఓటు ఎక్కడుందో తెలియక ఇబ్బందులో ఎదుర్కొవాల్సి వస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టైం ఇవ్వకుండా ఆగ మేఘాల మీద ఎన్నికల ముసాయిదానను నిర్వహించడం ఎంత వరకు సమంజనమని వేరే వేరే నియోజకవర్గం, వేరే వేరే మండలంలో మరి వివిధ గ్రామాల్లో ఉన్న ప్రజల ఓట్లు ,ఒక పట్టణంలో విలీనం చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. అధికారుల తప్పిదం వల్ల ఈరోజు వేరే వేరే నియోజకవర్గం అక్కడ మండలాల్లో నుండి ఓటర్లు జహిరాబాద్ పట్టణంలో వీలీనం చేయడం సరి కాదని వాటిని వెంటనే పెంచాలని ఒక్కొక్క కుటుంబంలో ఒకొక్క కుటుంబానికి సంబందించిన ఓట్లు మొత్తం కూడా గల్లంతయతే మరి ప్రజల సమస్య ఏమిటంటే ఆయన అన్నారు. వివిధ వార్డులో గ్రామాల్లో మండలాల్లో నియోజకవర్గం వచ్చిన పేర్లతో పట్టణ ప్రజలుసతమతమవుతున్నారని ఆయన అన్నారు. తప్పులున్న వాటిని వెరిపికేషన్ చేసి మళ్లీ మేము పై అధికారులకు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు అందుకని జహీరాబాద్ పట్టణంలో 37 వార్డుల్లో ఏ వార్డులో అయితే పేర్లు తప్పిదాలు తొర్టాయో వాటిని మరి పదో తారీఖు లోపల సవరించి ఎక్కడెక్కడ ఏయే వార్డులో పేర్లు కటింగ్ ఆయ్యాయా ఆ యొక్క వారులో ఆ కటింగ్ అయిన వారికి మరి పేర్లు నమోదు అయ్యేల చూడాలని మరి మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు బారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆద్వర్యంలో ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు.

## ప్రజావాణికి జిల్లా అధికారులు హాజరు కావాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు స్వయంగా ప్రజావాణిలో పాల్గొనాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 70 వినతులు అందగా వాటి పరిష్కారంకోసంసంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిశీలించి పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తక్షణమే పరిస్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న తరహాలోనే జిల్లా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిని పర్యవేక్షించేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అవలంభిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని హితవు పలికారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రజావాణికి గైర్హజరు కాకూడదని, కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ప్రజలు తరలివచ్చి ప్రజావాణిలో వినతులు, ఫిర్యాదులు అందిస్తారని, జిల్లా అధికారులుఅందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు అనువుగా ఉన్న వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోందనే విషయాలను తెలుసుకునేందుకు, శాఖపరమైన అంశాలను గమనించేందుకు ప్రజావాణి కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు తప్పనిసరిగా ప్రజావాణిలో పాల్గొనాలని, ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. కాగా మండల ప్రత్యేకాధికారులు జిల్లా ప్రగతిలో క్రియాశీలక పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా కార్యక్రమాలు, పథకాల అమలు తీరును నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నందున, సంబంధిత అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధం కావలన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఫాం6, ఫాం7 పరిష్కారంలో స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. జడ్పీ సీఈఓ సాయగౌడ్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఫిర్యాదులు స్వీకరించగా అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జీ, సిపిలను కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం జిల్లా న్యాయమూర్తి జివిఎన్‌భరత లక్ష్మిని, సిపి సాయిచైతన్యలను మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్‌లో ఆమెకు పూలమొక్కను అందించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై వారు కొద్దిసేపు చర్చించారు. పోలీస్ కమిషనరేట్‌లో సీపీని కలిసి పూలబుకెను అందజేశారు.

## ప్రమాదాలకు టోల్ యాజమాన్యమే కారణం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ బైంసా జాతీయ రహదారిపై టోల్ ప్లాజా ఏర్పాటు చేసినప్పటి నుంచి వరుస ప్రమాదాలు జరుగుతూ వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని,దీనికి టోల్ ప్లాజా యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షు డు సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు విడివిడిగా వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ,టోల్ వసూళ్లు ప్రారంభమైన నాటి నుండి ఈ రహదారి మృత్యుదారిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు సు మారు 120 మందికి పైగా ప్రమాదాల్లో మృతి చెందారని, 450కి పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. అలాగే 200 మందికి పైగా తీవ్రంగా గాయపడి శాశ్వత వైకల్యానికి గురయ్యారని పేర్కొన్నారు.మాతేగావ్ వంతెన,దిలావర్‌పూర్ మలుపులు,సిర్గాపూర్ క్రాస్ రోడ్స్ వంటి ప్రమాదకర ప్రాం తాల్లో క్రాష్ బారియర్స్,హెచ్చరిక బోర్డులు లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.టోల్ నిబంధనల ప్రకారం ఉండాల్సిన 24 గంటల అంబులెన్స్,హైవే పెట్రోలింగ్ సేవలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.రోడ్డుపై గుంతలు,డివైడర్ల వద్ద వెలుతురు లేకపోయినా యాజమా న్యం పట్టించుకోవడం లేదన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ నస్పూర్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీలతో కలిసి అర్జీదారుల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించారు.మంచిర్యాల పట్టణం రామ్ నగర్ కు చెందిన కోమాకుల పోచమ్మ తన భూమి ఆక్రమణకు గురైందని, లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తిప్పని అనిత భూమిని రెవెన్యూ రికార్డులలో జమాబంది చేయాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. జన్నారం మండలం చింతలపల్లికి చెందిన నాయిని లక్ష్మి తన ఇంటికి వెళ్లే దారిని మూసివేశారని ఫిర్యాదు చేశారు. బెల్లంపల్లికి చెందిన బాల కవిత ఇందిరమ్మ ఇంటి దరఖాస్తులో తప్పులను సవరించాలని, పాత గర్మిళ్ళకు చెందిన అందే లక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ శతాబ్ది ముగింపు సభను పండుగలా జరుపుకుందాం

### జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, బొంతల లక్ష్మీనారాయణ, సం తోష్, జాడి పోచం, కోవలింగు, కొండ్రు బానేష్, బియ్యాల ఉపేందర్, బొల్లం పూర్ణిమ, బొర్లగుంట విజయలక్ష్మి , తిరుమల పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ కాసిపేట :** భారత కమ్యూనిస్టు పా ర్టీ (సిపిఐ) 100 సంవత్సరాల శతాబ్ది ముభత గిం పు వేడుకల సందర్భంగా ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రా మడుగు లక్ష్మ ణ్‌పిలుపునిచ్చారు. సోమవారం కా సిపేట మండలంలో సిపిఐ శతాబ్ది ఉత్సవ ము గింపు సభ విజయవంతం కోరుతూ నిర్వహించిన ప్రచార జాతలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని కొండాపూర్, యాప కార్నర్‌లలో జరిగిన సమావేశాల్లో పాల్గొని ప్రసంగించా రు. జనవరి 10న రామకృష్ణాపూర్‌లో జరిగే స భను కూడా విజయవంతం చేయాలన్నారు. 100 ఏళ్లుగా పేదలు, కార్మికులు, రైతుల కోసం సిపిఐ చేసిన పోరాటాలు, త్యాగాలను ప్రజలకు వివరించేందుకే ఈ జాత చేపట్టామని తెలిపారు. 1925 లో ఆవిర్భవించిన సిపిఐ నిజాం నవాబులకు, బ్రి టిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందని గుర్తు చే శారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ ర ంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోంద ని విమర్శించారు.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాస్,

## సర్పంచులతోనే గ్రామాల అభివృద్ధి

### రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ యాదవ్




**ప్రజాపక్షం/మెదక్ :** సర్పంచులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం అధికారంలో ఉ న్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రె డ్డి సర్పంచులకు అండగా ఉంటారని రాష్ట్ర స ర్పంచుల సంఘం అధ్యక్షులు శంకర్ యాదవ్ అన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచులకు తీవ్ర అన్యాయం జరిగిందని, నిధులు లేక గ్రామాల్లో సమస్యలు పరిష్కరించకుండా అనేక ఇబ్బంది లు పడ్డారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సో మవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మెదక్ జిల్లా సర్పంచుల సమావేశం జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అధ్యక్ష తన జరిగింది. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, వ్యవస్థాప అధ్యక్షులు వెంకటేష్, సీనియర్ నాయకు లు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సుప్రభాతరావు, రమేష్ రెడ్డి,రాజిరెడ్డిలు హాజరయ్యా రు. ముందుగా మెదక్ జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా ఆవుల గోపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రె సిడెంట్ గా శ్వేతా కిరణ్ గౌడ్ ను, జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులందరికి మెమోంటో, శాలువలతో సత్కరించారు. డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, గ్రామాలతో నే ప్రగతి సాధ్యమన్నారు. స్థానిక ఎమ్మెల్యేల నిధులు మంజూరుతో గ్రామాలు అభివృద్ధి చేయల ని సూచించారు. పార్టీకి అందరూ కట్టుబడి ఉం డాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ ప థకంను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. గాంధీ పేరును తీసేస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నా రు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి సర్పంచ్ అంటే రాజు అని, ఉప సర్పంచ్ అంటే మంత్రి అని, వా ర్డు సభ్యులు సైనికులన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లా సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గోపాల్ రెడ్డి గొప్ప వ్యక్తి అని అందుకే పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు గా ఎన్నిక చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధి కి సహాయ సహకారాలు అం దించాలని కోరారు. ఆవుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అధిష్టానం పదవి అప్పగించిన మదనపల్లి హనుమంతరావుకు, మహిపాల్ రెడ్డికి, ఆంజనేయులు గౌడ్ కు, రాజిరెడ్డికి జిల్లా నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం


### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేస్తూ,వారి సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.సోమవారం జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా పాల్గొని బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఆర్జీదారుల సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ,వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని తక్షణమే అందిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని,వారి వినతులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు.అప్పుడే ప్రజలకు పోలీస్ వ్యవస్థాపై భరోసా,నమ్మకం కలుగుతాయని ఆమె అభిప్రాయపడ్డారు.గ్రీవెన్స్ డే ద్వారా బాధితులు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభిస్తుందని,ఈ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరిచి వాటి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తున్నామని,బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు.

# పర్యాటక కేంద్రంగా రాజన్న క్షేత్రం

**త్వరలో గుడి చెరువులో బోటింగ్, నాంపల్లి గుట్టపై ఎయిర్ క్రాఫ్ట్ ఏర్పాటు**
**రాజన్న క్షేత్రాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తాం**
**విప్ ఆది శ్రీనివాస్ కీలక ప్రకటన**



**ప్రజాపక్షం/వేములవాడ, రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజన్న క్షేత్రం ఆధ్యాత్మికంగానే కాకుండా, పర్యాటక పరంగానూ అభి వృద్ధి చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా వేములవాడ రాజన్న గుడి చెరువులో మరికొద్ది రోజుల్లోనే బోటింగ్ సౌకర్యాన్ని ప్రారంభించను న్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రకటించారు. పట్టణంలో నిర్వ హించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భక్తుల కోరిక మేరకు గుడి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ బోటింగ్ ప్రారంభం కావడంతో రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, ముఖ్యంగా చిన్నారులు, పర్యాట కులు ఆహ్లాదకరమైన అనుభూతిని పొందుతారని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా వేములవాడ సమీపంలోని నాంపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక ఆకర్షణగా ఎయిర్ క్రాఫ్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఆధ్యాత్మికతతో పాటు వినోదానికి ప్రాధాన్య తనిస్తూ, వేములవాడను రాష్ట్రంలోనే అత్యు త్తమ పర్యాటక హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల పట్ల నియోజకవర్గ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీ ఆర్టీఎఫ్) నూతన సంవత్సర డైరీలను సోమవారం ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల కోరిక మేరకు ఫ్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించామని, నియోజకవర్గ కేంద్రాలలో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రే టెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలి పారు. ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, జిల్లా ప్రధాన కార్య దర్శి బోయన్న గారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుగంటి రమేష్, టిఆర్టిఎఫ్ నాయకులు మహేశుని లక్ష్మీనారాయణ, గాజంగి విష్ణు, మామిడాల రమేష్, సుల్తాన్ రాజు, గోలి రాధకిషన్, గుగులోతు రమేష్ నాయక్, బూట్ల శ్రీనివాస్, ఇప్పకాయల ప్రకాష్, లక్కే లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.




## ఆత్మహత్యకు పాల్పడిన మెడికో విద్యార్థిని చికిత్స పొందుతూ మృతి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట మెడికల్ కళాశాలలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న మెడికో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జోగులాంబ గద్వాలకు జిల్లాకు చెందిన బి.లావణ్య సిద్దిపేట మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ పూర్తి చేసుకొని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది. గత శుక్రవారం ఉదయం లెబర్ రూంలో డ్యూటీలో ఉండగా అనారోగ్యంగా ఉండటంతో క్యాజువల్ డిపార్ట్‌మెంట్ చికిత్స తీసుకొని కాలేజ్ హాస్టల్ కు వెళ్లింది. శనివారం ఉదయం ప్రభుత్వ కళాశాల హాస్టల్ పారాక్వాట్ గడ్డి మందును ఇంజెక్టు చేసుకొని ఆత్మహత్యానికి పాల్పడింది. ఇది గమనించిన తోటి జూనియర్ డాక్టర్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం నిమ్స్‌కు తరలించారు. నిమ్స్ ఆసుపత్రులోచికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతిచెందింది. ఇంటర్న్‌షిప్ డ్యూటీలకు నీట్ పీజీ ప్రిపరేషన్ వత్తిడి ఆత్మహత్యకు పాల్పడినట్లు మెడికల్ కళాశాల సిబ్బంది చెబుతున్నారు. జూనియర్ డాక్టర్ లావణ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులో ఆత్మహత్యకు గల కారణాలు ఏమని పేర్కొన్నారని అనే విషయాలను పోలీసులు ధృవీకరించటానికి నిరాకరించారు.

## కొండగట్టు గిరిప్రదక్షిణ కోసం రోడ్డును పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంతంలో భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం కొండగట్టు లోని రోడ్డు మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండగట్టు ఆలయం చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి కావాల్సిన ఏర్పాట్ల గురించి రెవెన్యూ, ఫారెస్ట్, ఆర్ & బి, పంచాయతీ రాజ్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. గిరిప్రదక్షిణ కొరకు ముఖ్యంగా రోడ్డు విస్తీరణం ఉండాలని మార్గ మధ్యలో భక్తులకు త్రాగునీరు, శౌచాలయాలు, విశ్రాంత కేంద్రాలు తదితర అంశాల గురించి సంబంధిత అధికారులకు సూచించినట్లు అలాగే గిరిప్రదక్షిణ మార్గం కొరకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అరుణాచలం, సింహాచలం తరహాలో గిరిప్రదక్షిణ ఏర్పాట్ల కు ప్రణాళిక చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకుగాను దాదాపు 40 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు, విద్యుత్ దీపాలు, అటవీ శాఖ అనుమతులు , పనుల అంచనా వ్యయాల గురించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి మాదాసు రవి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కొండగట్టు ఈ.వో శ్రీకాంత్ రావు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో ఓటువేయలేదని కక్షతో దాడి... కుల బహిష్కరణ



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** పంచాయతీ ఎన్నికలు ముగిసినప్పటికి గ్రామాల్లో కక్షలు ఇంకా సమసిపోలేదు.. ఎన్నికలో తనకు ఓటు వేయలేదని కక్ష పెంచుకొని వ్యక్తి కుటుంబంపై దాడి చేయటంతో కుల బహిష్కరణకు చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా తిమ్మాయిపల్లిలో చోటుచేసుకుంది. పంచాయతీ ఎన్నికల్లో ఓటమిచెందిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి తనకు ఓటు వేయలేదని కక్షతో అదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఇంటిపై తన అనుచరులతోల దాడి చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన కృష్ణారెడ్డి భౌతిక దాడికి పాల్పడటంతో పాటు తన కులస్తుడికి మద్దతు తెలుపలేదని సాకుతో రెడ్డి సభ్యులు మదుసూదన్ రెడ్డిని కులబహిష్కరణ చేస్తు నిర్ణయం తీసుకోవటం కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మదుసూదన్‌రెడ్డి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆకారణంగా తనపై దాడి చేసి, సామాజికంగా వెలివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అబద్దాలతో కాలం ఎల్లదీస్తున్న హరీశ్‌రావు: మీసం నాగరాజు

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** గడిచిన రెండేండ్లలో మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేట నియోజకవర్గంలో ఉన్న సమస్యలను గాలికి వదిలేసి,కేవలం ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ కాలం ఎల్లదీస్తున్నాడని డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావుకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో నియోజకవర్గ అభివృద్ధి కోసం మాట్లాడాలని,అంతే కాకుండా ప్రాజెక్ట్‌ల్లో భూములు కోల్పోయిన రైతులకు డబ్బులు ఇవ్వకుండా గత ప్రభుత్వంలో ఇబ్బందులకు గురిచేసిన వారికి డబ్బులు వెంటనే ఇప్పించే విధంగా పని చేయాలని,ప్రాజెక్ట్‌ల నుండి పంట పోలాలకు నీరొచ్చే విధంగా కాలువలు తవ్వుటకు కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి నర్సింలు,మహేందర్‌రెడ్డి,మీసం రాజు,బర్ల స్వామి,రాజు,కిషన్,సురేష్ తదితరులు పాల్గోన్నారు.

## మైనారిటీల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం /పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్నా మైనారిటీ ల సంక్షేమానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన యూఎండబ్ల్యూఎస్ పెద్దపల్లి పట్టణ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మొహమ్మద్ అస్లాం పర్వేజ్, కార్యదర్శి సైఫుల్లా ఖాన్ లు తెలిపారు. ఆదివారం రోజున పెద్దపల్లిలో పట్టణంలోని ఎంబీ గార్డెన్ లో నూతనంగా ఎన్నికైన యునైటెడ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులను పట్టణానికి చెందిన వతన్ డ్రై ఫ్రూట్స్ యజమాని సయ్యద్ జుబేర్ ఖాన్, రియల్ ఎస్టేట్ వ్యాపారి మహమ్మద్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పేద మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధి అవకాశాల కోసం మొదటి ప్రాముఖ్యత ఉంటుందని, ,పెద్దపల్లి పట్టణంలో మైనారిటీ షాదీ ఖానా ఏర్పాటు కోసం కృషి చేస్తామని, పెద్దపల్లి మైనార్టీ సోదరులు తమపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని మస్జిద్ కమిటీల సభ్యులు, మస్జిద్ ఇమామ్ లు, పట్టణ మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: పెండ్యాల మహేష్



**ప్రజాపక్షం/అంతర్గాం :** రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్కలను హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ ఒబిసి సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ తెలిపారు. సోమవారం అసెంబ్లీ అవరణలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌తో కలిసి రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. పనుల పట్ల నియోజకవర్గ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రధాన కాలువకు గండి

**సారంగాపూర్, బట్టపల్లి, పోతారం రైతుల్లో ఆందోళన**



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాలకు సాగు నీరు అందించే ప్రధాన కాలువకు గండి పడడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుండి డి 53ద్వారా 12 ఎల్ (సారంగాపూర్‌కు వచ్చే కాలువ) వైపు వచ్చే కాలువలో గండిపడడంతో ఆయా గ్రామాలకు సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు తెలిపారు. పంటల సాగు కీలక దశలో ఉన్న సమయంలో కాలువకు గండి పడడంతో నారు మడులు, పంట పొలాలు ఎండిపోతాయనే భయం నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కూలీలపై ఖర్చు చేసినట్లు పేర్కొంటూ తక్షణమే నీరు విడుదల చేయకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గండిని వెంటనే పూడ్చి, మరమ్మత్తులు చేపట్టి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్ఎస్‌పి అధికారులను రైతులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే పరిష్కరించాలని రైతులు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.

## పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం

**మున్సిపల్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్**



**ప్రజాపక్షం/కరీంనగర్:** పారదర్శకంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించడమే మా ప్రధాన లక్ష్యం అని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా ముసాదా ప్రకారం నగరపాలక సంస్థ ప్రచురించిన ఓటర్ల జాబితా అభ్యంతాల నేపథ్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆధ్వర్యంలో వివిద పొలిటికల్ పార్టీలతో సమావేశం జరిగింది. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు, షెడ్యూల్డ్ ప్రకారం ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా పై పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సుదీర్ఘంగా చర్చించారు. నూతన డివిజన్ల పునర్విభజన, డివిజన్ల వారిగా ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా మ్యాపింగ్, ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్డ్ వివరాలను ప్రతినిధులకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం 66 డివిజన్లకు సంబంధించి ఇటీవల ప్రచురించిన ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా పై పలు అభ్యంతరాలను పరిశీలన పై వివిధ పార్టీల ప్రతి నిధులు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ దృష్టికి తెచ్చారు. దీంతో కమీషనర్ తమ దృష్టికి తెచ్చిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి, ఫైనల్ ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా తయారు చేస్తామని, దృష్టికి తెచ్చిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని సూచించారు. వార్డు ఆఫీసర్లతో పాటు బిఎల్ ఓ లను కూడ ఈ ప్రక్రియలో ఇన్ వాల్ చేసి... డివిజన్ల వారిగా ఓజర్లను సవరణ చేసి తుది జాబితా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి షెడ్యూల్డ్ ప్రకారం పోలింగ్ బూత్ వారిగా ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం అక్టోబర్ 1 న పబ్లిష్ చేసిన ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రకారం మాత్రమే టీ ఈ మ్యాపింగ్ చేయడం జరిగింది. ప్రచురించిన ఓటర్ల జాబితాలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులు దృష్టికి తెచ్చిన అన్నోన్ ఓటర్లు, డబుల్ సిరిస్ ఇంటి నెంబర్లతో ఉన్న ఓటర్లను గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించి ఫిజికల్ ఎక్వైరీ చేయడం జరగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మేయర్లు బీజేపి నాయకులు యాదగిరి సునీల్ రావు, డి.శంకర్, అంజన్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, శ్రీనివాస్, ఎంఐఎం అధ్యక్షులు సయ్యద్ గులామ్ హైమద్ హుస్సైన్, అబ్బాస్ సమీ, సీపిఐ నాయకులు మణికంఠ రెడ్డి, పైడిపల్లి రాజు, సిపిఎం నాయకులు ఎం.వాసుదేవ రెడ్డి, శేఖర్, కాంగ్రెస్ నాయకులు మడపు మోహన్, వీర దేవేంధర్ పటేల్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ముత్తయ్య, వైసీపి నాయకులు రవీంధర్ రెడ్డి, జన సేనా పార్టీ నాయకులు రాజిరెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారం సాగునీటిని విడుదల చేయాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని ఆయా సాగు నీటి ప్రాజెక్టుల నుంచి రబీ సీజన్లో పంటల సాగు కోసం ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సాగు నీటి ప్రాజెక్టుల, నీటి మట్టాలు తదితర అంశాలపై నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఎగువ మానేరు, మిడ్ మానేరు ప్రాజెక్టులు, మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లలో ప్రస్తుత నీటి మట్టం వివరాలపై ఆరా తీశారు. మల్కపేట రిజర్వాయర్, ఎగువ మానేరులో 1.8 టీఎంసీలు, అన్నపూర్ణ రిజర్వాయర్ లో 3.30 టీఎం సీలు, మిడ్ మానేరు ప్రాజెక్ట్ లో 26.65 టీఎంసీల నీరు నిలువ ఉందని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి నీటి పారుదల శాఖ అధికారులు తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో రబీలో పంటల సాగుకు అనుగుణంగా ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నుంచి నీటిని పక్కా ప్రణాళిక ప్రకారం విడుదల చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, నీటి పారుదల శాఖ అధికారులు కిశోర్ కుమార్, జగన్, సంత్ ప్రకాశ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించిన ఎఐటియుసి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి 5లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 2026 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ లను ఆవిష్కరించడం జరిగిందని ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి కామ్రేడ్ గుర్రం ప్రభుదాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లో పని చేస్తున్న అధికారుల కు, కార్మికుల కు, ఉద్యోగులకు, కార్మిక సంఘాల నాయకులకు, కార్యకర్తలకు మరియు వారి కుటుంబ సభ్యులందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్ కార్మిక సోదరీ సోదరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం కార్మికుల హక్కుల సాధన కోసం వారి సంక్షేమం కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మిక వర్గం కు తీవ్ర నష్టం జరుగుతుందని, కేంద్రం వల్ల సింగరేణి కి బొగ్గు గనులు రాక ఉన్న గనులు మూత పడుతున్నాయని, కొత్త గనులు కోసం ఏఐటియుసి ఉద్యమాలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రాజెక్టు నాయకులు చీకటి అంజయ్య, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తేడాలు వస్తే సహించేది లేదు

**అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం: కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**ప్రజాపక్షం/కరీంనగర్:** టీజీ ఎండిసి సిబ్బంది ఇసుక క్వారీ వద్ద ఇసుక లోడింగ్ చేసే సమయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలనీ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు. ఇసుక రవాణా సందర్భంగా అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి వీణవంక మండలం చల్లూరు లోని టీజీఎండిసి ఇసుక క్వారీ వేయింగ్ బ్రిడ్జి పనితీరును జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక లారీ లోడింగ్ వేయిట్ ను స్వయంగా పరిశీలించారు. క్వారీ సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వే బిల్లులు డీడీలు, రికార్డులు పరిశీలించారు. ఇసుక రవాణా చేసే ప్రతి లారీ ఎంట్రీ ఎగ్జిట్ వివరాలను సాండ్ ఆడిట్ యాప్ లో కచ్చితంగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో ఎలాంటి తేడాలు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుకను తరలించే సమయంలో లారీ డ్రైవర్లు తప్పనిసరిగా ఇసుకపై టార్పాలిన్ కవర్లు కప్పి తీసుకెళ్లాలని సూచించారు. డీడీలు జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. తద్వారా అక్రమ రవాణా చేసే వాహనాలను నియంత్రించాలని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా అక్రమ ఇసుక నిల్వలను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఈ మేరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సిపి సూచించారు. ట్రైనీ ఐ పీ ఎస్ సోహం సునీల్, హుజురాబాద్ ఏసిపి మాధవి, వీణవంక మానకొండూరు తహసీల్దార్లు అనుపమ, విజయ్ టీజీ ఎండిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ వినయ్ కుమార్ పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ముందస్తు సంక్రాంతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ లోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో సోమవారం ఆల్ఫోర్స్ పల్లె వైభవం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధికి బాటలు వేస్తాయని, అన్ని రకాల వనరులకు కేంద్ర బిందువులని అన్నారు. పండుగను చాలా వైభవంగా ఆప్యాయతతో కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల నడుమ వివిధ రకాల పూజలతో ఈ పండుగను చాలా విశిష్టంగా జరపడం ఒక గొప్ప ఆనవాయితీగా వస్తుందన్నారు. నేటికీ ఈ సాంప్రదాయానికి కట్టుబడి ఉంటూ పండగ వైభవాన్ని చాటిచెప్పే విధంగా చాలా గొప్పగా నిర్వహించడం ప్రశంసనీయమని తెలిపారు. సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు భోగి మకర సంక్రాంతి కనుమ పండుగలతో ఘనంగా నిర్వహించుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా సంక్రాంతి వచ్చిందే తుమ్మెద, సంక్రాంతి పండుగ వచ్చిందే తుమ్మెద నృత్య ప్రదర్శన ఆలోచింపచేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందజేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూరియా సరఫరా, యాసంగి కు సాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 8,2026 వరకు 7 తడులలో యాసంగి పంటకు ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల అవుతుందని, 7 రోజుల పాటు జగిత్యాల జిల్లాకు, 8 రోజుల పాటు పెద్దపెల్లి జిల్లాకు సాగు నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీరు అందుబాటులో ఉందని, నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చూడాలని, ఇతర జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని, ఎక్కడ నీటి వృధా ఉండడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, నీటిపారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్ కే. శ్రీనివాస్ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు:ఎఐటియుసి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ లో పని చేస్తున్న కార్మికుల కు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి సంస్థ రక్షణ కోసం కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గత ఎనభై సంవత్సరాల నుండి అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు కలవేణి రాజేష్, పర్లపెల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్

**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యానగర్ 21వ డివిజన్ లో 20 లక్షలతో సిసి రోడ్డు,మురుగు కాల్వ నిర్మాణానికి మరియు రాంచంద్రాపూర్ కాలనీ 11 వ డివిజన్ లో 25 లక్షలతో సిసి రోడ్లు,మురుగుకాల్వ నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఈ అంతర్గత రోడ్లు,మురుగు కాలువలు నిర్మిస్తున్నామని రాబోయే రోజుల్లో మిగిలిపోయిన అన్ని పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాలలో బోనాల శ్రీనివాస్,వరాల నర్సింగం, చేవెళ్ల మల్లికార్జున్, ఊరడి లత,వెన్నం రజితా రెడ్డి మిర్యాల శ్రీధర్ రెడ్డి,గుడిపాటి రమణా రెడ్డి, తాళ్లపల్లి మహేష్ గౌడ్, భూపతి జగన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, స్వప్న, కవిత పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
మంగళవారం
06-01-2026
www.prajapaksham.in

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 2027 సమ్మర్‌లో విడుదల చేస్తామని రాజమౌళి అధికారికంగా వెల్లడించగా, తాజాగా ఈ మూవీకి సంబంధించి రిలీజ్ డేట్ దాదాపుగా ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

రీల్



## 7న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్ నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాపై మరింత హైప్ పెంచింది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను రేపు (జనవరి 7న) గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రం పక్కా ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందింది. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో విపరీతమైన క్యూరియాసిటీని పెంచింది. ముఖ్యంగా రవితేజ ఇద్దరు భామల ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి మధ్య నలిగిపోయే 'లవ్ ట్రయాంగిల్' సన్నివేశాలు నవ్వులు పూర్తిస్థాయి. జనవరి 7న రాబోయే ట్రైలర్లో కథలోని అసలు ట్విస్టులేంటో, రవితేజ పండించే కామెడీ ఏ రేంజ్లో ఉండబోతోందో పూర్తి క్లారిటీ రానుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం ఈ సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. ముఖ్యంగా 'వామ్మో వాయ్యో..' అనే సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్లో ఉంది. ఈ చిత్రం భోగి పండుగ కానుకగా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది.

## ఇది పండుగ సినిమా..

### నిర్మాత అనిల్ సుంకర



శర్వానంద్ హీరోగా త్వరలో రాబోతోన్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ మూవీలో సంయుక్త, సాక్షి వైద్యలు హీరోయిన్లుగా నటించారు. ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో నిర్మాత అనిల్ సుంకర మీడియాతో మాట్లాడుతూ.. చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. సంక్రాంతి సరిపడే మూవీగానే 'నారీ నారీ నడుమ మురారి'ని రూపొందించాం. ఇదొక పండుగ మూవీ. సినిమాలకు సంక్రాంతి సీజన్ అనేది వర్కౌట్ అవుతుంది. మేం అనుకున్నట్టుగానే సినిమా వచ్చింది. సంక్రాంతి సీజన్లో నాలుగైదు సినిమాలు అనేవి కామన్. సంక్రాంతి సీజన్లో రిలీజైన అన్ని చిత్రాలు హిట్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిది. థియేటర్లో కూర్చున్నంత సేపు ఆడియెన్స్ని నవ్విస్తాం. బాలయ్య గారితోనే మా టైటిల్ను ఓపెన్ చేయించాం. మేం పాటని పూర్తిగా వాడలేదు. కేవలం కొన్ని పదాలనే వాడుకున్నాం. మా మూవీని నైజాం, వైజాగ్లో దిల్ రాజు రిలీజ్ చేస్తున్నారు. ఈస్ట్‌లో సొంతంగా చేస్తున్నాం. వెస్ట్, కృష్ణా, గుంటూరులో రాజా, సీడెడ్‌లో శోభన్ రిలీజ్ చేస్తున్నారు. సంక్రాంతి సీజన్లో మా సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం. ఎన్ని థియేటర్లు అన్నది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ నిర్మాత కూడా చెప్పలేరు. 'సామజవరగమన' చేసే టైంలోనే రామ్ అబ్బరాజుతో కమిట్ అయ్యాం. రామ్ అబ్బరాజు నెక్స్ట్ మూవీ కోసం మైత్రి వద్దకు పంపించాం(?). మాలో శర్వానంద్ కాకుండా శ్రీ విష్ణు పాత్ర ఎలా ఉండబోతోందో అంటే సినిమాలో ఓ మంచి పాత్ర పడింది. ఆ క్యారెక్టర్ మాకు అందుబాటులో ఉండే హీరో శ్రీ విష్ణు కాబట్టి ఆయన్ను అడిగాం. ఆ పాత్ర వచ్చినప్పుడు థియేటర్లో అందరూ ఎంజాయ్ చేస్తారు. సాయి ధరమ్ తేజ్‌తో, తేజ సజ్జాతో సినిమాలు చేయబోతోన్నాం. అడివి శేష్‌తో 'గూఢచారి 2' రాబోతోంది. ఎక్కువగా వినోదాత్మక చిత్రాల్ని చేయాలని అనుకుంటున్నాను. ఈ క్రమంలోనే 'ఎయిర్ ఫోర్స్ బెజవాడ బ్యాచ్' అనే ఓ కామెడీ ఎంటర్టైన్మెంట్‌ను చేస్తున్నాను అన్నారు.

## 'మెగా రైడ్'లా ఉంటుంది

- అనిల్ రావిపూడి



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ 'మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రేక్షకులకు ముందుకు వస్తున్న ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకుడు. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రతో నటిస్తున్నారు. ఇది అత్యంత క్రేజీ కాంబినేషన్లలో ఒకటిగా నిలిచింది. సినిమా ప్రమోషన్లు ఇప్పటికే అద్భుతంగా జరుగుతున్నాయి. తిరుపతిలో సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. తిరుపతి అంటే నాకు చాలా సెంటిమెంటు. ప్రతి సినిమా రిలీజ్ కి ఇక్కడికి వస్తాను. స్వామివారి ఆశీస్సులు తీసుకుంటాను. ఆయన దయవలన కెరీర్ చాలా హ్యాపీగా ఉంది. అలాంటి తిరుపతి లోనే ఈ ట్రైలర్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మెగాస్టార్ చిరంజీవి గారిని నేను ఎలా చూపించాలి అనుకుంటున్నానో, ఆయన నాకు ఎలా ఇష్టమో, ఆయనలో నాకు ఏం నచ్చుతాయి అనే ఆలోచనతో ఈ కథని రాసుకున్నాను. దానికి తగ్గ అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. ఈ ట్రైలర్‌లో చూసింది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. సినిమా చూసిన తర్వాత ఒక టైం మిషన్ ఎక్కి ఒక రౌండ్ వేసి వస్తారు. అది మాత్రం గ్యారెంటీ. చిరంజీవి గారు లీడర్ రాజు, ఆటో జానీ.. ఇలాంటి క్యారెక్టర్స్‌లో ఆయన మనకు విపరీతంగా నచ్చుతారు. నేను ఆ అలాంటి బేసిస్ లోనే ఈ శంకర వరప్రసాద్ క్యారెక్టర్ రాసుకోవడం జరిగింది. చిరంజీవిలో ఉన్న ఫన్ టైమింగ్ నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ సినిమాలో అద్భుతంగా ఎక్స్ ఫ్లోర్ చేశాం. నేను రాసిన దాని కంటే చిరంజీవి దాన్ని వందరెట్లు అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌తో ప్రజెంట్ చేశారు. సంక్రాంతికి వస్తున్నాం నా కెరీర్‌లో స్పెషల్ ఫిలిం. ఆ సినిమాని మీరందరూ థియేటర్స్‌లో అద్భుతంగా సెలబ్రేట్ చేశారు. ఇది నా నాలుగో సంక్రాంతి సినిమా. తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నా అన్నారు. నిర్మాత సాహుగారపాటి మాట్లాడుతూ.. ట్రైలర్ అదిరిపోయింది. సినిమా అంతకంటే అద్భుతంగా ఉంటుంది. లాస్ట్ సంక్రాంతికి మన అనిల్ ఒక హీరోతోనే వచ్చారు. నిర్మాత సుస్మిత కొణిదెల మాట్లాడుతూ.. గుడ్ ఈవెనింగ్ తిరుపతి. సంక్రాంతికి ట్రీట్ ఎలా ఉండబోతుందో ఈ ట్రైలర్ చూస్తే అర్థమౌతుందని చెప్పారు. రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ నేను ఎప్పుడు కూడా చిరంజీవికి వీరాభిమానిని. అనిల్ రావిపూడిని సంక్రాంతి పందెంకోడి అంటున్నారు. నేను రెక్కల గుర్రం అంటాను. రెక్కల గుర్రం మీద చిరంజీవి ఎక్కారు. అది మామూలుగా ఉండదు. ట్రైలర్ మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తోందని తెలిపారు. సంక్రాంతి కానుకగా 12న సినిమా విడుదల కానుంది.

## 30న 'గాంధీ టాక్స్'



అరవింద్ స్వామి ప్రధాన పాత్రలో జీ స్టూడియోస్ నిర్మిస్తున్న మూవీ 'గాంధీ టాక్స్'కు సంబంధించి విడుదల తేదిని అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ జనవరి 30న రిలీజ్ అవుతుంది. ఇండియన్ సినిమాల్లో అరుదైన సైలెంట్ ఫిలింగా 'గాంధీ టాక్స్' రూపొందింది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి వంటి స్టార్స్ ఈ సైలెంట్ ఫిలింలో నటించారు. అదితి రావు హైదరి, సిద్ధార్థ్ జాదవ్ వంటి స్టార్స్ పాత్రల భావాన్ని, సన్నివేశాల డెప్త్‌ను మాటలు లేకుండా హావభావాలతో కథను నెరేట్ చేయటంలో ప్రత్యేకతను చూపిస్తుంటారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కిషోర్ బెలేకర్ మాట్లాడుతూ.. 'నిశ్శబ్దం అనే నమ్మి 'గాంధీ టాక్స్' సినిమాను రూపొందించాం. శతాబ్దంగా ఇండియన్ సినీ మేకర్స్ పలు రకాలైన కథలతో సినిమాలు చేస్తున్నారు. ఇలాంటి కళలో పెర్ఫామెన్స్, ఎమోషన్స్‌ను బేస్ చేసుకుని సినిమా చేయాలనుకున్నామన్నారు. 30న విడుదలకాబోతోన్న గాంధీ టాక్స్.. నిశ్శబ్దం ద్వారా ఎంతో చెప్పగలమనే కొత్త సినిమాటిక్ అనుభవాన్ని ప్రేక్షకులకు అందించనుంది.

## 'దక్షిణకాళీ' ప్రీ రిలీజ్



సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ'. హీరోయిన్ అర్చన అమ్మవారి పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోదర్శకుడు తోట కృష్ణ, నిర్మాత సత్యవాణి మీసాల, హీరోయిన్ ప్రియాంక ,నటుడు అఫ్సర్ ఆజాద్, హీరో సుబ్బు పాల్గొన్నారు.

## 'క్రేజీ కల్యాణం' పోస్టర్



నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ వెల్లడించనున్నారు. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో', 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాలకు మ్యూజిక్ అందించిన సురేష్ బొబ్బిలి 'క్రేజీ కల్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు నటిస్తున్నారు.

## ఫిబ్రవరి 6న 'హనీ'

పలాస వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన కరుణ కుమార్ తాజాగా తెరకెక్కించిన చిత్రం హని. నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓవిఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణతో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్‌తో ఉండబోతోంది. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి కీలక పాత్రలు పోషిస్తున్నారు. హనీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో కొనుగోలు చేసింది.



## 'వారెవా వారెవా' పాట విడుదల



అఖిల్ అక్కినేని హీరోగా మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు సంబంధించిన పాటను సోమవారం 'వారెవా వారెవా..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేవారు. ఈ పాటకు అభిమానులు, మ్యూజిక్ లవర్స్ నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా.. శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ తమ వాయిస్తో పాటకు ఓ ఎమోషనల్ ఫీల్ను తీసుకొచ్చారు. మ్యూజికల్ సెన్సేషనల్ ఎస్.ఎస్.తమన్ సంగీతం సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాట రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది. సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తూ, హీరోహీరోయిన్ మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా పాట ఉంది. దీంతో ఈ సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. శరవేగంగా షూటింగ్ను పూర్తి చేసుకుంటోన్న ఈ సినిమా ఇప్పటి వరకు 70 శాతం చిత్రీకరణను పూర్తి చేసింది. మూవీని సమ్మర్లో రిలీజ్ చేయటానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో అఖిల్ అక్కినేని సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది.

## అమెరికా దురాగతంపై కేంద్రం మౌనం సిగ్గుచేటు: సిపిఐ

**న్యూఢిల్లీ:** వెనిజులాపై అమెరికా దురాగతాన్ని ఖండించకుండా భారత ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటైన విషయమని భారత్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి మండిపడింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కీలక అంశంపై మౌనంగా ఉండటం ద్వారా అమెరికా సామ్రాజ్యవాదంతో జతకట్టాలని భారతప్రభుత్వం అనుసరించిన వైఖరిపై సిపిఐ తీవ్ర ఆందోళన, విచారం వ్యక్తం చేసింది. ఇటువంటి వైఖరి భారతదేశ అలీనత, సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేకత, గ్లోబల్ సౌత్‌లో అణచివేతకు గురైన దేశాలతో సంఘీభావంతో ఉండే చారిత్రాత్మక నిబద్ధత నుండి నిస్సిగ్గు నిష్క్రమణను సూచిస్తుంది. ఒక విదేశీ శక్తి దేశాధ్యక్షుడ్ని కిడ్నాప్ చేయడం... అంతర్జాతీయ ఉగ్రవాదానికి తీసిపోదు. ఇది అన్ని అభివద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమత్వాన్ని బెదిరించే ప్రమాదకరమైన ఉదాహరణను నిర్దేశిస్తుంది. ఇటువంటి చర్యలు పరిపాటిగా మారినట్లయితే గ్లోబల్ సౌత్‌లోని ఏ దేశమూ సామ్రాజ్యవాద నిర్బంధం, ప్రభుత్వాలను మార్చే కుట్రలు, దురాక్రమణ, సైనిక బెదిరింపుల నుండి సురక్షితంగా ఉండజాలవని ప్రకటన పేర్కొంది. భారత ప్రభుత్వం వెంటనే తన సందిగ్ధ, సామ్రాజ్యవాద అనుకూల వైఖరిని విరమించుకోవాలని, వెనిజులాపై అమెరికా దురాక్రమణను స్పష్టంగా ఖండించాలని సిపిఐ డిమాండ్ చేసింది. అంతర్జాతీయ చట్టాలు, జాతీయ సార్వభౌమాధికారం, విదేశీ జోక్యం లేకుండా ప్రజలు తమ స్వంత రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను నిర్ణయించుకునే హక్కును కాపాడుకోవడానికి భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తన స్వరం పెంచాలని స్పష్టం చేసింది. భారతదేశం అలీన దేశాలతో, లాటిన్ అమెరికాతో, గ్లోబల్ సౌత్‌తో పాటు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్న అన్ని దేశాలతో దఢంగా నిలబడాలని పేర్కొంది. అమెరికా దాష్టీకంపై మౌనం వహిస్తే... దానికి సహకరించినట్టేనని తెలిపింది. ఇక వెనిజులాప్రజలకు, చట్టబద్ధ ప్రభుత్వానికి సిపిఐ తన అచంచల సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. సామ్రాజ్యవాదం, సైనికవాదం, నయా వలసవాద దురాక్రమణకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండాలని ప్రపంచవ్యాప్త ప్రగతిశీల శక్తులకు సిపిఐ పిలుపునిచ్చింది.



## ఆర్‌టిసి బస్సులో సిఎం (మొదటి పేజీ తరువాయి)

పూలే చేసిన కృషి, మహిళల కోసం చేసిన పోరాటాలను సినిమాలో కళ్లకు కట్టినట్టు చూపించారని పలువురు ప్రజాప్రతినిదులు ఈ సందర్భంగా అన్నారు. ఇదిలా ఉండగా, సినిమాను తిలకించేందుకు సిఎం సహా అందరూ అసెంబ్లీ నుంచి బస్సులో వెళ్ళారు. సిఎం ప్రయాణిస్తున్న బస్సులు పోలీసులు భారీ సెక్యూరిటీ కల్పించారు.

## భారీ మూల్యం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ ప్రపంచం స్పందించాలని ఆమె కోరారు. వెనిజులాలో జరిగిన సంఘటనలే ఇతర లాటిన్ అమెరికా దేశాలలో కూడా జరిగే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరిక చేశారు. ప్రజల సంకల్పబలాన్ని నాశనం చేయడానికి ఇతర దేశాల నాయకులపై దాడిచేసి వాటి సార్వభౌమాధికారాన్ని, ఆత్మస్థైర్యాన్ని ట్రంప్ దెబ్బతీసేలా బలప్రయోగం చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో ఒకవైపు అధికారపార్టీ బలంగా ఉన్న అనేక ప్రాంతాలలో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతుండగా, కారకస్ సహా కొన్ని ఇతర ప్రాంతాలు నిర్మానుష్యంగా ఉన్నాయి. ఆహార దుకాణాలవద్ద ప్రజలు బారులుతీరి నిలబడ్డారు. ట్రంప్ కొనసాగిస్తున్న ఆర్థిక ఆంక్షల కారణంగా వెనిజులాలో ద్రవ్యోల్బణం తీవ్రగా పెరిగిపోయింది. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

## తక్షణమే నికోలస్ మదురో, సిలియాని విడుదల చేయాలి

**వెనిజులపై అమెరికా దాడి దురాక్రమణనే సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెనిజులా దేశంపై అమెరికా బాంబులతో దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు మధురో, ఆయన భార్యను బందీలుగా పట్టుకుపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యం లో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ.. అమెరికా నిరంతరం లాటిన్ అమెరికా దేశాలపై అనేక ఆర్థిక ఆంక్షలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ దేశాలలో ఉన్న ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తోందని, వనరులను, స హజ సంపదను, చమురు, బంగారం లాంటి నిల్వలను దోపిడీ చేసుకుని వాటి నుంచి లాభాలను పొందేందుకు అమెరికా దాడులు చేస్తున్నదని విమర్శించారు. అమెరికా ఆధిపత్యాన్ని, ఆర్థిక దోపిడీ ఆలోచనలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్న వెనిజులా దేశంపై కూడా తీవ్రమైన ఆంక్షలు విధించి, ఆ దేశంలో ప్రభుత్వాలను పడగొట్టే కుట్రలకు తెరదీసిందని మండిపడ్డారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వెనిజులా దేశంపై బాంబు దాడి చే స్తూ ఆ దేశ అధ్యక్షుడిని బందీగా తీసుకెళ్ళి న్యూయార్క్ జైల్లో వేయడం అత్యంత దారుణమని, ఈ చర్యను నిరసిస్తూ ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయన్నారు. ట్రంప్ ప్రభుత్వం ఒక యుద్ధ పిపాసిగా మారిందన్నారు. ఒక దేశాన్ని ఆక్రమించుకోవాలనుకున్నప్పుడు ఆ దేశంపై అమెరికా అనేక రకల అబద్ధాలను ప్రచారం చేస్తున్నదన్నారు. డ్రగ్స్ సరఫరా కారణంగానే తమ దేశంలో పౌరులకు ఇబ్బందవుతుందని, వెనిజులాపై ఒక తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ఇది తప్పుడు ప్రచారమే అనేందుకు, వెనిజులాలో ఉన్న చమురు నిక్షేపాలను వెలికి తీసి ప్రపంచ వ్యాప్తంగా విక్రయిస్తామని ట్రంప్ చెప్పడమే ఇందుకు ఉదాహరణ అన్నారు.

**వెనిజులాకు అండగా నిలబడదాం : వి.ఎస్.బోస్**

ఒక దేశ సార్వభౌమాధికారంపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని బందీగా చేయడమంటే ఆధునిక వలస దేశాలను ఏర్పరచుకోవటమేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. భవిష్యత్తులో అన్ని దేశాల పైన ఈ విధంగానే దాడులు కొనసాగే అవకాశం ఉన్నది. యుద్ధోన్మాద ట్రంపు నిర్ణయాలకు ఎదిరిస్తూ ప్రజలందరూ రోడ్లపై వచ్చి మధురోకు మద్దతుగా, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్న వెనిజులా ప్రజలకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని, షేక్ షంషుద్దీన్, మామిడిచెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




## దంపతులకు బేడీలు వేయడం అత్యంత హేయమైన చర్య : సిపిఐ(ఎం)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెనిజులా దేశ సార్వభౌమాధికారాన్ని కాలరాస్తూ, ఆ దేశ అధ్యక్షడు నికోలస్ మధురో, ఆయన భార్య సిలియానాను అమెరికా బలగాలు నిర్బంధించడాన్ని నిరసిస్తూ సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ యుద్ధ విమానాలతో ఒక దేశ మిలటరీ హెడ్ క్వార్ట్స్ పైన దాడి చేసి, బెడ్రూమ్‌లో నిద్రిస్తున్న వెనిజుల అధ్యక్ష దంపతులకు బేడీలు వేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఒక స్వతంత్ర దేశ నేతను నిర్బంధించే సత్తా తమకే ఉందనే అహంకారాన్ని అమెరికా ప్రదర్శిస్తోందని, వెనిజులాలోని చమురు నిల్వలను దోచుకోవడమే ట్రంప్ అసలు లక్ష్యమని ఆరోపించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి స్వాతంత్ర్యం పొందిన భారతదేశానికి ప్రధానిగా ఉన్ననరేంద్ర మోదీ వెనిజులాలో జరుగుతున్న అన్యాయాన్ని ఖండించకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. భారత్‌పైన టారిఫ్‌లను విధిస్తామని అమెరికా అధ్యక్షడు ట్రంప్ బెదిరిస్తున్నప్పటికీ ప్రధాని మోదీ స్పందించకపోవడం దేశ ప్రతిష్టకు భంగకరమన్నారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. ట్రంప్‌నకు ముకుతాడు వేయకపోతే ప్రపంచానికే ప్రమాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, టి.సాగర్, ఎండి అబ్బాస్, మల్లు లక్ష్మి , హైదరాబాద్ నగర కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేను సంతోషంగా లేను

(మొదటి పేజీ తరువాయి)

తిరిగివస్తూ ప్రయాణమార్గంలో ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడారు. వారు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 'భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చాలా మంచివాడు, గత ఏడాది మేం భారత్‌పై 50 శాతం సుంకాలు పెంచిన తర్వా త చాలా వరకూ రష్యా నుండి మోదీ చమురు దిగుమతులు తగ్గించుకున్నారు, వారు (భారత్) నన్ను సంతోషంగా ఉంచాలని కోరుకుంటున్నారు, ప్రాథమికంగా, మోదీ చాలా మంచి వ్యక్తి, కానీ నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు, నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం, వారు వాణిజ్యం చేస్తున్నారు, మేం వారిపై చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం, ఈ విషయంలో వారికి నేను చాలా చెడ్డమనిషిని' అన్నారు. ఎయిర్ ఫోర్స్–1 విమానంలో ట్రంప్‌తో పాటు ప్రయాణం చేసిన సెనేటర్ లిండ్‌స్లే గ్రాహం పాత్రికేయులతో మాట్లాడుతూ, భారత్‌పై సుంకాలు విధించినందువల్లనే ఇప్పుడు ఆ దేశం రష్యా నుండి ముడి చమురు కొనుగోలును గణనీయంగా తగ్గించిందన్నారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ పైవిధంగా వ్యాఖ్యానించారు. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై సుంకాలను 500 శాతం మేరకు విధించే టారిఫ్ బిల్లు గురించి లిండ్‌స్లే గ్రాహం ప్రస్తావించారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించాలంటే రష్యా నుండి చమురు కొనుగోలు చేసే ఖాతాదారులపై కూడా తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్‌పై ఒత్తిడి తీసుకురావడంకోసమే 25 శాతం అదనపు సుంకాలు విధించామన్నారు. భారత్ ఒకేసారి పూర్తిగా రష్యా నుండి చమురు దిగుమతులను రద్దుచేసుకోలేదని, భారత్ సమస్యను తాను అర్థం చేసుకున్నాననీ, మెల్లిమెల్లిగా రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళను పూర్తిగా రద్దుచేస్తుందని గత ఏడాది ఆగస్టులో ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

## మదురో (మొదటి పేజీ తరువాయి)

అమెరికా ప్రభుత్వం మోపిన అభియోగ పత్రాన్ని న్యాయమూర్తి ఆయనకు చదివి వినిపించారు. ఈ పరిణామాలమధ్య కొలంబియా అధ్యక్షుడు పెట్రో తీవ్రంగా స్పందించారు. తన దేశ రక్షణకోసం అమెరికాకు వ్యతిరేకంగా తాను ఆయుధాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నానన్నారు. ఈ ఘట్టం అమెరి కా చరిత్రలో గతంలో ఎన్నడూలేని ఒక అసాధారణమైనది. ప్రపంచ నాయకుల విశ్లేషణల ప్రకారం ఈ ఘట్టం భవిష్యత్తులో ట్రంప్ లేదా అమెరికాకు అత్యంత ప్రమాదకరమైన ఘట్టం. నిర్ణీత ప్రకారం మదురోను సోమవారంనాడు న్యూయార్క్ కోర్టు లో నిలబెట్టారు. ఆయన కుంటుతూ నడుస్తున్నా రు. అటార్నీ జనరల్ పామ్ బాండీ అక్కడ హాజరయ్యారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నార్కో–టెర్రరిజం కుట్ర చేశారన్నది నికొలస్ మదురోపై ప్రధానమైన ఆరోపణ. కొకైన దిగుమతి కుట్ర చేశారన్నది మరో అభియోగం. ఆయన దగ్గర భారీ ఎత్తున మెషీన్ గన్స్ ఉన్నాయనీ, విధ్వంసకరమైన ఆయుధాలను పేర్చిపెట్టారని మరో అభియోగం చేశారు. ఇరాక్‌పై దాడి చేయడానికి ముందు కూడా సద్దాం హుస్సేన్‌పై ఇలాంంటి ఆరోపణలే అమెరికా చేసింది. సద్దాం హుస్సేన్ వద్ద ప్రమాదకరమైన రసాయనిక ఆయుధాలు ఉన్నాయని అమెరికా ఆనాడు ఆరోపించింది. అమెరికాలోకి ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలను, కొకైన్‌ను రవాణా చేయడం ద్వారా అమెరికా యువత, అమెరికా ప్రజలను నిర్వీర్యం చేసేందుకు మదురో కుట్ర చేశారన్నది ఈనాడు ట్రంప్ చేస్తున్న అభియోగం. ఆయన డ్రగ్ కార్టెల్స్‌ను, మాదక ద్రవ్య వ్యాపారులను పెంచిపోషిస్తున్నారని ఆరోపించి ఖైదీ చేయడం ద్వారా వెనిజులాలో చమురు నిక్షేపాలను స్వాధీనం చేసుకుని తమ కంపెనీలకు పూర్వ వైభవం తీసుకురావాలన్న 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదం మేరకు ట్రంప్ ఈ చర్యకు పాల్పడ్డారు.

**నార్కో టెర్రరిజం ఆరోపణ హాస్యాస్పదం**

కానీ మదురోపై ట్రంప్ చేస్తున్న ఆరోపణలను అమెరికాలోని లివర్‌పూల్ మూర్స్ విశ్వవిద్యాలయంలో న్యాయ అధ్యయనాల ప్రొఫెసర్ జూలియా బక్స్‌న్ ఖండించారు. అసలు కొకైన్ జాడలే వెనిజులాలో లేవని అన్నారు. కొకైన్‌ను ఎగుమతి చేసే దేశాల జాబితాలో వెనిజులా లేదని, ఇదంతా పూర్తిగా హాస్యాస్పదమైన ఆరోపణలని తోసిపుచ్చారు. మెక్సికో నుండి పసిఫిక్ తీరం ద్వారా అమెరికాలోకి ఎక్కువ భాగం కొకైన్ ప్రవేశిస్తోందని అన్నారు. వెనిజులాలో అధికారాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడం కోసమే ట్రంప్ ఈ ఆరోపణలు చేస్తున్నారని జూలియా అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com